నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి : 6 సంచిక : 1 హైదరాబాద్ 59 జనవరి, 2016 పేజీలు : 52 వెల : 15/-

- చండీయాగం ఎవరి ప్రయోజనాలకు?
- రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు - అగ్రకులతత్వం
- యాగఫలం ఎవరి కళ్యాణానికి...?
- యాగాల తెలంగాణనా? పోరాటాల, త్యాగాల తెలంగాణనా?
- ప్రత్యామ్నాయ భాషను నిర్మిద్దాం
- పులులు - మనుషులు - రాజ్యం
- ప్రభుత్వాల వంచనే రైతు ఆత్మహత్యలకు కారణం

nadusthunna telangana

2015 డిసెంబర్ 18-27వరకు జరిగిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ దృశ్యాలు





బుక్‌ఫెయిర్‌లో నడుస్తున్న తెలంగాణ స్టాల్









నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాస పత్రిక

ISSN 2349-2376

జనవరి, 2016
సంపుటి : 6
సంచిక : 1

రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
[redacted]
క్వార్టర్ నెం. R-9, [redacted] క్వార్టర్స్,
ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్:nadusthunnatelangana@gmail.com

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854
ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.
IFSC: SBHY 0020350

సంపాదకుడి ఉత్తరం

యుద్ధ విరామం
గుండెను పిండేంత
దుఃఖ పూరితంగా ఉంటే
వీరుని సంగతి సరే...

అతడి జ్ఞాపకాలను
మోస్తున్న ఆమె గురించే ఈ కన్నీళ్లు

వాళ్లు ఒకరు చిలుక
మరొకరు గోరింక

ఆమెవి చిలుక పలుకులేమి కావు
యుద్ధగాత్రాన్ని
అమరుని స్వప్నాన్ని
పగిడికంటెలా గానం చేస్తుంది

ఆమె ఇపుడు
ఏ పక్షితో [redacted]
సంభాషిస్తుందో

2 జనవరి 2016

తెలంగాణ తొవ్వ

చండీయాగం ఎవరి ప్రయోజనాలకు?

- స్నేహలత ఎం.

"ఎలాంటి అరిష్టాలు జరగకుండా భగవంతుడే దహనం చేసాడు. పూర్ణాహుతి జరిగిన వెంటనే ఇలా జరగడం శుభమే" ఇవి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తలపెట్టిన ఆయుత చండీయాగం చివరిరోజు చెలరేగిన అగ్నిప్రమాదపు మంటలను చూసి స్వామి స్వరూపానంద చేసిన వ్యాఖ్యలు. అంతా మిథ్యే అనే "శాస్త్రం"గా స్వామి స్వరూపానంద మాటలు. జరిగిన అగ్ని ప్రమాదాన్ని కూడా తమకు అనుకూలంగా మార్చుకుని మాట్లాడటం వారికే చెల్లు. మాటలైతే దాంభికంగా అంతా శుభమే, చండి మాత శుభం పలికిందంటూ మాట్లాడారు కానీ వారి వెనుకనే మంటలార్పే ఫైరింజన్లు, అందరిలో హడావిడి, పరిగెడుతున్న అధికారులు, సిబ్బంది, మాటల్లో ఒకరకమైన వణుకు కనిపిస్తూనే ఉన్నాయి. మంటలు చెలరేగిన వెంటనే అధికారులు, రాజకీయ నాయకులు, రుత్విక్కులు అందరూ చెల్లాచెదురుగా పరుగెత్తారని న్యూస్ వీడియోల్లో రికార్డయ్యాయి. చివరికి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్రపతి ఈ అగ్నిప్రమాదంతో యాగస్థలానికి కొద్ది దూరంలోనే ఆగిపోయాడు. ఇంత జరిగినా ఈ వార్త ఏ దినపత్రికల్లో ప్రధాన శీర్షిక కాకపోవడం ఆశ్చర్యకరం.

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు డిసెంబర్ 23 నుంచి 27 వరకు ఆయుత మహా చండియాగం నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణ వస్తే ఆయుత మహా చండీయాగం చేస్తానని మొక్కుకున్నాను, ప్రజా శ్రేయస్సు కోరి తీరిన తన మొక్కు చెల్లించడానికి, దేవిని ప్రసన్నం చేసుకోవడానికి తన స్వంత ఖర్చుతో యాగాన్ని నిర్వహిస్తున్నానని ముఖ్యమంత్రి ప్రకటించి యాగాన్ని పూర్తిచేసాడు.

ఆయుత మహా చండీయాగం అంటే? ఆయుత అనగా పది వేలసార్లు దుర్గా సప్తశతి(700 శ్లోకాల)ని వేదపండితులతో చదువుతూ చేసే హోమాన్ని ఆయుత చండీయాగం అని అంటారు. చండిక : చండుడను దనుజుని సంహరించునది, పార్వతి శరీరము నుంచి పుట్టినదేవి. ఈ చండి మాతను పూజిస్తూ జరిపేదే ఆయుత మహా చండీయాగం. యాగ స్థలంలో చండికాదేవి విగ్రహాన్ని కూడా ప్రతిష్టించారు. మరిప్పుడు కెసిఆర్ ఏ దనుజున్ని సంహరించటానికి ఈ యాగాన్ని చేసాడో?!

ఈ యాగానికి కేంద్ర మంత్రులు, గవర్నర్లు, న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, సినీ నటులు ఇలా అందరూ ఈ యాగంలో హాజరయ్యారు. ఈ తతంగమంతా జరగడానికి తన ఫాంహౌస్‌లో 40 ఎకరాల భూమిని చదునుచేసి యాగంలో పాల్గొనడానికి వచ్చే రుత్విక్కులు కోసం పర్ణశాలలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసారు. ముఖ్యమంత్రి ఈ ఐదు రోజులూ కుటుంబ సభ్యులతో సహా యాగంలోనే పాలుపంచుకున్నాడు. వెయ్యికి పైగా రుత్విక్కులు అనే బ్రాహ్మణ "శ్రేష్టులు" ఈ యాగంలో పాలుపంచుకున్నారు. వీరికి వండిపెట్టడానికి, ఇతర సహాయాలకు మరో 500 మంది బ్రాహ్మణులను పిలిపించారు. వారికి జరిగే భోజన ఏర్పాట్లు, హోమంలో ఆహుతయ్యే వస్తువులను తలుచుకుంటేనే తెలంగాణ రాష్ట్రంలో ఆకలితో అలమటిస్తున్న బీదబిక్కి జనం గుర్తుకురాక మానరు. యాగం జరిగినన్ని రోజులు వేద పండితులు, యాగంలో పాల్గొనే వారందరూ ఓ డ్రెస్ కోడ్ కూడా పాటించారు. ఇలా యాగమంతా ఆర్భాటంగా, ఖర్చుతో ముగిసిందనేది వాస్తవం. చివరి రోజు అనగా పూర్ణాహుతి రోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా మందీ మార్బలంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. పూర్ణాహుతిలో వేద పండితులు మంత్రాలు జపిస్తూ ఉంటే పసుపు, కుంకుమ, పండ్లు, కొబ్బరికాయలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో తిండి పదార్థాలను హోమంలో వేసి పూర్ణాహుతి చేసారు. ఇలా యాగం అంతిమ లక్ష్యం ఆహుతే.

60 ఏళ్లుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్న భౌగోళిక తెలంగాణలోనైనా సాగు, తాగు నీరు అందుతాయని, నిరుద్యోగులకు ఉద్యోగులు వస్తాయని, దళితుల మీద జరిగే దాడులు ఆగుతాయని, ఆదివాసులపై పాలకులు ప్రకటించిన యుద్ధం ఉండదని, మహిళల మాన ప్రాణాలకు రక్షణ ఉంటుందని, విద్యార్థులకు ఉచిత విద్య అందుతుందని, ముఖ్యంగా ప్రజలందరి భాష, యాస, సంస్కృతిపై ఏ రకమైన పెత్తనం ఉండదని కలలు గన్న తెలంగాణ ప్రజలకు అడుగడుగునా నిరాశే ఎదురవుతున్నది. ప్రజా కళలకు, సంస్కృతికి కేంద్రమైన తెలంగాణలో ఈ యాగాలు ఎవరి సంస్కృతి. ఎవరి ప్రయోజనార్థం ఇన్ని కోట్లు ఖర్చు చేసి ఈ యాగం నిర్వహించారు. పూర్వం రాజ్యాల కోసం, తమ వంశం వారే ఎప్పటికీ పరిపాలించాలని, తమ వంశం వర్థిల్లాలని చేసిన ఈ మూఢ విశ్వాసపు యాగాలు అగ్రకుల బ్రాహ్మణిజాన్ని కొనసాగించటానికి నిర్వహించారని వేరే చెప్పనక్కర్లేదు. తన స్వంత డబ్బులే ఖర్చుచేస్తున్నానని చెప్తున్న ముఖ్యమంత్రికి ఇన్ని వందల కోట్ల రూపాయలు ఎక్కడివో కూడా ప్రజలకు జవాబు చెప్పాలి. సంపాదన మనదే అయినంత మాత్రాన ముఖ్యమంత్రి హోదాలో ఉండి హిందూ మత భావజాలాన్ని పెంచి పోషించే విధంగా యాగాలు నిర్వహించడం లౌకిక వాదానికి విరుద్ధం. రాజ్యాంగ వ్యతిరేకం.

1 జనవరి 2016

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు - అగ్రకులతత్వం

సి.కాశీం

1990లో నేను మహబూబ్‌నగర్ జిల్లా లింగాల మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. చాలా నియమ నిబంధనలతో చదువు చెప్పేవాళ్లు. పాఠశాల దాటి బయటికి వెళ్లే అవకాశం దొరికితే మాకొక సంబరం. అట్లాంటి సమయంలో రాడికల్ విద్యార్థులు ఒక రోజు మ పాఠశాలకు వచ్చారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి మమ్మల్ని బయటికి తీసుకెళ్లారు. రోడ్ల మీద ర్యాలీ చేయించారు. అన్ని పాఠశాలల విద్యార్థులను కలిపి ర్యాలీ చేయించటం గొప్ప అనుభూతిని ఇచ్చింది. అంతేకాదు, మేమిచ్చిన నినాదాలు మాలో నూతన ఉత్తేజాన్ని ఇచ్చాయి.

'మండల్ కమీషన్‌ను అమలు చేయాలి'

'అవకాశాలకు అడ్డొస్తే అడ్డంగా నరికేస్తాం'

'ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యత వర్ధిల్లాలి'

టీనేజ్‌లో ఈ నినాదాలు కొత్తగా అన్పించాయి. విషయం అర్థం కాకపోయినా ఏదో తెలియని అలజడి. రోడ్ మీదికి వచ్చి నినాదాలు ఇవ్వటం మొదటి సారి. ఈ నినాదాలు - రాజకీయాలు అర్థంకావటానికి ఇంకో ఐదేళ్లు పట్టింది. కాని ఆ రోజు మేము రోడ్ మీద నినాదాలు ఇస్తూ ర్యాలీగా సాగుతుంటే అగ్రకులాల పిల్లలు మాత్రం అరుగుల మీద నిలబడి మావైపు కోపంగా చూసారు. ఎందుకో, ఆరోజు అర్థం కాలేదు. కాలేజీ చదువుల్లోకి వచ్చాక ఆనాటి వాళ్ల కోపానికి కారణం తెలిసొచ్చింది. వివిధ సందర్భాలలో అగ్రకుల అధ్యాపకులు, విద్యార్థులు 'కోటా' గాళ్లని మాట్లాడుతున్నప్పుడు అనుభవంలోకి వచ్చింది.

మండల్ కమీషన్ కాలంలో వచ్చినంత తీవ్రంగా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు ఈ పాతిక సంవత్సరాలలో రాలేదు గాని, అంతకంటే బలంగా రిజర్వేషన్ విధానాన్ని నీరుగార్చే కుట్రలు ఉధృతమయ్యాయి. వివిధ రూపాలలో మొన్నటి హార్థిక్ పటేల్ (గుజరాత్) వరకు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. మన చుట్టూ ఉండే ప్రజాస్వామిక వాదులలో కూడా వ్యతిరేక భావనలు అప్పుడప్పుడు బయటపడుతున్నాయి. రిజర్వేషన్ అనుభవించే కులాలలో కూడా తమ కింది కులానికి వాటా దక్కాలనే డిమాండ్ వచ్చినప్పుడు అట్లాంటి వ్యతిరేక ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది కూడా అగ్రకుల స్వభావం నుంచి వచ్చిన భావజాలమే. వీటన్నింటిని అర్థం చేసుకోవటానికే విరసం తన 25వ రాష్ట్ర మహాసభలలో ఒక పాఠంగా ఈ విషయాన్ని ఎంచుకున్నది. పాలకులు ప్రజలను మతం పేరుతో, కులం పేరుతో విభజిస్తూ పోరాడే ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ తీస్తున్నారు. సంక్షేమ పథకాల చుట్టూ ప్రజలను ఎంగేజ్ చేస్తూ తమ దోపిడి విధానాలను కొనసాగిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా, బంగారు తెలంగాణ, స్వర్ణాంధ్ర నినాదాలతో పేద, మధ్య తరగతి ప్రజలలో భ్రమలు కల్పిస్తున్నారు. యజ్ఞాలు, యాగాలు, యోగాల విషవలయంలో యువతను నిమగ్నం చేస్తున్నారు. వినాయకచవితి, దేవి నవరాత్రులు, అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలలు ధరించటం మొదలైన భక్తి కార్యక్రమాలలో నిరుద్యోగులను ముంచుతూ సామాజిక సమస్యల మూలాలను అర్థం చేసుకోకుండా చేస్తున్నారు. యువజనసంఘాలు, అభిమాన సంఘాల ఏర్పాటు, క్రికెట్ లాంటి క్రీడల నిర్వహణ చుట్టే యువతను తిప్పుతూ నిరుద్యోగం గురించి అడగకుండా, పోరాడకుండా చేస్తున్నారు. భారతజాతి అనే భావన వైపు, రామజన్మభూమి వైపు ప్రజల ఆలోచనలను మళ్లిస్తూ పాలకులకు వ్యతిరేకమైన ఆందోళనలు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రజల మధ్య వైరుధ్యాన్ని సృష్టించి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. హార్థిక్ పటేల్ నిర్వహించిన ప్రతిఘాతక ఆందోళన కూడా ఈ కోవలోకే వస్తుంది.

సైద్ధాంతికంగా చూసినప్పుడు పాలకులు వ్యవహరించే ఈ తీరంతా మంద్రస్థాయి యుద్ధంలో భాగమే. యుద్ధం ఆర్థిక, రాజకీయ, మానసిక యుద్ధాలుగా ఉంటుంది. ప్రజల పోరాట పటిమను దెబ్బతీయటానికి పాలకులు నిరంతరం ఇట్లాంటి ప్రతిఘాతక విధానాలకు, ఆందోళనలకు పురుడు పోస్తుంటారు. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు కూడా మంద్రస్థాయి యుద్ధంలో భాగమే. రక్తంబొట్టు చిందకుండా మనిషి విధ్వంసం కావడం ఈ కాలపు యుద్ధనీతి. అట్లాంటి మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో నిలబడి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలలో ఉండే అగ్రకులతత్వాన్ని మాట్లాడుకోవటం సముచితంగా ఉంటుంది.

ఈ వ్యాసంలో 'ఆందోళన' అనే పదాన్ని నెగిటివ్ అర్థంలోనే వాడుతున్నాను. నిజానికి పాలకవర్గాల విధానాలకు, అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు చేసేది పాజిటివ్ అర్థంలో ఆందోళన అవుతుంది. కాని ప్రజలకు వ్యతిరేకంగా జరిగేది ప్రతిఘాతక ఆందోళన అవుతుంది. కనుక ఈ అర్థంలోనే ఆందోళన అనే

పదాన్ని ఈ వ్యాసంలో ప్రయోగిస్తున్నాను. ఈ వ్యాసాన్ని అధ్యయన సౌలభ్యం కోసం ఈ క్రింది విధంగా విభజిస్తున్నాను.

1. రిజర్వేషన్ భావన పుట్టుక
2. రిజర్వేషన్ చరిత్ర
3. రిజర్వేషన్లు ఎందుకు
4. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు
5. అగ్రకుల అహంకారం.

1. రిజర్వేషన్ భావన పుట్టుక:

'రిజర్వేషన్' అదే పదానికి ప్రత్యేక వసతులు కల్పించుట అని అర్థముంది. భారత సమాజంలో వేల సంవత్సరాలుగా కొనసాగిన అసమానతల వలన అణచివేతకు గురైన కొన్ని కులాలకు సమాజంలో కొన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. బ్రిటిష్ పరిపాలన కాలంలోనే ఈ భావన పుట్టింది. ఈ భావన పుట్టటానికి అలౌకిక కారణాలేమీలేవు. లౌకిక కారణాలే మూలమయ్యాయి. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసులు, రైతులు, సంస్థానాదీశులు, సన్యాసులు, దళితులు, ముస్లింలు, అనేక తిరుగుబాట్లు చేసారు. విడివిడిగా జరిగిన ఈ తిరుగుబాట్లు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అస్థిర పర్చాయి. సువిశాలమైన భారతావనిలో ఈ నిరసనలను అణచివేయటం బ్రిటీష్ వాడికి సాధ్యంకాలేదు. ముఖ్యంగా ఆ అన్ని తిరుగుబాట్ల గుణాత్మకమైన వ్యక్తీకరణ 1857 తిరుగుబాటు. నిజానికి ఇది చరిత్రలో సిపాయిల తిరుగుబాటుగా నమోదైనా, అన్ని వర్గాల, కులాల ప్రజలు ఇందులో పాల్గొన్నారు. కనుక ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకురావాలని భావించింది. ముఖ్యంగా తిరుగుబాటులో ఎక్కువ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు దళితులు, వెనుకబడిన కులాలు, ఆదివాసులు. ఈ మూడు వర్గాల ప్రజలను మచ్చిక చేసుకోవాలని, అందుకు కొన్ని వసతులు, రాయితీలు వారికి కల్పించాలనే ఆలోచన బ్రిటిష్ పార్లమెంట్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి దూరంగా భాగస్వామ్యం లేకుండా ఉంటున్న ప్రజలను భాగం చేసుకోవడానికి ఉన్న అడ్డంకులను పరిశీలించింది.

ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగులలో అగ్రవర్ణాలే ఉన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులు, ఇంగ్లీష్ విద్య అందటం వలన అప్పటికే విద్య నేర్చుకొని ఉండిన బ్రాహ్మణులు వెంటనే ప్రభుత్వంలో దొరికిన అవకాశాలను అంది పుచ్చుకున్నారు. విద్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలను తమ చేతుల్లో పెట్టుకున్నారు. 1851 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని ప్రభుత్వం ఒక పరిశీలన చేసింది. వివిధ కులాల అక్షరాస్యత, ఉద్యోగ వివరాలు, సామాజిక స్థితిగతులు, జీవన పరిస్థితులు మొదలైన విషయాలను ప్రాతిపదికగా తీసుకొని సర్వే నిర్వహించారు. దీని ఆధారంగా ఒక రిపోర్టును తయారు చేసారు. ఈ రిపోర్టు ఆశ్చర్యకరమైన విషయాలను వెల్లడించింది. దేశంలో వివిధ సంస్థానాలలో, నేరుగా బ్రిటీష్ వారి ఆధీనంలో ఉన్న ప్రాంతాలలో బ్రాహ్మణేతర కులాలకు విద్య, ఉద్యోగాలలో కనీస ప్రాతినిధ్యం లేని విషయం బయట పడింది. ఈ విషయాన్ని బ్రిటీష్ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బ్రాహ్మణేతరకులాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లేక పోవటం వలన బ్రిటీష్ ప్రభుత్వంపై వారికి వ్యతిరేకత పెరిగింది. ఫలితంగా 1857లో జరిగిన తిరుగుబాటులో ఈ కులాలన్ని భాగమయ్యాయని జాన్ విల్సన్ అనే బ్రిటీష్ అధికారి ప్రభుత్వానికి తెలియ జేసాడు. కనుక బ్రాహ్మణేతర కులాలకు విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన సూచించాడు. దాని కోసం ఆకులాలకు ప్రత్యేక వసతులు కల్పించాలనే ఆలోచన వచ్చింది. అట్లా భారతదేశంలో రిజర్వేషన్ అనే భావన పుట్టింది. ఈ భావనకు బ్రిటీష్ అధికారులే మూలమయ్యారు.

రిజర్వేషన్ల చరిత్ర

భారతదేశంలో రిజర్వేషన్ల చరిత్ర ముస్లీం ప్రజలతోనే ప్రారంభమైంది. వాళ్లు ప్రత్యేక మతంగా ఉండటం వలన కూడా వెంటనే వాళ్ల హక్కులను సాధించుకోగలిగారు. ముస్లీంలు 1857 తిరుగుబాటులో ప్రధాన పాత్ర వహించటం కూడా ప్రభుత్వం వాళ్లను శాంత పర్చటం కోసం కూడా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలోనే అగ్రకులాలతో పోటీ పడలేమని గుర్తించిన ముస్లింలు ప్రత్యేక నియోజక వర్గాల కోసం డిమాండ్ చేసారు. ఈ డిమాండ్‌ను అంగీకరించిన బ్రిటీష్ ప్రభుత్వం 1878లో అహమ్మద్ ఖాన్‌ను వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆయన 1886లో ముస్లీం ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించాడు. విద్యా, ఉద్యోగ రంగాలలో ముస్లీం స్థితిగతుల మీద విస్తృతంగా ఈ సమావేశంలో చర్చించారు. ముస్లీంలు ఇంగ్లీష్ విద్యను అభ్యసించక పోవటం వలన చాలా నష్టపోరాయని ఈ సమావేశం గుర్తించింది. అంతేకాకుండా వీళ్లు ప్రభుత్వం ముందు రెండు నిర్దిష్ట ప్రతి పాదనలు పెట్టారు. ఒకటి ముస్లీంలకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని రెండు సివిల్ సర్వీస్ ఉద్యోగాల ఎంపిక కోసం హిందువులకు, ముస్లీంలకు నిర్వహిస్తున్న ఒకే పరీక్షను రద్దుచేసి వేర్వేరు పరీక్షలు నిర్వహించాలని అహమ్మద్‌ఖాన్ నాయకత్వంలో ప్రతినిధి బృందం ఈ డిమాండ్స్‌తో లార్డ్‌మింటోకు వినతిపత్రం ఇచ్చింది. ముస్లీం ప్రతినిధుల డిమాండ్స్‌ను మింటో అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ మోర్లేకు

పంపాడు. మోర్లే దీనిని ఆమోదించాడు. 1909లో ముస్లీంలకు ప్రత్యేక నియోజకవర్గాల బిల్లుకు ఆమోదం లభించింది. మొదటి డిమాండైన సివిల్ సర్వీసు ఉద్యోగాల ఎంపికకు ప్రత్యేక పరీక్ష అంశం మాత్రం ఆమోదం పొందలేదు. ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వమే అధికారికంగా కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే పద్ధతిని ప్రారంభించింది.

అయితే ఇది కేవలం ముస్లీంలకే పరిమితం కాలేదు. ముస్లీం సమాజం సాధించిన ప్రత్యేక నియోజక వర్గాల ప్రభావం మిగతా సమాజంలోని బ్రాహ్మణేతర కులాలపై పడింది. కుల వ్యవస్థలో తీవ్ర ప్రకంపనాలు మొదలు కావటానికి ఇదొక ప్రాతిపదికగా మారింది. అనేక శూద్ర కులాలు, అతి శూద్ర కులాలు (దళితులు) సిక్కు, క్రైస్తవ మతస్థులు కూడా తమకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలనే డిమాండ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ముందు పెట్టారు. అదే విధంగా తమ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాలలో ప్రత్యేక అవకాశాలు, కేటాయింపులు ఉండాలని డిమాండ్ చేశారు. కేవలం డిమాండ్స్ వద్దే ఆగిపోకుండా ఉద్యమాలు కూడా చేసారు. కుల జనాభాను సమీకరించి కుల సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం మీద ఒత్తిడిని తీవ్రం చేసారు. ముస్లీంలను, శూద్ర, అతి శూద్ర కులాలను భారతీయ సమాజం నుంచి చీల్చి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న జాతియోద్యమానికి ప్రజల మద్దతు లేదని చెప్పటానికి బ్రిటిష్ వాళ్లు చేస్తున్న కుట్రగా కొందరు దీనిని వ్యాఖ్యానించారు. ఇది పాక్షిక సత్యమే అయినప్పటికి సామాజిక వాస్తవికతను ఆనాటి బ్రాహ్మణీయ సమాజం అర్థం చేసుకోలేదు. దళితులను, శూద్రకులాలను సమాజానికి దూరం చేసారు. అంటరానితనాన్ని పాటించారు. విద్యకు దూరం ఉంచారు. ఇన్ని కారణాలను మరుగు పర్చి బ్రిటిష్ ప్రభుత్వ ప్రయత్నాన్ని సాకుగా చూపెట్టే ఆలోచనను ఇక్కడి అగ్రకుల సమాజం చేసింది. పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద పాలకుల స్వభావం ప్రజలను చీల్చటమే అనటంలో ఏమాత్రం సందేహం ఉండనక్కర్లేదు, కాని సామాజిక వాస్తవికత అనుకూలంగా లేకపోతే కూడా పాలకులు చేయగలిగేది ఏమీ ఉండదు. ఏదిఏమైనా ముస్లీంలు సాధించిన ప్రత్యేక నియోజక వర్గాలు దేశంలోని అన్ని వెనుకబడిన కులాల హక్కుల సాధనకోసం జరగబోయే ఉద్యమాలకు పునాదివేసాయి.

సంస్థానాలు - రిజర్వేషన్లు: సాహుమహారాజ్ కృషి

1885లో బరోడా(గుజరాత్) సంస్థానానికి రాజైన శాయోజీరావు గైక్వాడ్ కింది కులాల్లో విద్యను ప్రోత్సహించడానికి 30 పాఠశాలలను ప్రారంభించాడు. అందరికి నిర్బంధ ఉచిత విద్యను అందించాలని ఉత్తర్వులు జారీ చేసాడు. ఇది రిజర్వేషన్ లాంటి ఉత్తర్వులు కానప్పటికి కింది కులాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ప్రయత్నం. 1890లో మైసూర్ ప్రభుత్వం కూడా అంటరాని వాళ్ల కోసం రెండు పాఠశాలల్ని ప్రారంభించింది. సంస్థానాలతో రిజర్వేషన్ చరిత్ర గురించి చెప్పాల్సి వస్తే కొల్హాపూర్ (మహారాష్ట్ర) సంస్థానాధీశుడు ఛత్రపతి సాహు మహారాజు గురించి చెప్పాలి. ఈ దేశంలో విద్య, ఉద్యోగ రంగాలలో శూద్రులకు, అతిశూద్రులకు రిజర్వేషన్ కల్పించిన మొదటి వ్యక్తి. 1902లో రిజర్వేషన్ విధానాన్ని అమలుచేసి బ్రాహ్మణుల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. అయినా మొక్కవోని ధైర్యంతో దళితులు, వెనుకబడిన కులాలవైపు నిలబడ్డాడు. ఆయన ఈ రిజర్వేషన్ విధానాన్ని ముందుకు తీసుకురావటానికి ఒక సైద్ధాంతిక ప్రాతిపదికను ఆధారం చేసుకున్నాడు. బొంబాయి మాజీ గవర్నర్ లార్డ్ సిడెన్ హామ్‌కు సాహూ రాసిన లేఖ ద్వారా ఆయన ప్రాతిపదికను అర్థం చేసుకోవచ్చు. "భారతదేశంలోని దక్కన్ ప్రాంతం శతాబ్దాలుగా బ్రాహ్మణాధిక్యత కింద నలిగిపోతున్నది. మతపరమైన విషయాల్లో మాత్రమే కాక, రాజకీయాలు, వాణిజ్యం, విద్య, ఆర్థిక విషయాలు వంటి అన్నిరంగాల మీద బ్రాహ్మణుల పెత్తనమే కొనసాగుతున్నది. ఈ దేశంలోని సాధారణ ప్రజల ప్రయోజనాల రక్షణ కోసం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవటం అవసరం. లేకపోతే వాళ్లు బ్రాహ్మణ యాజమానుల ఆధిపత్యంలో నిస్సహాయంగా నలిగిపోకతప్పదు. ఈ ప్రజల రక్షణకు సరైన మార్గం ప్రాంతీయ కౌన్సిళ్లలోనూ, బ్రిటిష్ ప్రభుత్వ యంత్రాంగం లోనూ కింది కులాల ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించటమేనని నా అభిప్రాయం" (ఛత్రపతి సాహూ మహారాజ్: 2007 పుట.80) కొన్ని సంవత్సరాల పాటైన కింది కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేయాలని సాహు భావించాడు. సాహు చేసిన ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అంతేకాదు కాంగ్రెస్‌లో అతివాదిగా పేరుపొందిన తిలక్ 'కేసరి' పత్రికలో రిజర్వేషన్లకు వ్యతిరేకమైన అభిప్రాయాలను వ్యక్తం చేసాడు. దర్పంగా మహారాజు దళితులకు, వెనుకబడిన వారికి విద్య అవసరం లేదని వాదించాడు. 'ఆ వర్గాల పిలలు చదువుకోవడానికి బడికి వెళ్తే మా పొలాలలో పనిచేసేది ఎవ్వరని' అన్యాయంగా అడిగాడు.

ప్రభుత్వం తీసుకునే చాలా నిర్ణయాలు కింది కులాలకు ఉపయోగకరమైనవైతే బ్రాహ్మణ అధికారులు అవి అమలుకాకుండా అడ్డుకుంటున్నారు. అంతేకాకుండా వాటికి విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేసిన చాలా సందర్భాలను సాహు ప్రత్యక్షంగా ఎదుర్కొన్న తీరును

వివరించాడు. బ్రాహ్మణ అధికారులకు భయపడి కొన్ని సందర్భాలలో బ్రిటిష్ అధికారులు కూడా నిర్ణయాలు తీసుకునే విషయంలో ఉదాసీనంగా ఉన్న సందర్భాలను సాహు ఎన్నింటినో పేర్కొన్నాడు. మెజారిటీ ప్రజలకు రిజర్వేషన్లు వద్దని వాదించే మైనారిటీ ప్రజలను అనుమానించకపోతే తప్పు పాలకులది అవుతుందని ఆయన భావన. తాము భగవంతుని అవతారమని చెప్పే బ్రాహ్మణులు మొత్తం సమాజాన్ని తమ చెప్పుచేతుల్లో పెట్టుకున్నారు. కిందికులాల ప్రజల కర్మ క్రతువులకు రుసుం చెల్లించి బ్రాహ్మణుల మీద ఆధారపడవల్సి వస్తుంది. ప్రజల జీవితమంతా మతపరమైన విషయాలతో ముడిపడి ఉంటుంది. ఫలితంగా బ్రాహ్మణుల ఆధిపత్యం ఈ ప్రజల మీద కొనసాగుతుంది. "అందుకే కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం వారి మీద వుందని" సాహు బలంగా వాదించాడు. జడ్జీలూ, పోలీసులూ, కోర్టు గుమస్తాలూ బ్రాహ్మణులే అయినప్పుడు తమకు ఏ మాత్రం న్యాయం జరగదని కిందికులాల వాళ్లు అనుకుంటారు. కనుక సంబంధిత ఉద్యోగాలలోకి ఈ కులాలు ప్రవేశించాలంటే రిజర్వేషన్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఆనాటి సమాజంలో పాఠశాల, కళాశాలల్లో మొత్తం బ్రాహ్మణులే దర్శనమిస్తుంటారు. ఈ స్థితి మారాలంటే కనీసం ఇరవైఏళ్ల పాటైనా ఉద్యోగాల్లో, పాలనారంగంలో కింది కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని సాహు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి స్పష్టమైన సూచనలు చేసాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి సూచనలు చేసే ముందు సాహు వాటిన్నింటిని తన రాజ్యంలో అమలుచేసి చూపాడు. తన సంస్థానంలోని ప్రతి బ్రాహ్మణేతర కులానికి ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసి అందరికి విద్యను అందుబాటులోకి తెచ్చాడు. 1902 నుంచి 1922 వరకు చాలా నిర్దిష్టమైన చర్యలను సాహు చేపట్టాడు. దీని వలన కొల్హాపూరు సంస్థానంలో మొదట బ్రాహ్మణ విద్యార్థులు 2,522 మంది వుండగా, వెనకబడిన కులాల విద్యార్థులు 8,088 మంది, అస్పృశ్య కులాల నుండి 234 మంది విద్యార్థులున్నారు. 1922 సాహు మరణించేనాటికి బ్రాహ్మణ విద్యార్థుల సంఖ్య 2722 అయితే వెనకబడిన కులాల సంఖ్య 21,027 మందీ, అస్పృశ్య విద్యార్థులు 2,162 మందీ వున్నారు. దీనంతటికి కారణం సాహు 1902లో తెచ్చిన రిజర్వేషన్ చట్టమే. వెనకబడిన కులాలు, అస్పృశ్యులు విద్యావంతులు కావటం వలన బ్రాహ్మణ కులాల్లో కలవరం మొదలైంది. ఈ చట్టం వలన కొల్హాపూరు సంస్థానంలో మొదటిసారిగా ప్రభుత్వ ఉద్యోగాల్లోకి బ్రాహ్మణేతరులు ప్రవేశించారు. అట్లే కులకర్ణి, పాటిల్(గ్రామాధికారులు) ఉద్యోగాలలో ఎన్నో ఏళ్లుగా బ్రాహ్మణులు ఉండేవారు. దానిని తిరగరాస్తూ బ్రాహ్మణేతర కులాలకు ఆ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత సాహుదే. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని బ్రాహ్మణులు సాహు మీద తీవ్రమైన నిరసనను వ్యక్తం చేసారు. కొల్హాపూరు నుండి వెలువడే సమర్థ్(1906, ఆగస్టు 8వ సంచిక) పత్రికలో ఇలా రాసారు.

"బ్రాహ్మణ సమాజమంతా యిప్పుడొక తీవ్రమైన నిషేధానికి గురయ్యింది. వెనకబడిన కులాలను అభివృద్ధి చేస్తున్నామనే సాకుతో, కీలకమైన పదవులన్నింటినీ మరాఠాలకు కట్టబెడుతున్నారు. ఆఫీసులన్నీ మరాఠా ఉద్యోగులతో నిండిపోతున్నాయి. ఆ కులాల్లో తగినంతమంది విద్యావంతులు లేకపోయినప్పటికీ, మరాఠాలయితే చాలునన్న అర్హతతో ఉద్యోగాలను వాళ్లకు అప్పగిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వోద్యోగాలన్ని అసమర్థులతో నిండుతున్నాయి. ఈ పరిణామాల వల్ల బ్రాహ్మణులందరూ భవిష్యత్తు గురించిన ఆందోళనతో భయకంపితులయి పోతున్నారు" ఇవ్వాళ అగ్రకులాలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో ముందుకు తీసుకొస్తున్న 'ప్రతిభ' సిద్ధాంతానికి మూలాలు ఇక్కడే ఉన్నాయి. ఆనాటి కాంగ్రెస్‌లో ఉదారవాదులుగా ముద్రవున్నవాళ్లు కూడా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. రనడే కాంగ్రెస్‌లో మితవాది. ఆయన ఒక సందర్భంలో మాట్లాడుతూ "చేతిలో అధికారం వుంది గనుక కింది కులాలకు ఉద్యోగాలు కట్టబెట్టవచ్చు. కాని మనతో సమానమైన సమర్థతతో వాళ్లు బాధ్యతలను నిర్వహించగలరా? అన్నదే నా ప్రశ్న" (ఛత్రపతి సాహు మహరాజ్; 2007 పుట.22) అని అన్నాడు. అతివాదైనా, మితవాదైనా బ్రాహ్మణుడైతే చాలూ రిజర్వేషన్‌ను వ్యతిరేకించటానికి ప్రాతిపదిక వుంటుంది. సాహు అస్పృశ్య కులాలను కూడా ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చాడు. వారికి వివిధ ఉద్యోగాలలో అవకాశాలు కల్పించాడు. అంతేకాదు అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేసాడు. అస్పృశ్యుల కోసం పెట్టిన ప్రత్యేక పాఠశాలలను రద్దుచేసి అందరూ ఒకే పాఠశాలలో చదువుకునేలా చర్యలు తీసుకున్నాడు. 1919లోనే అస్పృశ్యత పాటించటం నేరమని చట్టం చేసాడు. 1920లో వెట్టి నిర్మూలన చట్టం చేసాడు. రాజ కుటుంబంలోని వివిధ ఉద్యోగాలలోకి అస్పృశ్యులను తీసుకోవటం వలన వాళ్లు అందరితో సమానంగా సంచరించే అవకాశం ఏర్పడింది. ఈ దేశంలో రిజర్వేషన్ అనే భావనను స్పష్టమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక అవగాహనతో అర్థం చేసుకొని ఎన్ని అడ్డంకులు ఎదురైనా అమలుచేసిన మొదటివ్యక్తి సాహు కావటం వలన ఇంత వివరంగా ఆయన గురించిన ప్రస్తావన చేయవల్సి వచ్చింది.

మైసూరు సంస్థానం దివాన్ విశ్వేశ్వరయ్య వెనుకబడిన కులాలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించటానికి కొన్ని చర్యలు

చేపట్టాడు. 1914లో కింది స్థాయి ఉద్యోగాలను ఈ కులాలకు రిజర్వు చేసారు. 1916లో 25 శాతం ఉద్యోగాలను అర్హత వున్న వెనుకబడిన కులాలకు రిజర్వు చేసారు. వెనుకబడిన కులాల ప్రజలు చేసిన ఉద్యమం ఫలితంగా మైసూరు ప్రభుత్వం కమ్యూనల్ జీవోను జారీ చేసింది. దీని ప్రకారం వెనుకబడిన కులాలకు ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1922లో కలకత్తా ప్రెసిడెన్సీలో బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి మూడు ఉద్యోగాలలో ఒక ఉద్యోగాన్ని నామశూద్రులకు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నది. 1919లో మాంటెంగ్ చెమ్స్ ఫర్డు సంస్కరణలో భాగంగా వెనుకబడిన కులాలకు పరిపాలన సంస్థలలో భాగస్వామ్యం ఉండాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కల్పించారు.

సైమన్ కమీషన్-రిజర్వేషన్లు:

బ్రిటిష్ ప్రభుత్వం తరపున రిజర్వేషన్ విధానం మీద నిర్దిష్టంగా పరిశీలన చేయడానికి వేసిన కమీషన్ ఇది. దేశవ్యాపితంగా వివిధ సంస్థానాలలో, ప్రెసిడెన్సీలలో వెనుకబడిన, దళిత కులాలు నిత్యం ప్రభుత్వానికి విరివిగా విజ్ఞప్తులు ఇచ్చాయి. ప్రజలు తమ తమ కులాల కింద సమీకరించబడి తమ హక్కుల గురించిన డిమాండ్స్‌ను ప్రభుత్వం ముందుపెట్టారు. ఇన్నిరకాల నిరసనలు, డిమాండ్లు, విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1919లో మాంటెంగ్-చెమ్స్‌ఫర్డు సంస్కరణలు ప్రవేశపెట్టాక కింది కులాలలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి సైమన్ కమీషన్ వచ్చింది. ప్రతీకులం తమకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని కూడా అనేక విజ్ఞప్తులు ప్రభుత్వం ముందుకు తెచ్చాయి. ఇది కూడా సైమన్ కమీషన్‌కు ఒక ప్రాతిపదిక. ప్రత్యేక ఎన్నికల నియోజక వర్గాల డిమాండ్స్‌ను పరిశీలించ టానికి వచ్చిన సైమన్ కమీషన్‌లో సభ్యులుగా భారతీయులు ఎవరు లేరనే సాకుతో జాతీయ కాంగ్రెస్, హిందు మహాసభ, అగ్రవర్ణాలు దీనిని బహిష్కరించమని పిలుపునిచ్చాయి. కాని తమిళనాడు, ఆంధ్రలో జస్టిస్ పార్టీ, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ ఈ కమీషన్‌కు స్వాగతం పలికారు. కమీషన్ ముందు హాజరై తమ కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని విన్పించారు. అన్ని విషయాల మీద సమగ్ర అధ్యయనం చేసిన కమీషన్ 1929లో రిపోర్టును బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పిస్తూ కింది కులాలకు ఉద్యోగాలలో, కౌన్సిల్స్‌లో సరైన ప్రాతినిధ్యం లేదని చెప్పింది. దీని గురించి సమగ్రంగా చర్చించి ఒక విధాన నిర్ణయం తీసుకోవాలంటే రౌండ్ టేబుల్ సమావేశాలు అవసరమని భావించింది.

రిజర్వేషన్లు-అంబేద్కర్

"డా॥అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాలకు, రాజకీయ హక్కులను పార్లమెంట్‌లోనూ రాష్ట్ర చట్టసభలలోనూ తగిన ప్రాతినిధ్యాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాలలో తగిన సభ్యత్వాన్ని, ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగాలలో రిజర్వేషన్ ద్వారా తగిన ప్రాతినిధ్యాన్ని సంపాదించి పెట్టారని"(అద్వితీయుడు; 2014 పుట.95) జస్టిస్ పున్నయ్య విశ్లేషణను పరిశీలిస్తే భారతదేశంలో వెనుకబడిన, ఎస్సీ, ఎస్టీలకు, ముస్లింలకు, స్త్రీలకు, వికలాంగులకు రిజర్వేషన్లు అందటానికి అంబేద్కర్ చేసిన కృషి అర్థమవుతుంది. అవమానాల జీవితం నుంచి పుటం పెట్టిన బంగారంలా ఎదిగిన అంబేద్కర్ ఆ అవమానాలకు కారణమైన వ్యవస్థను మార్చటానికి జీవితాన్ని అంకితం చేసాడు. తన పోరాట క్రమంలో ఎక్కడా రాజీ పడకుండా (రాజీ పడాల్సి వస్తే తన వర్గ ప్రయోజనాల కోసమే..) అగ్రకుల బ్రాహ్మణీయ సమాజంతో పోరాటం చేసాడు. అణచివేతకు గురైన కులాలకు రిజర్వేషన్ల లాంటి పరిమిత ప్రయోజనాలైన నెరవేరాలని గాంధీ అండ్ కాంగ్రెస్‌తో ఒకరకంగా యుద్ధమే చేసాడు. "అస్పృశ్యులు ఇస్లాం మతం లేదా క్రైస్తవ మతం స్వీకరించినా తాను అభ్యంతరం వ్యక్తం చేయబోనని అస్పృశ్యతకు రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకించగలనని"(డబ్ల్యు-ఎన్.కుబేర్-అంబేద్కర్ 2012 పుట.120) గాంధీ అంటే ఆ గాంధీతో తలపడి రిజర్వేషన్లు సాధించి పెట్టిన యోధుడు అంబేద్కర్.

అనేకమంది సంస్కరణవాదులు, సామాజిక విప్లవ కారులు, బ్రిటిష్ అధికారులు వెనుకబడిన, దళిత, ఆదివాసీ ప్రజల పట్ల సానుభూతితో 1885 నుంచి ప్రవేశపెడ్తూ వచ్చిన రిజర్వేషన్ విధానానికి అంబేద్కర్ తన కాలంలో సైద్ధాంతిక దృక్పథాన్ని ఇచ్చాడు. తనకు ముందు జరిగిన అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగానే అంబేద్కర్‌కు ఈ దృష్టి ఏర్పడింది. ఏ మనిషికైనా తనకు ముందు ఉండిన సామాజిక వాతావరణం, తన కాలంలో చుట్టూ నిర్మాణమై ఉన్న సామాజిక స్థితియే అతని దృక్పథాన్ని, ఆలోచనను నిర్ణయిస్తుందని తత్వశాస్త్రం చెబు తుంది. కనుక అంబేద్కర్ అట్లా నిర్మాణ మయ్యాడు. 1918 నుంచి ఆయన పూర్తికాలం సామాజిక కార్యాచరణలోకి ప్రవేశించాడు. ఈ కాలం నుంచే కింది కులాలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసాడు. సైమన్ కమీషన్ ముందు ప్రత్యేక నియోజక వర్గాలు, రిజర్వేషన్లు కావాలని కోరాడు, మొదటి(1930) రెండో(1931) రౌండ్ టేబుల్ సమావేశాలలో అంటరానివర్గాల ప్రతినిధిగా పాల్గొని తమ ప్రజల హక్కుల సాధన కోసం గొంతు విన్పించాడు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఎరవాడ జైలులో గాంధీ నాటకాన్ని రసాభాసం చేసాడు. పూనా ఒడంబడిక ద్వారా ఎస్సీ,

ఎస్టీలకు రిజర్వేషన్లు సాధించిపెట్టాడు. రాజ్యాంగ ముసాయిదా కమిటి ఛైర్మన్‌గా రాజ్యాంగ పరిషత్తు సమావేశాలలో విస్తృతమైన చర్చలు చేసి రిజర్వేషన్లకు సైద్ధాంతిక దృక్పథాన్ని కల్పించాడు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు శాశ్వతంగా, బీసీలకు ఇతర అణచివేయబడిన వర్గాలకు రిజర్వేషన్లు అందడానికి కావల్సిన పునాదిని రాజ్యాంగంలో రూపొందించాడు. ఇది స్థూలంగా రిజర్వేషన్ల చరిత్ర.

రిజర్వేషన్లు ఎందుకు

రిజర్వేషన్లు అనేవి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అమలు చేయాలన్నది రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయం. మొదటి రెండు రంగాలలోను రిజర్వేషన్లు అమలవుతున్నట్లు పైకి కన్పిస్తుంది. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే అక్కడ కూడా పాక్షికంగానే అమలవుతున్నాయి. ఇక రాజకీయ రంగంలోనైతే అగ్రకుల నాయకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి రిజర్వేషన్లు అమలవుతుంటాయి. సంపదలో రిజర్వేషన్లు ఎలాగూ లేవు. వాస్తవానికి రిజర్వేషన్లు ఎవరి జనాభా దామాషా ప్రకారం వారికి సంపద దక్కేటట్లు ఉండాలి. కాని ఈ దేశంలో సంపద మీద హక్కు ఉన్న అగ్రకులాలు తమ ఇష్టారీతిగా అమలుచేసే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఉండటం నామమాత్రమైన విషయమే. రాజకీయాలలో కూడా ప్రత్యక్ష ఎన్నికలలో రిజర్వేషన్లు ఉంటాయే తప్ప నామినేటెడ్ పదవులకు రిజర్వేషన్లు ఉండనే ఉండవు. కనుక రిజర్వేషన్లు అనేవి విద్య, ఉద్యోగ రంగాలకు సంబంధించినవే.

విద్యకు, ఉద్యోగాలకు పుస్తక జ్ఞానమే గీటురాయి. పుస్తక జ్ఞానమంటే కేవలం అక్షరాలు మాత్రమే కాదు, అక్షరాల వెనుక ఉండే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలు. అంటే ఒక సమాజానికి చెందిన భావజాలాన్ని నేర్చుకుంటూనే అందులో అంతర్భాగంగా విషయ పరిజ్ఞానాన్ని కూడా పొందుతాం. ఈ రోజు మనం నేర్చుకుంటున్న విద్యలో అగ్రకుల బ్రాహ్మణీయ సంస్కృతి, భావజాలం మాత్రమే ఉంటాయి. దీనికి తోడు మనం మూడు శతాబ్దాలుగా అలవాటు చేసుకున్న సామ్రాజ్యవాద సంస్కృతి కూడా ఉంటుంది. సంస్కృత భాషలో వేదాలను, ఇతిహాసాలను,పురాణాలను నేర్చుకున్నది అగ్రకుల బ్రాహ్మణులు, వీళ్లే ఇంగ్లీష్ విద్య ఈ దేశంలో వచ్చేసరికి దానినీ నేర్చుకున్నారు. కనుక పుస్తక జ్ఞానాన్ని అందుకోగలిగింది అగ్రకుల బ్రాహ్మణులే. ఈ విద్య వీళ్లకు ఒంట పట్టినంత సులభంగా ఇతర కులాలకు రాదు. కనుక విద్యా, ఉద్యోగ రంగాల మీద ఈ అగ్రకులాలే ఆధిపత్యం కలిగి ఉంటాయి. అందుకే అణచివేతకు గురైన కులాలు, వేల సంవత్సరాలుగా చదువులకు దూరంగా ఉన్న సమూహాలు రిజర్వేషన్లు కావాలని అడగడం, ఈ ప్రజాస్వామిక డిమాండ్‌కు అందరూ మద్దతు తెలియచేయటం. అమెరికా, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోకి గత ముప్పై ఏళ్లుగా వెళ్తున్నది అగ్రకులాలే. అక్కడి సంస్కృతితో, భాషతో పోటీ పడలేక వీళ్లు ఆ దేశస్థులతో సమానంగా ఎదుగ లేకపోతున్నారు. కనుక అక్కడ తమకు ప్రత్యేక రాయితీలు కావాలని అడుగుతున్నారు. విదేశాలకు వెళ్లిన అగ్రకులాలు రాయితీల కోసం అడగటం ఎంత న్యాయమైనదో, మన దేశంలో వేల సంవత్సరాలుగా సంపదకు, చదువుకు దూరమైన కులాలు ఇక్కడ రిజర్వేషన్లు అడగటంలో కూడా అంతే న్యాయముంది. సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలతో ఉత్పత్తిని సృష్టించే మనుషులు, ఆ ఉత్పత్తిని పరాన్నభుక్కులు అపహరిస్తుంటే ఎన్నడూ అడ్డు చెప్పలేదు. వాళ్లు మాతోటి మనుషులే కదా! అని ఆదరించారు. అట్లాంటి శ్రమజీవుల పిల్లలకు రిజర్వేషన్లు కల్పించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. చెప్పులు కుట్టినవాళ్లు, బట్టనేసినవాళ్లు, గొంగడి అల్లినవాళ్లు, కుండ తయారుచేసినవాళ్లు, కర్రు-నాగలిని రూపొందించినవాళ్లు, మురికి బట్టలు ఉతికినవాళ్లు, వెంట్రుకల్ని కత్తిరించినవాళ్లు ఇట్లా వీళ్లంతా సమాజ పురోగమనంలో భాగమయ్యారు. వాళ్ల వృత్తిని సామాజిక బాధ్యతగా గుర్తించి చేసారు. ఏనాడు నిరాకరించలేదు. కొందరిని మాత్రమే చదువుకొమ్మని చెప్పి వీళ్లందరు కష్టపడ్డారు కదా! మరి వాళ్లు కూడా చదువు కుంటామంటే అవకాశాలను కొందరి వద్దనే కేంద్రీకరించుకుంటే ఎట్లా?

'సమానులైన వారు లేదా ఒకే విధమైన వారికి మాత్రమే చట్టం సమానంగా ఉండాలి, కాని అదే అసమానుల మధ్య వర్తించదు' అనే అంబేద్కర్ భావన రిజర్వేషన్లకు ప్రాతిపదిక. ఆర్టికల్ 14 'ప్రత్యేక ప్రయోజనాలు కలవారు, లేదా సమాన ప్రయోజనాలు గల వారితో అసమానులుగా వున్నవారికి సమానత్వం కల్పించటానికి, ఉద్దేశించబడినది కాదు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీలకు సమాన అవకాశాలు కల్పించటం కోసం రిజర్వేషన్లను ఒక హక్కుగా అంబేద్కర్ కోరారు. ఎస్సీలకు హక్కులు, అక్షరం నిరాకరించబడ్డాయి. కనుక వాళ్లు ప్రస్తుత సమాజంలో అగ్రకులాలలతో సమానం కాదు. "గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు, పెత్తందార్లూ అగ్రకులాల నుండి వచ్చినవారే. పట్టణ ప్రాంతాల్లో పెద్ద వ్యాపారులూ, పెద్ద పెట్టుబడిదార్లూ, ఉన్నత అధికారులూ అగ్రకులాల నుండి వచ్చినవారే. అలాగే కొద్దీ గొప్ప భూమి కలిగిన పాలిత ధనిక, మధ్యతరగతి రైతుల్లో

అత్యధికులు అగ్రకులాల వారే"(శంబూకుడు–రిజర్వేషన్లపై; 1991 పుట.29) ఇక మిగిలింది ఎవరు? ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు, వీళ్లు పేదలు. భూమి లేదు. సంపద లేదు. సమాజం కల్పిస్తున్న అన్నిరకాల అవకాశాలను మొదట తన్నుకపోగల అవకాశాలు సంపద కలిగిన అగ్రకులాలకే దక్కుతున్నాయి. మరి ఈ పేదలైన కులాలు అగ్రకులాలతో పోటీపడేది ఎప్పుడు? కనుక అసమానుల మధ్య పోటీని నివారించాలంటే రిజర్వేషన్లు ఒక ఉపశమనం.

రిజర్వేషన్లు సరిగ్గా అమలవుతున్నాయా?

భారత రాజ్యాంగంలోని పార్ట్–III ప్రాథమిక హక్కులు–సాధారణ వివరణ అనే అధ్యాయంలో ఆర్టికల్ 14 నుంచి ఆర్టికల్ 16 వరకు సమానత్వం అనే భావనను రాజ్యాంగ నిర్మాతలు పొందుపర్చారు. రిజర్వేషన్లకు సంబంధించిన ప్రస్తావన కూడా ఈ మూడు అధికరణలలో నిర్దేశించబడింది. 1950 జనవరి 26 నుంచి భారత సంవిధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. 65 ఏళ్లు గడిచాయి. కాని ఫలితాలను చూస్తే నిరాశాజనకంగా ఉన్నాయి. అగ్రకుల పాలకులు సాధ్యమైనంత వరకు రిజర్వేషన్లు అమలుకాకుండా చూసారు. పాలకులకు అగ్రకుల అధికారులు కూడా తోడయ్యారు. రిజర్వేషన్లను ఉపయోగించుకోవటానికి దళితులు తమ అర్హతలను పెంచుకుంటున్నప్పటికి చాలా ఉద్యోగాలు ఇప్పటికి ఖాళీగా ఉంటున్నాయి. వేలాది బ్యాక్‌లాగ్ పోస్టులు రాష్ట్రస్థాయిలోనూ, లక్షలాది బ్యాక్‌లాగ్ పోస్టులు కేంద్ర స్థాయిలోనూ ఉండిపోతున్నాయి. విద్యాలయాలు నిరుద్యోగులను తయారుచేసే కర్మాగారాలుగా మారిపోతూ లక్షల్లో నిరుద్యోగులు రోడ్ల మీద తిరుగుతున్నారు. ఇంతమంది అర్హులైన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు ఉన్నప్పటికి అగ్రకుల పాలకులు ఖాళీలను నింపటం లేదు. ఇదొక రకమైన సామాజిక వివక్ష కేంద్రీయ విద్యాలయాలైతే ఇంకా అగ్రహారాలుగా విలసిల్లుతున్నాయి. కొన్ని సంస్థలలోకైతే ఇప్పటికి దళితులకు ప్రవేశమే లేదు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫస్టు ర్యాంకు వచ్చినా వాళ్లకు రిజర్వేషన్‌లోనే సీటును కేటాయించే అగ్రకుల అధికారులు ఎందరో ఉన్నారు. చైతన్యం ఉండి నిలదీస్తే తప్ప ఓపెన్ కేటగిరిలో సీటు దక్కటం లేదు. ఎంత కష్టపడి చదివినా విశ్వవిద్యాలయ అగ్రకుల ఆచార్యులు 'గోల్డ్‌మెడల్' దళితులకు ఇవ్వరు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గురించి అధ్యయనం చేసి సూచనలు, సలహాలు ఇవ్వటానికి ఒక పార్లమెంటరీ కమిటి ఉంటుంది. అది ప్రతీ సంవత్సరం ఈ కులాల స్థితిగతులపై నివేదికను తయారుచేసి పార్లమెంట్‌కు ఇస్తుంది. ఈ కమిటి కొన్నిసార్లు సంవత్సరాలకు సంవత్సరాలు సమావేశం కూడా కాదు. పార్లమెంట్ ఏర్పాటు చేసిన కమిటి తీరే ఈ విధంగా ఉంటే ఇతర సంస్థల పనితీరు ఏ విధంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. ఈ కమిటి 1988లో తన నివేదికను సమర్పిస్తూ రైల్వే శాఖలోని 28 రకాల ఉద్యోగాలలో రిజర్వేషన్ నిబంధనలను అమలు చేయలేదని తెలియజేసింది. ఇప్పటికీ చాలారకాల కేంద్ర సంస్థలలో 27 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు నోచుకోవటం లేదు. బీసీ రిజర్వేషన్‌ను ఎలాగు పాటించడం లేదు. కానీ ఎస్సీ, ఎస్టీలకు, ఎం.ఫిల్, పిహెచ్.డి కోర్సులలో రిజర్వేషన్‌ను పాటించవల్సిన అవసరం లేదని యుజిసి(యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్) 2002లో సర్క్యులర్ జారీచేసింది. అది ఇప్పటికీ అమలవుతున్నది. ఫలితంగా చాలామంది ఎస్సీ, ఎస్టీలు పరిశోధన రంగానికి దూరమవుతున్నారు. ఫలితంగా వాళ్ల జ్ఞానం ఈ సమాజానికి అందకుండా అగ్రకులాలు కుట్ర చేస్తున్నాయి.

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు

రాజ్యాంగాన్ని తు.చ.తప్పకుండా అమలు చేస్తామని, రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటామని ఎమ్మెల్యే నుంచి రాష్ట్రపతి వరకు చట్టసభల ప్రతినిధులందరూ ప్రమాణం చేస్తారు. కాని అందరూ తు.చ.తప్పకుండా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ అమలు సందర్భంలో తేలిపోయింది. 65 ఏళ్లుగా రిజర్వేషన్లను అమలు జరపకుండా సాధ్యమైన మేరకు అగ్రకుల పాలకులు, అధికారులు వ్యవహరిస్తూ వస్తున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడలో ఉంటే రిజర్వేషన్లు అమలు చేయవల్సి వస్తుందనే కుట్రతో వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారు. చాలా చాకచక్యంగా రిజర్వేషన్లను అమలుచేసే బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. రిజర్వేషన్ల అమలు పరిస్థితి ఇలా ఉంటే అగ్రకుల, భూస్వామ్య ముద్దుబిడ్డలు, పత్రికలు, సంస్థలు రిజర్వేషన్ కమిట్‌మెంట్‌ను దెబ్బతీసేలా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలకు పూనుకుంటున్నారు. ఆనాటి రనడే, తిలక్, గాంధీల నుంచి ఈనాటి అరుణ్‌శౌరి, హార్థిక పటేల్ వరకు ఈ కుట్ర కొనసాగుతున్నది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగానే రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతున్నాయి. కనుక వీటి పట్ల అగ్రకుల పాలకులకు, అధికారులకు, వ్యతిరేకత ఉన్నప్పటికి దానిని బహిరంగంగా కాకుండా ఎక్కువసార్లు వివిధ అంతర్గత రూపాలలో వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ కులాలకు రిజర్వేషన్ అయితే 1950 నుంచి వచ్చింది గాని, వాళ్లు దాని

దరిదాపుల్లోకి రావటానికి ఇరవై ఏళ్లు పట్టింది. అంటే 1970 దశకంలో. ఎనభైల నాటికే అగ్రకులాలు అన్ని సంస్థలలోకి చేరిపోయారు గనుక ఎస్సీ, ఎస్టీల వలన వారికి పెద్ద నష్టం లేదు. ఇంకోవైపు 80వ దశకంలో ప్రైవేటీకరణ మొదలైంది. ఎప్పుడైతే బీసీల రిజర్వేషన్ అంశం ముందుకు వస్తుందో అప్పుడు అగ్రకులాలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకు బహిరంగంగానే సిద్ధమవుతున్నారు. అయితే ఇది బీసీలకు కల్పించే రిజర్వేషన్ అనేది ఉండకూడదని మొదలవుతుంది. ఇది భారతదేశంలో అగ్రకుల బ్రాహ్మణీయ భావజాలం నుంచి, తత్వం నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనగా మనం అర్థం చేసుకోవాలి. ఈ ఆందోళన వెనుక కేవలం కుల అంశం మాత్రమే లేదు. భూస్వామ్య, అగ్రకుల బ్రాహ్మణీయ పెట్టుబడిదారి లక్షణాలు ఈ ఆందోళనలో ఇమిడి ఉన్నాయి. దోపిడి వర్గ ప్రయోజనాలను కాపాడుకునే లక్ష్యంతో ఈ ఆందోళనలు మొదలవుతున్నాయి. విలువల కోణంలో చూసినప్పుడు భూస్వామ్య, అగ్రకుల బ్రాహ్మణీయ ఆధిపత్య విలువలను కాపాడుకోవటం కోసం నూతన పద్ధతులలో ఈ ఆందోళనలు ముందుకు వస్తున్నాయి.

"రిజర్వేషన్ వ్యతిరేకులు తమ ఉన్నత, మధ్యతరగతి వర్గాల లక్ష్యాలను కాపాడుకోవటానికి గాను అసమ్మతిని ప్రజాస్వామ్య పద్ధతుల పరిధి నుంచి తోసివేసి నూతన తరహా సైద్ధాంతిక పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఈ రోజు పాత విలువల స్థానే ఏర్పడుతున్న కొత్త సంబంధాలు మనముందున్న మార్గం ఏదో ఎంచుకోవల్సిన బాధ్యతను గుర్తుచేస్తున్నాయి"(బాధితుల మీదే బండలు; 1990 పుట.18) రిజర్వేషన్ అనే విషయాన్ని నిరంతరం వివాదాస్పద సమస్యగా మార్చడానికి కొందరు నిరంతరం ప్రయత్నం చేస్తుంటారు. అగ్రకుల పాలకులు ఒక పథకం ప్రకారం తమకు అనుకూలమైన సెక్షన్ ద్వారా, సాధనాల ద్వారా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక భావజాలాన్ని ప్రోది చేస్తూ రెచ్చగొడుతుంటారు. రిజర్వేషన్లను మానవతవాదుల నుంచి విప్లవకారుల వరకు అందరూ సమర్థిస్తారు. ఎవరి కారణాలు, ఎవరి సిద్ధాంతాలు వారికి ఉన్నాయి. కాని చాలా సందర్భాలలో మానవతావాదాన్ని ప్రదర్శించే అగ్రకుల ప్రజలు రిజర్వేషన్ల విషయంలో ఇంత ప్రతిఘాతకంగా మారడానికి కారణాలను విశ్లేషిస్తే దీనికి కారణం కూడా అగ్రకుల పాలకులే. వారి విధానాలే. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు ప్రారంభమైనప్పుడల్లా రెండు విషయాలు ముందుకు వస్తున్నాయి.

1. రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయడం.

2. కుల ప్రాతిపదికపై ఉండే రిజర్వేషన్ విధానాన్ని రద్దుచేయడం.

ఈ రెండు డిమాండ్ల వెనుక ఉన్నది అగ్రకుల స్వభావమే. అంతిమంగా రిజర్వేషన్ విధానాన్ని లేకుండా చేయడమే ఈ ఆందోళన వెనుక ఉన్న లక్ష్యం. వ్యతిరేక ఆందోళనల చరిత్రను గమనిస్తే మనకు ఈ విషయం బోధపడుతుంది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించటం ఒక రూపం. ప్రత్యక్ష ఆందోళనలకు దిగటం రెండో రూపం. ఈ ఆందోళనలు 1970లలో ముందుకొచ్చాయి. అగ్రకులాలకు, ఆధిపత్యానికి నిలయాలైన గుజరాత్, బిహార్ రాష్ట్రాలలో ఇవి మొదలైనాయి. గుజరాత్ రాష్ట్రంలో వెనుకబడిన కులాల రిజర్వేషన్లను 10 శాతం నుంచి 50 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో అగ్రకులాలన్నీ ఏకమై ఆందోళనకు దిగాయి. పెంచిన రిజర్వేషన్లను రద్దు చేయటమే కాకుండా అప్పటికే ఉన్న 10 శాతం రిజర్వేషన్లను కొనసాగించటంలో ఉన్న సమంజసాన్ని ప్రశ్నిస్తూ ఒక పరిశీలన కమిటీని ఏర్పాటు చేసేవరకు ఈ ఆందోళన కొనసాగింది.

1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనంతరామన్ (ఐఏఎస్) అధ్యక్షతన ఒక కమీషన్ నియమించింది. ఈ కమీషన్ బీసీ కులాల మీద అధ్యయనం చేసి వాళ్లకు రిజర్వేషన్ కల్పించాలని కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ప్రభుత్వం 1970లో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి వ్యతిరేకంగా అగ్రకులాలు ఏకమై ఆందోళనకు సిద్ధమయ్యారు. మరోవైపు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా అగ్రకుల కోర్టు కావటం వలన 1971లో బీసీ రిజర్వేషన్లు చెల్లవని తీర్పు నిచ్చింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే, సుప్రీంకోర్టు రిజర్వేషన్లను సమర్థించింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో 1977-78 సంవత్సరాలలో బీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. ఈ రిజర్వేషన్లను మరింతగా పెంచాలంటూ బీసీ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి ఫలితంగా 1981లో మురళీధర్‌రావు కమీషన్‌ను వేసారు. ఈ కమిటి రిపోర్టు ఆధారంగా 1986లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 25 శాతం రిజర్వేషన్లను 44కు పెంచుతూ జీవో జారీచేసాడు. దీంతో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన రాజుకున్నది. అగ్రకుల భూస్వాముల ముద్దుబిడ్డలు హైదరాబాద్ నగర రోడ్ల మీదికి వచ్చి నానా బీభత్సం సృష్టించారు. చివరికి మళ్లీ అగ్రకుల హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు ఎవ్వరూ వెళ్లలేదు.

(తరువాయి వచ్చేసంచికలో...) T

యాగఫలం ఎవరి కళ్యాణానికి...?

■ డా॥ జి. లచ్చయ్య

'నా స్వంత డబ్బు ఖర్చుపెట్టి ఆయుత చండీయాగం చేస్తున్నాను. ఇలాంటి యాగం గతంలో (2011) శృంగేరీ పీఠం వారు తప్ప చరిత్రలో చేసినవారెవరు లేరు. నాలుగు సంవత్సరాల క్రితం తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ సాకారమైతే యాగం చేస్తానని చండీమాతకు మొక్కుకున్నాను...' అంటూ, యాగంపై వస్తున్న విమర్శలకు సంజాయిషీలా నటిస్తూ కెసిఆర్ మాట్లాడిన మాటలివి. ఇతిహాస కాలాల్లో రాజులు, రారాజులు రాజ్య విస్తరణ కోసం రాజసూయ, అశ్వమేధ యాగాలు సంతానం కోసం, పుత్ర కామేష్టి, (క్రాపుత్రికామేష్టి కాదు) యాగాలు చేసి ప్రజల్ని సమిధలుగా చేసిన విషయం తెలుసు. ప్రజాస్వామిక దేశాల్లో ఇలాంటి యాగాలకు తావులేదు. అయినా, పీఠాధిపతులు రాజకీయ అండతో అప్పుడప్పుడు ఇలాంటి క్రతువుల్ని చేయడం చూస్తూనే ఉన్నాం. రెండు సంవత్సరాల క్రితం భద్రాచలంలో ఇలాంటి అతిరాత్ర యాగం ఒకటి జరిగింది కూడా తెలిసిందే!

ఇలాంటి యాగాలు చేపట్టిన ప్రతీసందర్భంలో చెప్పేది లోక కల్యాణానికని, ఈ యాగ నిర్వాహణ తర్వాత ఎలాంటి లోక కల్యాణం జరిగిందో అందరికి అనుభవంలో వున్నదే! ప్రజలకెన్ని సౌకర్యాలు కలిగాయో చూస్తూనే వున్నాం. ఇలాంటి యాగాలకు అదనంగా పేరుపొందిన దేవాలయాల్లో జరుగుతున్న వివిధ తంతులు తెలిసినవే! ఒకప్పుడు సాధారణ పూజలకే పరిమితంగా ఉండే దేవాలయాలు బ్రహ్మోత్సవాల లాంటి కార్యక్రమాల పేరున వారాలకు వారాలను కేటాయించి, ప్రత్యేక చానళ్ళద్వారా ప్రచారంచేసి జనాల్ని ఆకర్షించి, కోట్లాది రూపాయల్ని ఆర్జించే వ్యాపారంగా మారింది. వీటిని ప్రోత్సహించడానికై, రాష్ట్రాల గవర్నర్లు, దేశాధ్యక్షుడు, ముఖ్యమంత్రులు, ప్రధాన న్యాయాదీశులు మధ్య మధ్యలో దర్శించి దేవుళ్ళని, జరిగే తంతులను ప్రమోటు చేస్తూనే ఉన్నారు. ఇక పత్రికలు, టీవీ చానళ్లు పతాక శీర్షికన చూపుతూ ప్రజల మెదళ్లను తొలువడంతో వెలసిన, వెలుస్తున్న దేవుళ్ళను కొలువడం నిత్యకృత్యంగా మారిపోయింది. అయ్యప్పమాలలు వేసుకున్న పోలీసు సిబ్బందికి డ్యూటీకై అనుమతి నివ్వాలని పోలీసులు ప్రభుత్వానికి అర్జి పెట్టుకున్నారంటే, మతం మనుషుల్ని ఎంతగా బంధించి వేస్తూందో తెలుస్తున్నది.

గత జులైలో జరిగిన పుష్కరాలను ఇలాగే ప్రమోట్ చేసారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని గోదావరి తీరంలో కేంద్రీకరించారు. వారుమునిగి జనాన్ని మునిగేలా చేసారు. మరి ఈ ఆరునెలల్లో ఇరు రాష్ట్రాల్లో జరిగిన మార్పేంటి? రైతుల ఆత్మహత్యలు ఆగాయా? సమాజంలో లంచగొండితనం నశించిందా? ఆసుపత్రుల్లో ప్రజావైద్యం న్యాయంగా అందుతున్నదా? ఉద్యోగులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు న్యాయంగా, మానవీయ కోణంతో సేవల్ని అందిస్తున్నారా? మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర రాజకీయ నాయకులు అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నారా? స్వయాన ముఖ్యమంత్రులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, న్యాయబద్ధమైన పాలనను అందిస్తున్నారా? ఇవన్నీ పక్కన పెడదాం! నదికి, నీటికి, వరుణుడికి సంబంధం వుంటుందని భావించినప్పుడు, మొత్తం తెలుగు సమాజం పుష్కరాల్లో మునిగి పునీతులైనప్పుడు, వరుణుడు కరుణించి వర్షించాలిగా? ఎందుకు గోదావరి తెలంగాణలో వట్టిపోయింది? మిషన్ కాకతీయ ఎంత మేరకు నెరవేరింది? పుష్కరుడు ఈ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఎందుకు మార్చలేదు? ఇవన్నీ పిచ్చి ప్రశ్నలే అనేది మనం చెప్పే సమాధానం అయితే, చండీయాగం ద్వారా జరిగే లబ్ది ఎవరికి...? తెలంగాణలో పోశమ్మ, కాశమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ లాంటి శ్రమజీవుల దేవుళ్ళున్నారుగాని, చండీమాతలు లేరు. ఏడుపాయలలో మాత్రం ఈ ఆలయం వుంది. ప్రజలకు సంబంధమేలేని దేవతని యాగం పేరిట ఆరాధించడమంటే కెసిఆర్ నమ్మకాల్ని సార్వజనీనం చేయడమే! హేతుబద్ధతతో, శాస్త్రీయంగా యువతను తీర్చిదిద్దితేనే ప్రజాస్వామిక, లౌకిక, మానవీయ దృక్పథాలు అలవడుతాయి. ఈ గుణగణాలే ఆరోగ్యకరమైన సమాజాన్ని ఆవిష్కరిస్తుంది, కాని యాగాల ద్వారా కాదు.

ప్రజాస్వామ్య సాధనకు ఇంగ్లాండు లాంటి దేశంలో ప్రజలు అనేక పోరాటాలు చేసారు. 'మాగ్న కార్ట' లాంటి హక్కుల్ని సాధించుకున్నారు. ప్రపంచవ్యాపితంగా పోరాటాలు జరిగాయి. లక్షలాది మంది ప్రాణత్యాగాలు చేసారు. ఏ ఖండంలోను, దేశంలోను పోరాటం లేకుండా ఏ జాతి విముక్తం కాలేదు. ఏ దేశం స్వాతంత్ర్యం సాధించుకోలేదు. ప్రజలు లేని పోరాటమంటూ నేటికి చరిత్రలో ఎక్కడా కనపడదు. నాయకుడు లేని ఉద్యమాలున్నాయిగాని, ప్రజలు పాల్గొనని ఉద్యమం ప్రపంచంలో ఎక్కడా రికార్డు కాలేదు. పైగా ఈ పోరాటాల్లో చొరబడి, నాయకుడిగా చలామణి అయి, ఉద్యమాల్ని బలిపెట్టిన సంఘటనలు కూడా చరిత్రలో అనేకం. మన దేశం ఇందుకు మినహాయింపు కాకపోగా,

తెలంగాణ ఉద్యమమే చక్కని ఉదాహరణ. మొదటి దశ ఉద్యమాన్ని చెన్నారెడ్డి, మల్లిఖార్జున్‌లాంటి వారు హైజాక్ చేసి, కేంద్ర రాజకీయాలకు తాకట్టుపెట్టిన విషయం తెలిసిందే! అలాగే మలిదశ ఉద్యమాన్ని తిరిగి 1998లో జనసభ ప్రారంభించగా, ఈ నినాదాన్ని తన గొంతుతో వినిపించిన బెల్లి లలితను ముక్కలుగా నరికిన ప్రభుత్వంలో అధికారం వెలగడెట్టిన వ్యక్తి కెసిఆర్! నాడు ఉలకని, పలుకని కెసిఆర్ రాజకీయాల దృష్ట్యా, 2011లో తెరాసను స్థాపించడం, అప్పటికే ఉవ్వెత్తున కొనసాగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని 2004 నాటి ఎన్నికల సందర్భంగా వైఎస్ఆర్‌కు తాకట్టు పెట్టడం, మలుపులు తిప్పడం, మధ్యమధ్యన తెరమరుగుకావడం, ఉద్యమాల్లో చేరడం, నీరుగార్చడం మిలియన్‌మార్చ్, సాగరహారం, సకల జనుల సమ్మె సందర్భంగా అందరు చూసిందే!

'కలిసొచ్చే అదృష్టానికి నడిసొచ్చే కొడుకు....' అనే సామెత లాగా తెలంగాణ ఉద్యమం కెసిఆర్‌కు, ఆయన కుటుంబానికి, అనుచరగణానికి కలిసి రావడమే కాక, తెలంగాణ ఉద్యమ కాలంలోఉద్యమకారులపై రాళ్ళు వేసిన వారు, తెలంగాణ మాటనే ఉచ్చరించవద్దన్న టిడిపి నేత బాబుకు అడుగులకు మడుగులొత్తి రాజకీయాలబ్ధి పొంది, వివిధ హోదాల్లో మంత్రులుగా వెలిగొందినవారు జలకళ కనిపించిన తెరాసలో వంతులవారిగా చేరడం తెలిసిందే!

మనసా, వాచా తెలంగాణ ఉద్యమాన్ని అణువణువునా వ్యతిరేకించిన ఈ (వి)నాయకులు తిరిగి తెరాస ప్రభుత్వంలో గతంలోలాగానే వెలుగొందుతున్నారు. ఉద్యమ స్ఫూర్తితోచేరి, తెరాసలో జెండాల్ని మోసిన అసలుసిసలైన కార్యకర్తలు, మండల, జిల్లాస్థాయి నాయకులు కుడితిలోపడ్డ బల్లులా అయ్యారు. ఎరక్కపోయి తెరాసలో వీరంతా ఇరుక్కుపోయారు. పోతే, కొంతమంది ఉద్యమముసుగుతో లబ్ది పొందడం జరిగింది. ఇలా లబ్దిపొందిన వారే బంగారు తెలంగాణ అనే ఓ సూడో నినాదాన్ని ముందుకు తెచ్చారు.

'సరే! రాజకీయాలంటే ఆయారాం! గయారాం వుండేవేగా...?' అని భావిస్తే, అసలు తెలంగాణను ఏ లక్ష్యంతో సాధించుకున్నామనేది చర్చ జరగాలి. ఉద్యమ కాలంలో ఆంధ్ర రాజకీయవాదుల్ని, లాబీని ఎన్ని రకాలుగా తిట్టిపోసాం. తెలంగాణ ఉద్యమానికి కారకులు ఉద్యమాలు, ప్రజలు అని గుర్తించిన కేంద్రం అననుకూల రాజకీయ వాతావరణంలో తెలంగాణను ప్రకటించింది. దీంతో ఇరు రాష్ట్రాల్లో కాంగికి గడ్డుకాలం ఏర్పడింది. అటు తెదేపాకు, ఇటు తెరాసకు కలిసివచ్చింది. దీన్ని తెరాస కెసిఆర్ తెలివైన నాయకత్వంతోనే ఇది సాకారమైందని తెరాస కార్యకర్తలేకాదు తెరాసలో చేరిన, చేరుతున్న ఇతర రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం చేస్తున్నారు. ప్రజలు నమ్ముతున్నారా? లేదా? అనేది కాలం మున్ముందు తెలుపుతుంది.

తెలంగాణ ఉద్యమ కాలంలో తెరాస ఇచ్చిన నినాదాలేంటి? ఈ నినాదాలు తెలంగాణ ఏర్పడిన తర్వాత సాకారం జరుగుతున్నాయా? తెలివైన రాజకీయ నాయకుడు ప్రజల్ని, కార్యకర్తల్ని మూర్ఖులుగా, మూఢులుగా భావిస్తాడు. ఎవరికి లేనటువంటి దేవతా వస్త్రాలు నేసి ఇవ్వమని నేతకార్మికుల్ని రాజు కోరగా, రాజుకు బుద్ది చెప్పాలని భావించిన నేతగాళ్ళు బట్టలు నేయకుండానే నేసినట్టు నటించి, మూర్ఖులకు తప్ప అందరికి ఈ బట్టలు అగుపిస్తాయని చెప్పి, రాజు కట్టుకున్నట్లు భ్రమింపచేస్తారు. నిజంగానే దేవాతా వస్త్రాలు ధరించానని భావించిన రాజు అంబారిపై ఊరేగగా జనులందరు'ఆహాఁ! ఓహో!' అనగా ఓ చిన్నపిల్లవాడు రాజు నగ్నత్వాన్ని బయటపెట్టిన విషయం కథగా చెపుతాం. ప్రజల, ముఖ్యంగా పిల్లల తెలివి ముందు, రాజులు మూర్ఖులేనని ఈ కథలోని నీతి. ఇలాంటి వాస్తవ కథలకు గత చరిత్ర నిలయమే! అలాగే 'కింగ్ మిడాస్' కథ తెలిసిందే! ముట్టింది ప్రతీది బంగారం కావాలని కోరగా, తదాస్తు అన్న కథనంతో చివరికి కన్న కొడుకు బంగారంగా మారితేగాని, తన మూర్ఖపు కోరిక రాజుకు తెలిసి రాలేదు. ఇలాంటి నైతికతను తెలిపే కథలు మనకు తెలిసినవే! చరిత్రలో నిరంకుశులు, నియంతలు ఆయాకాలాలలో ఒంటెత్తు పోకడలు కొనసాగించినవారే. చరిత్ర హీనులుగా మిగిలినవారే.

ప్రజాస్వామ్యమంటే – 'ప్రజల కొరకు, ప్రజల వరకు, ప్రజలచే...' అని నిర్వచిస్తాం. మత రహిత, కుల రహిత సమాజం అంటూ ప్రవచిస్తాం. 'ఓటు' అనే పవిత్ర ఆయుధంతో నాయకులు ఎన్నుకోబడుతారని, ఇలా ఎన్నికైన నాయకులు మనసా, వాచా, కర్మనే స్వార్థరహితంగా ప్రజలకు సేవలందిస్తారని, అందించాలని అనుకుంటాం! ఇలా ఎన్నికైన నాయకులకు 'వ్యక్తిగతం' అంటూ వుండదని నానుడి గతంలోనైతే జీతభత్యాలు లేకుండా ప్రజాసేవకే అంకితం కాబట్టి, వీరిని 'గౌరవనీయులని' సంబోధించాం? ఇప్పుడు దండిగా జీతభత్యాలు, కాంట్రాక్టుల ద్వారా కమీషన్లు, దేశాన్ని తాకట్టు పెట్టుతున్నందుకు వీరికి కోట్లాది డాలర్లు అందుతూనే వున్నా, ఇంకా అదే సంబోధన చేస్తున్నాం. గత దశాబ్దంన్నరగా ఉద్యమాల్లో మునిగి తేలిన కెసిఆర్ కుటుంబ సభ్యులకు కోట్లాది రూపాయలు ఎలా సమకూరాయో తెలియదు. తాతముత్తాతల ఆస్తులే అంటే, ఇవి ఎలా పోగయ్యాయో మనకు అర్థంకాదు. పోనీ, ఎర్రవల్లిలోగల వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆస్తి అంటే, వ్యవసాయాన్నే నమ్ముకుని, జీవితాన్ని దారబోస్తున్న నిజమైన రైతుల సంపాదనను పక్కన బెడుదాం. ఎందుకు చస్తున్నారో నేటికి తేలలేదు. పైగా ఈ ప్రభుత్వాలు తేల్చుతున్నదేంటంటే,

చస్తున్న రైతులంతా కులరీత్యా, వృత్తిరీత్యా వ్యవసాయదారులు కావచ్చుగాని, చచ్చిన వారంత రైతులు కారని వాదన.

సరే! యాగం లోక కల్యాణానికే అంటే... మొక్కుల ద్వారానే తెలంగాణ సాకారమైతే, ఉద్యమాలు ఎందుకు చేసినట్లు? ఉద్యమకాలంలో ఈ మొక్కుల్ని బాహాటంగా ప్రకటించి, యువతీ యువకుల ఆత్మహత్యల్ని, వారి త్యాగాల్ని అపవచ్చుగా...? వీరి ఆత్మత్యాగాల్ని ఎందుకు సొమ్ముచేసుకున్నట్లు...? ఈ పాలన ఎందుకు? పథకాలెందుకు? మిషన్ కాకతీయలు, హరితహారం, పవర్‌గ్రిడ్‌లు, వాటర్‌గ్రిడ్‌లు, ఎత్తిపోతలు ఎందుకు? ఈ యాగఫలం వీటిని నెరవేర్చదా? ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్గించదా...? ఇవన్నీ ఎందుకు? ప్రజలు కాలుపై కాలువేసుకుని హాయిగా జీవించవచ్చుగా...? కొత్త రాష్ట్రంలో, కొత్త ప్రభుత్వం పాలనకు ఏడాదిన్నర కావస్తున్నది. రైతుల సమస్య పరిష్కారం కాకపోగా, ఆత్మహత్యల పరంపర కొనసాగడం, అందుకు కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజక వర్గంలోనే, అత్యధికంగా జరుగుతుండడం గమనార్హం! నేటికి ఈ ఆత్మహత్యలపై కెసిఆర్ మాటవరసకు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ ఏర్పడగానే నైజాంచక్కెర కర్మాగారాన్ని మూడునెలల్లో తెరిపించి, ప్రభుత్వమే నడుపుతుందని, అడ్డొస్తే తలనరికి గేటుకు వేలాడదీస్తానన్న కెసిఆర్ ఇప్పటికి ఒక్క తలను నరక లేకపోయాడు. ఎవరితల నరకాలో బహుశా అర్థంకావడం లేదనుకుంటా? సిర్పూర్ కాగజ్‌నగర్ పేపరుమిల్లు మూతపడింది. షరామామూలే! కార్మికులు వీధినపడ్డారు. ఆత్మహత్యల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేదు. ఇక మిగతా ప్రభుత్వరంగ సంస్థలది అతిగతి లేదు. పైగా బహుళజాతి సంస్థల్ని గొంతెత్తి పిలుస్తూ, భూమితోసహా వనరుల్ని దారాదత్తం చేస్తూ, ఉపాధి కల్పిస్తామని ఊదరగొడుతున్నారు. ఇందులో ఎంతమందికి ఉపాధి లభిస్తుందో కాలం చెపుతుంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏర్పడి పరీక్షలు నిర్వహించిన పోస్టుల సంఖ్య 2600 మాత్రమే! ఇంకా వీటికి నియామకాలు జరగలేదు. మిగతా పోస్టుల సంఖ్య తేలలేదు. డీఎస్సీది గందరగోళమే! ఎన్ని పోస్టులో తెలియదు. డీఎస్సీ, టెట్‌లు నిర్వహించినా నిజంగా నియామకాలు జరుగుతాయా అనేది సందేహమే! శిక్షణ పొందిన అభ్యర్థులు తిరిగి ఈ ప్రవేశ పరీక్షలు రాయాలా? అనేది చర్చకురాని అంశం! ఇవన్నీ కాలయాపనకు, ఉపాధ్యాయ ఖాళీల్ని, ఖాళీలుగా వుంచడానికే కాదా?

ఉద్యమకాలంలో నినదించిన మరో ప్రధాన అంశం కార్పోరేటు విద్యాలయాలగూర్చి, వైద్యంగూర్చి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ నినాదం తెరమరుగు కాగా, ఈ కార్పోరేట్ ఆలోచన మరింత బలోపేతమైంది. ఏ ఒక్క ఆంధ్రా కార్పోరేటు పాఠశాల, వైద్యశాల మూతబడకపోగా, దోపిడి నిరాటంకంగా కొనసాగుతూనే వున్నది. అసలు విద్యారంగం గూర్చి స్పష్టమైన అభిప్రాయాలే లేకుండా, మరో సూడో నినాదం కేజి టు పీజి ని ముందుకు తెచ్చారు. ఉన్న ప్రభుత్వ స్కూళ్ళని భూస్థాపితం చేయడం దీని లక్ష్యమని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సంఘాలు గుర్తించడం లేదు. ఇక వైద్యరంగ పరిస్థితి-కనీసం ఓ జిల్లా ఆసుపత్రి బాగుపడకపోగా, రాష్ట్రస్థాయి ఆసుపత్రుల దీనావస్థ అలాగే కొనసాగుతున్నది. ఏ ఒక్క కార్యాలయం అవినీతి రహితంగా మారలేదు. మారేలా రాష్ట్రపరిపాలన సాగడం లేదు. అదే లంచగొండితనం, అదే అవినీతిశాఖ వలేసిపట్టడం. 'బంగారు తెలంగాణ అంటే ఇదేనా?' ప్రభుత్వ శాఖలు ప్రజల్ని మనుషులుగా చూడని వ్యవస్థ మరింతగా బలిసిపోతే, బంగారు తెలంగాణ అనే ఓ భ్రమని పెంచడంలోని ఆంతర్యమేంటి? అసలు ఏ వ్యవస్థ అయినా బంగారు వ్యవస్థగా మారుతుందా? గతంలో ఇలాంటి వ్యవస్థలు వున్నాయా? రామరాజ్యం అని, గుప్తుల స్వర్ణయుగమని అని విన్నాం. ఇవన్నీ రచయితల, చరిత్రకారుల భావజాలమేకాని, నాటి ప్రజల వాస్తవ పరిస్థితి ఇప్పటికి తెలియదు. ఇదో నమ్మకం మాత్రమే!

ప్రజలకు బతుకు భారమైన వ్యవస్థ! బాలబాలికలకు భారమైన చదువు! అసలు చదువే అందని మరో వ్యవస్థ! భిక్షాటనతోపాటు రోడ్లపై కాగితాల్ని ఏరుకునే పిల్లలు ఓ వైపు అయితే, అయిదు సంవత్సరాలలోపు పిల్లలు దాదాపు 40 శాతం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వ్యవస్థలో 400 క్వింటాల్ల స్వచ్ఛమైన ఆవునెయ్యిని యజ్ఞగుండాల్లో దారపోస్తే, సమస్యలు తీరుతాయా? విద్యాహక్కు చట్టం ఆచరణ లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల చార్టర్ అమలుకాదు! వైద్యశాలలు పనిచేయవు. డాక్టర్లు అందుబాటులో వుండరు. వున్నా అన్నీ సౌకర్యాలలేమిలే! ప్రభుత్వ పాఠశాలలు కుంటినడకన నడుస్తాయి. ఎవరు ఎవరికి జవాబుదారీ కాదు. తెలంగాణ ఏర్పడక ముందు, తర్వాత ప్రజల జీవన విధానంలో మార్పు ఏమాత్రం కానరాని పరిస్థితి.

అదే పాలన అదే దోపిడి అదే సాచివేత అదే జవాబుదారీ తనంలేని ప్రభుత్వ వ్యవస్థలు అవే రాజకీయలబ్ధి కాంట్రాక్టులు. అవే కుంభకోణాలు. అదే అవినీతి. అదే రాజకీయ అండదండలు, సిండికేట్లు, మాఫీయాలు, గూండాలు ఏం మారింది? యాగంతో ఏం మారుతుంది? ఎవరికి ఈ యాగఫలం దక్కుతుంది? జనాలకు తెలియదనుకుంటే, కొవ్వొత్తులతో నిరసన తెలిపిన వారు కాగడాలు కుడా పడుతారని గుర్తిస్తే మంచిది. నిజంగానే కాళోజి వెళ్ళిపోయి బతికి పోయాడు – లేకుంటే, కర్రుకాల్చడం ఆలస్యమైతుందని, కొర్రాయిని అందుకునేవాడు! యాగం చివరి రోజున నిజంగానే చండీమాతకు కోపం వచ్చింది. అందుకే యాగశాల పరుశరామప్రీతికి గురైంది. ఇంత జరిగినా తిరిగి ప్రయుత చండీయాగం చేస్తానంటున్న కెసిఆర్ ఏవర్గపు ప్రతినిధో అర్థం చేసుకోవాలి.

యాగాల తెలంగాణనా? పోరాటాల, త్యాగాల తెలంగాణనా?

■ ఎన్ వేణుగోపాల్

తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు అయుత మహా చండీ యాగం జరపడం, ఆ యాగం ప్రభుత్వ కార్యక్రమం లాగ, తెలంగాణ కార్యక్రమంలాగ జరగడం చాల ప్రశ్నలకు చర్చకు ఆస్కారం ఇస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అయుత మహా చండీ యాగం చేస్తానని తాను మొక్కుకున్నానని, ఇప్పుడు రాష్ట్రం ఏర్పడింది గనుక ఆ యాగం చేస్తున్నానని ఒకసారి, విశ్వశాంతి, లోక కళ్యాణం, తెలంగాణ సౌభాగ్యం, ప్రజాశ్రేయస్సు కొరకు ఈ యాగం చేస్తున్నానని ఒకసారి ఆయన ప్రకటించారు. కాని ఈ రెండు వివరణలు కూడ చర్చకు నిలిచేవి కావు.

తెలంగాణ రాష్ట్రం అశేష ప్రజానీకం సాగించిన పోరాటాల వల్ల, త్యాగాల వల్ల, రాజకీయ ఎత్తుగడల వల్ల వచ్చిందా లేక ఒకానొక వ్యక్తి మొక్కు వల్ల వచ్చిందా అనే సందేహానికి మొదటి వివరణ దారితీస్తుంది. స్వయంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించానని చెప్పుకుంటున్న పార్టీ అధ్యక్షుడే తన మొక్కు వల్లనే తెలంగాణ సాధించిందని అనడం తన పద్నాలుగు సంవత్సరాల కృషిని తానే అపహాస్యం చేసుకున్నట్టవుతుంది. ఉద్యమక్రమంలో తెలంగాణ సమాజం యావత్తూ పాల్గొన్న అనుభవం ఉంది. చేపట్టిన ఎన్నో పోరాట రూపాలున్నాయి. చేసిన ఎన్నో కార్యక్రమాలున్నాయి. చివరికి తెలంగాణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాత చంద్రశేఖర రావే సకుటుంబ సమేతంగా వెళ్లి తెలంగాణ ఇచ్చినందుకు మరొక మాతకు కృతజ్ఞతలు చెప్పివచ్చారు. ఇప్పుడు ఆ కారణాలూ, పరిణామాలూ అన్నీ పక్కకు పోయి, కేవలం చండీమాత మొక్కు వల్లనే తెలంగాణ వచ్చిందనడం ఆయనకు స్వవచోవ్యాఘాతమని అనిపించకపోవచ్చు గాని తెలంగాణ సమాజానికీ, ఉద్యమకారులకూ అవమానం. తెలంగాణ కోసం ప్రాణాలు బలిపెట్టిన వందలాది మంది విద్యార్థి యువజనులకు అవమానం.

ఇక చండీ యాగం గురించి ఏ సాంప్రదాయక వివరణలో కూడ దాని లక్ష్యాలలో విశ్వశాంతి, లోక కళ్యాణం, లోక సౌభాగ్యం, ప్రజాశ్రేయస్సు అనే మాటలు లేవు. అతి తక్కువగా ఉన్నచోట్ల కూడ చాల అస్పష్టంగా ఉన్నాయి. సాంప్రదాయిక వివరణల ప్రకారం మార్కండేయ రుషి రాసిన మార్కండేయ పురాణం (రచనా కాలం క్రీ.శ. 400-500) లో దేవీ మాహాత్మ్యం లేదా దుర్గా సప్తశతి అనే ఏడువందల శ్లోకాల పదమూడు అధ్యాయాల భాగం ఉంది. ఈ దుర్గా సప్తశతిని పారాయణం చేస్తూ చేసే యాగాన్ని చండీయాగం అంటారు. ఒకసారి చదివితే చండీ యాగం అని, పది సార్లు చదివితే నవచండీ యాగం అని, వందసార్లు చదివితే శతచండీ యాగం అని, వెయ్యి సార్లు చదివితే సహస్ర చండీయాగం అని అంటారు. దక్షిణ భారతదేశం మొత్తానికీ మొదటిసారి అయుత (పదివేల సార్లు) చండీయాగాన్ని 2011లో తాము చేశామని శృంగేరి శారదా పీఠం చెప్పుకుంటున్నది. చండీయాగం ప్రధానంగా వ్యక్తులు మాత్రమే చేస్తారు. చేసే వ్యక్తి విజయ మార్గంలో ఉన్న ఆటంకాలను తొలగించడానికి మాత్రమే ఆ యాగం చేస్తారు. ఈ యాగంతో చెడుదృష్టి నుంచి తప్పించుకోవడం, రోగాలనుంచి విముక్తుడు కావడం, కష్టాలనుంచి గట్టెక్కడం, అనుకున్న కోరిక నెరవేర్చుకోవడం జరుగుతాయనే మాటలను బట్టి చూస్తే, ఇది బాణామతి, చేతబడి వంటి క్షుద్ర, తాంత్రిక ప్రక్రియలతో సమానమైనది. కాకపోతే ఇందులో రుత్విక్కులు అని పిలవబడే బ్రాహ్మణుల ఆర్భాటాలు, ఎక్కడా ప్రజలకు అర్థం కాకుండా జాగ్రత్తపడే సంస్కృత వ్యవహారం, వేల కిలోల నెయ్యి, విలువైన కర్రలు, భారీ భోజనాలు, సంభావనలు వంటి దుబారావ్యయం ఉంటాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే, బాణామతి, చేతబడి అనే మాటలు వినబడగానే ముఖం చిట్లించే మధ్యతరగతి విద్యావంతులు వాటికి సంస్కృత రూపమైన ఈ మహా చేతబడిని మాత్రం సగౌరవంగా చూస్తున్నారు, పాల్గొంటున్నారు, అసహ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.

ఈ యాగం చంద్రశేఖరరావు వ్యక్తిగా, తన సొంతఖర్చుతో, సొంత స్థలంలో చేశారనీ, వ్యక్తిగా ఆయనకు ఆ హక్కు లేదా అనీ కూడ బుద్ధిమంతులు ఆగ్రహంగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఉండే వ్యక్తికి బాణామతి, చేతబడి వంటి వాటిమీద నమ్మకం ఉండవచ్చు. కాని ముఖ్యమంత్రిత్వం అనేది రాజ్యాంగ బద్ధమైన పదవి. ఆ రాజ్యాంగం రాజ్య వ్యవహారాలలో మత జోక్యం ఉండగూడని లౌకికవాదాన్ని తన ప్రవేశికలో రాసుకుంది. దేశప్రజలందరికీ శాస్త్రీయ స్పృహను కలిగించడం, మూఢనమ్మకాల నుంచి విముక్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని రాసుకుంది. శాస్త్రీయ స్పృహను ప్రచారం చేయడం, పాటించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని రాసుకుంది. ఆ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగ పదవిని చేపట్టిన వ్యక్తి ఆ రాజ్యాంగ స్ఫూర్తిని పాటించవలసి ఉంటుంది. ఆ మేరకు తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను కూడ పక్కన పెట్టవలసి ఉంటుంది.

కవిగా కూడ సుప్రసిద్ధుడైన మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ గురించి ఒక కథ చెపుతారు. ఆయన దగ్గర రెండు కొవ్వొత్తులుండేవట. ప్రభుత్వ పత్రాల మీద పనిచేసేటప్పుడు ఒక కొవ్వొత్తి వెలిగించి పనిచేసేవాడట. తన కవిత్వం రాసుకునేటప్పుడు మరొక కొవ్వొత్తి వెలిగించి పనిచేసుకునేవాడట. ప్రభుత్వానికీ, వ్యక్తిగతానికీ తేడా చూసిన ఆ మధ్యయుగ రాజు సంస్కారం కూడ లేకుండా పోతున్న సందర్భంలో ఉన్నాం మనం!

ఇంతకూ ఈ యాగం కేవలం వ్యక్తిగత స్థాయిలో జరిగిందనడం పచ్చి అబద్ధం. యాగం గురించిన ప్రచారాన్ని ప్రభుత్వ యంత్రాంగం చేసింది. యాగానికి అవసరమైన వసతులను ప్రభుత్వ యంత్రాంగం కల్పించింది. యాగం జరిగినన్ని రోజులూ

ప్రభుత్వ యంత్రాంగమంతా అక్కడే ఉంది. చివరికి కేంద్ర మంత్రులు, రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, మంత్రులు, శాసనసభ్యులు, న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో సహా ఉన్నతాధికారులు అందరూ ఆ యాగంలో పాల్గొన్నారు. లోకకల్యాణం చేసే మాత తన యాగశాలలో అగ్నిప్రమాదాన్ని నివారించలేకపోవడం వల్ల రాష్ట్రపతి హెలికాప్టర్ దిగడానికి అవకాశం లేక ఆయన హాజరు కాలేకపోయారు గాని, కూతవేటు దూరంలో వేచి చూశారు. ఈ తమాషా అంతా జరిగిన తర్వాత, యాగం వ్యక్తిగతమనీ, ప్రభుత్వానికి సంబంధం లేదనీ అని సమర్థించడానికి ప్రయత్నిస్తున్నారంటే మేతావుల దుస్సాహసం ఎంతటిది!

ఉన్నతాధికారులు పాల్గొనడం మాత్రమే కాదు, ప్రభుత్వ యంత్రాంగం అతి భయంకరంగా దుర్వినియోగం అయిన సందర్భం కూడ ఇదే. అది వ్యక్తిగతమైన కార్యక్రమం మాత్రమే అయితే ఐదువేల మంది సాయుధ పోలీసు బలగాలను మోహరించడం ఎందుకు అవసరమైంది? ప్రభుత్వమే హడావుడిగా నాలుగు వైపుల నుంచీ రోడ్లు ఎందుకు వేసింది? హైదరాబాద్ నుంచి గజ్వేల్ దాకా ప్రభుత్వ శాఖలు ఆహ్వాన ద్వారాలు, బానర్లు ఎందుకు కట్టాయి? ముఖ్యమంత్రి కార్యాలయం ఇక రాష్ట్రంలో మరే ఘటనా లేనట్టు ఆ వారం రోజులూ యాగ వార్తలు, ఫొటోలు మాత్రమే ఎందుకు పంపించింది? ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ వారం రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏకైక పని యాగ నిర్వహణ, యాగ ప్రచారం మాత్రమే. ఒకవైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ పిట్టల్లా రాలిపోతుంటే, వారి కుటుంబాలను పరామర్శించడానికి, సహాయం అందించడానికి ప్రభుత్వ యంత్రాంగం ఈ ఉత్సాహంలో వెయ్యోవంతు కూడ చూపలేదు.

సమాజానికి మంచీ చెడూ చెప్పవలసిన మేధావులు, బుద్ధిజీవులు, ప్రచారసాధనాలు ఈ భారీ బాణామతి కార్యక్రమంలో తలమునకలై, పరవశులై, అసహ్యకరమైన వస్త్రధారణతో ప్రత్యక్ష ప్రసారాలతో, తన్మయమైన రాతలతో అత్యంత జుగుప్సాకరమైన ప్రవర్తన కనబరిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను, ఉద్యమాన్ని అడుగడుగునా వ్యతిరేకించిన, దుష్ప్రచారం చేసిన మీడియా అధినేతలు, తెలంగాణ శత్రువులుగా ప్రపంచానికంతా సుప్రసిద్ధులైన నాయకులూ, ప్రచార సాధనాల అధిపతులూ ఈ మహా చేతబడి ప్రదర్శనలో చంద్రశేఖరరావుతో సరస సంభాషణల్లో పాలుపంచుకున్నారు.

యాగం చివరిరోజున అగ్నిప్రమాదం జరగడం, లోకానికి మేలు చేసే మంత్రాలు చదివిన ఘనాపాటీలు అగ్నిదేవుడి ప్రతాపానికి చెల్లాచెదురుగా పరుగులు తీయడం, అగ్నిమాపక సిబ్బంది మంటలు చల్లార్చిన తర్వాత గంటకు తిరిగివచ్చి, చండీమాత అగ్నిదేవుడిని శుభసూచకంగానే పంపించిందని గంభీర వచనాలు పలకడం ఎంత హాస్యాస్పదంగా, అసహ్యకరంగా ఉన్నాయో యాగ సమర్థకులకు కనబడడం లేదు. శుభసూచకమైన అగ్ని నుంచి ఋత్విక్కులూ, నాయకులూ ఎందుకు పారిపోయారు? ఈ యాగంతో ప్రజాశ్రేయస్సు ప్రసాదించే చండీమాత తన యాగశాలలో నిప్పును ఆర్పుకోలేక పోయిందా? లోకాన్నంతా రక్షించే ఈ జగన్మాతకు అంతకు ముందు ఐదువేల మంది సాయుధ పోలీసుల రక్షణ ఎందుకు అవసరమైంది? కనీసమైన ఇంగిత జ్ఞానం, ఆలోచించే మెదడు ఉంటే రావలసిన ప్రశ్నలివి. కాని రాజుగారి దేవతావస్త్రాల కథలో చెప్పినట్టు, అటు ప్రభుత్వ యంత్రాంగపు పెద్దలూ, ఇటు మేధావుల రూపంలో ఉన్న రాజుగారి భక్తులూ ఈ ప్రశ్నలను తమ దరి చేరనివ్వడం లేదు.

రాజుకూ, రాజకుటుంబానికీ, ఆశ్రితులైన పెద్దలకూ, మేతావులకూ ఈ ప్రశ్నలు రానివ్వకపోతేనే ప్రయోజనాలు ఉండవచ్చు. కాని, చైతన్యానికీ, ప్రశ్నకూ, ధిక్కారానికీ, పోరాటానికీ మారుపేరుగా చెప్పుకుంటున్న తెలంగాణ సమాజం కూడ ఈ అసహ్యకరమైన మహా చేతబడి క్రతువును మౌనంగా, నిర్లిప్తంగా సహించి చూస్తూ ఉండిపోవడం విచారకరం. కనీసమైన వ్యతిరేకత, ప్రతిస్పందన అయినా ఎందుకు రాలేదని తెలంగాణ సమాజంలోని హేతువాదులు, బుద్ధిజీవులు, ప్రగతిశీల ఉద్యమాలు ఆలోచించుకోవలసిన సందర్భం ఇది. కారణాలు సంక్లిష్టమైనవి కావచ్చు. ఎన్నో ఉండవచ్చు. కాని ఆ కారణాలను అన్వేషించి, తెలంగాణ సమాజంలో ప్రగతిశీల ఉద్యమాలు చేయవలసిన పని ఎంత విస్తృతమైనదో గుర్తించవలసి ఉంది.

ఈ యాగానికి అసలు కారణం తెలంగాణ సమాజాన్ని మత్తులో ముంచాలనే కోరిక. ఇంతకాలం తెలంగాణ ప్రజల సమస్యలన్నిటికీ ఆంధ్ర వలస పాలకులే కారణమని చెప్పి, ఆ పాలకులను తొలగించిన తర్వాత పద్దెనిమిది నెలలు గడిచినా పాత విధానాలే కొనసాగుతున్నప్పుడు, ప్రజాసమస్యలు పరిష్కారం కానప్పుడు ప్రజా ఆగ్రహం ఈ ప్రభుత్వం మీదికి కూడ మళ్లే అవకాశం ఉంది. ప్రజలు తమ సమస్యల మూలకారణాలను అన్వేషించే ప్రయత్నం లోకి దిగే అవకాశం ఉంది. గద్దె మీద కూచున్న వాళ్ల గురించి మాత్రమే కాక, వాళ్ల విధానాల గురించి ఆలోచించే అవకాశం ఉంది. అందువల్ల, వాళ్లకు ఆ ప్రశ్నలు, ఆ ఆగ్రహం రాకుండా చేయడానికి వారిని జోకొట్టాలి. నిద్ర మత్తులో ముంచాలి. రుజువులు లేని లోకాతీత శక్తుల మీద నమ్మకం కలిగించాలి. తమ పోరాటం వల్ల, తమ బిడ్డల త్యాగం వల్ల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని వారిలో బలంగా ఉన్న నమ్మకాన్ని చెదరగొట్టి, తెలంగాణ రూపొందడానికి చండీమాత దయే కారణమనే అబద్ధాన్ని వాళ్ల మనసుల్లో నింపాలి. అంటే తక్షణం ప్రశ్నించవలసినవారూ, ప్రత్యర్థులూ ఎవరూ లేరనీ, ఇదంతా మనకు తెలియని మాయాలోకపు వ్యవహారమనీ ప్రజలను నమ్మించాలి. అప్పుడే నిన్నటివరకూ గంభీరంగా ప్రవచించిన ఆదర్శాలకు తూట్లు పొడిచినా, నిన్నటిదాకా దోపిడీ పీడనలు సాగించినవాళ్లతో భుజాలు రాసుకుని తిరిగినా, నిన్నటిదాకా ప్రజలందరూ వ్యతిరేకించిన విధానాలనే నిస్సిగ్గుగా అమలు చేసినా సరిపోతుంది. ఈ క్రమంలో రాజ్యాంగ ఆదర్శాలు భగ్నమైనా ఫరవాలేదు.

అలా పాలకుల ఉద్దేశాలూ ప్రయోజనాలూ స్పష్టమైనవే. మరి ప్రజల వైపు నుంచి ఆలోచించేవాళ్లు మరెంత స్పష్టంగా ఉండాలి?!

★ రచయిత, వీక్షణం ఎడిటర్

ప్రత్యామ్నాయ భాషను నిర్మిద్దాం

డి.ఉదయ్ భాను

మానవ హననం జరుగుతున్న విధ్వంసక రాజ్యంలో ప్రత్యామ్నాయాల నిర్మాణం అనివార్యం. వర్తమాన భారతంలో ఒకవైపు ఆధిపత్య శక్తులు చేస్తున్న అన్ని రకాల యుద్ధాలు, వాటిని నిలువరించే క్రమంలో ప్రతి యుద్ధమూ, సమాంతరంగా ప్రత్యామ్నాయ వ్యవస్థల నిర్మాణమూ కంటికి కనిపిస్తున్న అపురూపమైన దృశ్యం. ఈ ప్రత్యామ్నాయంలో మానవ ఆచరణకు సంబంధించిన అన్ని విషయాలకూ చోటుంది. వాటిలో రాజకీయాలకు ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో సాంస్కృతిక విషయాలకూ అంతే పట్టింపు ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా నడిచిన కమ్యూనిస్టు విప్లవాల ఉదాహరణల్లోంచి కావచ్చు, లేదంటే సమీప గతంలో చైనాలో మావో సేటుంగ్ నాయకత్వంలో 1966 నుంచి 1976 దాకా దశాబ్ద కాలం నడిచిన సాంస్కృతిక విప్లవ అనుభవం నుంచి కావచ్చు రాజకీయ విప్లవం అంతటి గౌరవాన్నీ, మౌలికమైన అవసరం రీత్యా ప్రాధాన్యతనూ సాంస్కృతిక విప్లవం దక్కించుకున్నది. అది కూడా కార్మిక వర్గ ప్రజలు నడిపే, నియంత్రించే సాంస్కృతిక విప్లవం. మరోవైపు ఇవేవీ మాకు ఆదర్శాలు కావని, కమ్యూనిస్టు సిద్ధాంతాలు మాకొద్దని (భారతదేశం వరకు) అంబేద్కర్ ఆలోచనాధారను ఆచరిస్తున్నవాళ్లు కూడా ఈ సాంస్కృతిక విప్లవం విషయంలో మాత్రం దాని అవసరాన్ని గుర్తిస్తున్నారు, వారి భావజాల పరిధిలోనైనా. మొత్తంగా చూసుకున్నప్పుడు నిర్మాణాత్మకత కలిగి ఉండడంలో స్థాయీభేదాలు ఉన్నప్పటికీ, ఆధిపత్య వ్యవస్థలపై పోరాడుతున్న పురోగామి శక్తుల శిబిరాలన్నీ ఈ విషయంలో ఏకీభావం కలిగే ఉన్నాయనేది స్పష్టమవుతుంది.

సాంస్కృతిక విప్లవంలో భాషది కీలకమైన స్థానం. అమలు జరిపిన ఆధిపత్య భాషలూ, వివక్ష చూపబడిన అణగారిన భాషలూ, వీటిమధ్య వైరుధ్యం, ఘర్షణ ఈ అంశానికి సంబంధించిన చర్చలూ, పోరాటాలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికి చాలానే నడిచాయి. ఈ వ్యాసం దానిని ఉద్దేశించింది కాదు. ఒకభాషలోని అభివ్యక్తులకు సంబంధించినది. ఏదేని రాజ్యంలోని ఆధిపత్య శక్తులు తమ సాధికారతను నిలిపి ఉంచుకోవడంకోసం నిర్మాణాత్మకమైన భావజాలాన్ని బలవంతంగా ప్రజలపై రుద్ది, అదే వారి సొంత భావజాలంగా భ్రమలకు గురిచేసి, కాలక్రమంలో దానినే అత్యంత సహజమైనదిగా, ప్రాకృతికమైనదిగా చేసే పని అన్ని చోట్లా జరిగింది. దానికి భారతదేశం మినహాయింపు కాదు. సింధూ నాగరికత నుంచి నేటిదాకా భారతీయ సమాజాన్ని శాసిస్తున్న బ్రాహ్మణీయ శక్తులు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం నిర్మాణం చేసిన భావజాలాన్ని ప్రజల మెదళ్లలోకి చొప్పించడం కోసం వాడుకున్న సాధనాల్లో భాష చాలా కీలకమైనది. తెలుగు భాషకు సంబంధించి అది ఎటువంటి పాత్రను పోషించిందనేది ఈ వ్యాసంలో చర్చించబోయే ముఖ్యమైన అంశం.

తెలుగు మూలద్రావిడ భాష నుంచి విడివడిన ఒక ద్రావిడ భాష. అంటే పాలితుల భాష. అనేక భాషల కలయిక అయిన సంస్కృతం పాలకుల భాష. ఈ పాలకులు తెలుగు భాషకు సంబంధించి మొట్టమొదట చేసిన కుట్ర 'జనని సంస్కృతంబు నెల్ల భాషలకును' అన్నది. దీన్ని ఏ భాషాశాస్త్రవేత్త ఒప్పుకోలేదు, ఏ సాంప్రదాయవాదీ అవునని శాస్త్రీయంగా రుజువు చేయలేదు, చేయలేరు. కానీ చలామణిలో అదే నిజమని చాలామంది నమ్మేట్లు మాత్రం ప్రచారం చేయగలిగారు. అది మొదలు కావ్యగౌరవాలు సంస్కృతం పునాదిగానే లభించడం మొదలయ్యింది. ఇదంతా ఒక చర్చ. దానిని మరొక వ్యాసంలో విపులంగా చర్చించవచ్చు.

తెలుగు భాషకు సంబంధించి ఆధిపత్య భాషాభివ్యక్తుల ధ్వంసానికి సంబంధించి ఇప్పటికి చాలా కృషి జరిగిందిగానీ ఇంకా జరగవల్సింది చాలానే ఉన్నది. స్త్రీవాద ఉద్యమం, సాహిత్యం వచ్చిన తర్వాత తెలుగులోని పురుషాధిపత్య వ్యక్తీకరణలకు సంబంధించి స్త్రీవాదులు చాలా ప్రశ్నలు లేవదీశారు. తెలుగు భాషావినియోగదారుల్లో నాటుకుపోయిన పురుషాధిపత్య మూలాలను ఎత్తిచూపారు. దాంతో ఆ వినియోగదారుల్లో వినియోగానికి సంబంధించిన చైతన్యం పెరిగింది. అట్లే దళిత ఉద్యమం, సాహిత్యం, మైనార్టీ ఉద్యమం, సాహిత్యం ఇటువంటి కొత్త ప్రశ్నలు లేవదీశాయి. స్థూలంగా బ్రాహ్మణ శిశువులైన పురుషాధిపత్య, కులాధిపత్య, మతాధిపత్య భాషాభివ్యక్తులను ప్రశ్నించడంతో తెలుగు భాషా వినియోగంలో ఈ ఉద్యమాలు కీలకమైన మార్పులే తీసుకువచ్చాయి. అయితే ఈ విషయం ఒక పరిమితమైన కాలవ్యవధికి లోబడిపోవడం అన్నది కనిపిస్తుంది. నిజానికి అది నిరంతరం సాగవల్సిన దీర్ఘకాలిక ప్రక్రియ. ఎప్పటికప్పుడు పునఃసమీక్షించుకోవల్సిన విషయం. అందుకోసమే ఈ చిరు ప్రయత్నం.

పైన చెప్పిన స్త్రీవాద, దళితవాద, మైనార్టీ వాదాలు వచ్చాయి కాబట్టి ఆయా వాదాల వర్గాలు తమమీద ఆధిపత్య భాషాభివ్యక్తులు చేస్తున్న కుట్రను ప్రశ్నించగలిగాయి. కానీ ఇప్పటికీ వికలాంగ ఉద్యమం నిర్మాణాత్మక పోరాట రూపాన్ని తీసుకోలేదు. వేళ్లమీద లెక్కించగలిగినంత మాత్రమే సాహిత్యం వచ్చింది. అందువల్ల తెలుగులో వికలాంగులకు సంబంధించిన ఆధిపత్య వ్యక్తీకరణలు అట్లే మిగిలిపోయాయి. ఉదాహరణకు 'గుడ్డిగా దేన్నీ నమ్మకు', 'కుంటోడిలాగా మెల్లగా నడుస్తున్నాడు', 'చెప్తుంటే చెవిటోనిలాగ కూర్చుండు, వినకుండా', 'మాట్లాడుతుంటే సమాధానం చెప్పవేంది మూగోనిలాగా', 'చెవిటోని ముందు శంఖం ఊదినట్లు', 'గుడ్డిలో మెల్ల నయం'. ఈ వాక్యాలను ఇప్పటికీ తెలుగు భాషావ్యవహర్తలు మాట్లాడుతున్నారు, రాస్తున్నారు. విషాదమేమిటంటే ఇంతకుముందు ప్రస్తుతించిన భాషాధిపత్యాన్ని ధిక్కరించినవారు కూడా వీటిని వినియోగిస్తూనే ఉన్నారు. వారు తప్పు చేస్తున్నారు అనలేముగానీ ఇప్పటికైనా ఆ ఎరుక తెచ్చుకోవల్సి అయితే ఉన్నది. నిజానికి ఇక్కడ ఉదహరించిన వాక్యాలు వందకు ఒకటో రెండో మాత్రమే. ఇటువంటివి గమనిస్తే మన నిత్యజీవిత వ్యవహారంలోనే వందలకొద్ది దొరుకుతాయి. వాటన్నింటి వెనుక వికలాంగులపై వికలాంగేతరుల ఆధిపత్యం దాగి ఉన్నది. ఇక్కడ మరొక విషయం కూడా చెప్పాలి. ఆ మధ్య ఫేస్‌బుక్లో ఒక కార్టూన్ చూసాను. అదేమంటే మనుషులందరు ఒక వరుసలో ముందుకు నడుస్తుంటారు. ఆ వరుసకు ముందటే ఒక పెద్ద గొయ్యి ఉంటుంది. గొయ్యి పేరు హిందూయిజం. ఆ వరుసలో మొదట నడుస్తున్న అతడికి కళ్లు ఉండవు. చేతి కర్ర సహాయంతో నడుస్తుంటాడు. ముందటే ఉన్న గొయ్యిని చూసుకోలేక ఆ గొయ్యిలో పడిపోతుంటాడు. వరుసలోని మిగతావాళ్లు కూడా "గుడ్డిగా" అయననే అనుసరిస్తూ గొయ్యిలో పడబోతుంటారు. ఇదీ ఆ కార్టూన్. మనలో "సకలాంగ(?)" ఆధిపత్యం ఎంతగా నాటుకుపోయిందో చూడండి. నిజానికి 'వికలాంగులు' అన్న మాటను కూడా వికలాంగులు ఒప్పుకోవడం లేదు. ఆ మాటకు ప్రత్యామ్నాయంగా చాలాకాలంగా మరొక పదాన్ని నేను కూడా అన్వేషిస్తున్నాను.

స్త్రీవాదులు మాత్రమేకాదు అందరు పురోగామి ఆలోచనాపరులం అనుకుంటున్నవాళ్లం కూడా వదిలేసిన మరొక పెద్ద విషయం ఉన్నది. ఒక్క విప్లవోద్యమంలోని కొద్దిమంది మినహా చాలామంది అదే పొరపాటును చేస్తున్నారు. అదేమంటే గతానికి సంబంధించిన విషయాలను చెప్పవల్సి వచ్చినప్పుడు ఉద్యమాలు కావచ్చు, వ్యవస్థలు కావచ్చు, సంఘటనలు కావచ్చు, ఉదాహరణలు కావచ్చు, పోలికలు కావచ్చు ఉదాహరణగా పురుషున్నే ఎంపిక చేసుకుంటుంటాం. ఉదాహరణకు కొన్ని వాక్యాలు: "ఒక్కడంటే ఒక్కడన్నా చెప్తే విన్నడా", "తెలంగాణ ఉద్యమంలో ప్రతి కళాకారుడు గొప్ప పాత్ర నిర్వహించాడు", "రచయిత అన్నవాడు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలి", "కవీ కళాకారీ". ఈ వాక్యాలు నిజానికి మన అనుభవంలోనివే అయినా దానిలోని పురుషాధిపత్యాన్ని మనం పసిగట్టలేకపోయాం. గొప్ప విషయాలను చెప్తున్నప్పుడు ఎంచుకుంటున్న ఉపమేయాలూ, ఉపమానాలలో ఎంతటి పురుషాధిపత్యం దాగిఉన్నదో కనుగొనడం, ఎరుకతో భాషను వాడడం అందరమూ నిరంతరం చేయవల్సిన పనే. నిజానికి ఈ అన్యాయం తెలుగు సాహిత్యంలోనూ, అలంకార శాస్త్రాలు, వ్యాకరణం... అన్నిట్లోనూ ఆది నుండే కనిపిస్తోంది. శూరత్వానికి ఉదాహరణగా పురుషుడు ఉంటాడు. నిమిత్తమాత్రమైన విషయాలకు స్త్రీ ఉదాహరణగా ఉంటుంది. నిజానికి చరిత్ర గతిని మార్చడంలో పురుషుడితో సమానమైన, ఇంకా చెప్పాలంటే ఒకింత ఎక్కువగానే స్త్రీ పాత్ర ఉన్నదని చాలా మందికి తెలుసు గానీ, పురుషాధిపత్యం దాన్ని గుర్తించ నిరాకరించడం వల్ల ఇటువంటి అభివ్యక్తి దోషాలు చోటు చేసుకుంటున్నాయి.

ఎల్‌జీబీటీ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్)ల విషయంలో కూడా మనం ఎరుకలేకుండా చాలా ఆధిపత్య భాషను ప్రయోగిస్తున్నాం. అసలు వారికి సామాజిక గౌరవం విషయంలోనే పెద్ద లోటు ఉన్నది. అది మరొక చర్చనీయాంశంగాని, ప్రస్తుతానికి భాషను సంస్కరించే పని చేద్దాం. రైలు ప్రయాణాల్లోనో, బస్టాండుల్లోనో, మరొక చోట ఉన్నప్పుడో ఎల్‌జీబీటీలు ఎదురుపడితే అసహ్యించుకుంటూ మనం మాట్లాడుతున్న భాష దయనీయంగా ఉంటున్నది. వాళ్లను మొదటగా మనుషులుగా గౌరవించడంతోనే భాషను మార్చుకునే వీలు కలుగుతుంది.

కులాధిపత్య వ్యక్తీకరణలైన 'సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు' వంటివి, తెగాతిపత్య వ్యక్తీకరణలైన 'కిరాతకంగా చంపాడు', 'రాక్షస విలువలు' వంటివాటిని కూడా మనం ఇంకా వాడుతూనే ఉన్నాం. మనలోని జర్నలిస్టులు, వక్తలూ, వివిధ సాహిత్య ప్రక్రియలను ఎంచుకుని రచనలు చేస్తున్నవాళ్లు.. అందరం ప్రత్యామ్నాయ భాషా నిర్మాణంలో పాలుపంచుకోవల్సిందే. లేకపోతే ఆధిపత్య శక్తుల మీద పోరాటం చేస్తున్నవాళ్లుగా మనలోపలి శత్రువు భావజాలాన్ని కూడా వదులుకోలేకపోతే అర్థం ఉండదు.

చివరగా ఒక్కమాట చెప్పాలి. ఈ వ్యాసంలో ఉదహరించినవి నా పరిమితమైన అవగాహనలోనివే. ఇంకా ఇటువంటివి చాలానే ఉండొచ్చు. వాటిని గురించి ఆలోచించడం, గుర్తించడం మొదలుపెడితే క్రమంగా నిర్మూలనకోసం, ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం ప్రయత్నం చేయవచ్చు. అది మనందరి ఉమ్మడి బాధ్యతాయుతమైన కృషి.

★ రచయిత, హెచ్‌సియు పరిశోధక విద్యార్థి

పులులు- మనుషులు- రాజ్యం

■ నలమాసక్రిష్ణ

"రాజ్యం దోపిడి వర్గాల చేతిలో అణచివేత సాధన"మని కారల్‌మార్క్స్ చెప్పాడు. ప్రజలు తమ అవసరార్థం తమంటతామే రాజ్యాన్ని ఏర్పరుచుకున్నారని (సోషల్ కాంట్రాక్ట్) మరికొందరు రాజనీతి సిద్ధాంత కర్తలు చెప్పారు. ఇలా రాజ్యం పుట్టుకకు కారణాలతో సంబంధం లేకుండా రాజ్యం మంచి కోసమేనని రాజ్యం లేని వ్యవస్థ ఉండజాలదని వాదించేవారే అధికంగా వున్నారు. రాజ్యం ప్రజలకోసమేనని, ప్రజాప్రయోజనాలే దాని పరమార్థమని భ్రమించేవారున్నారు. రాజ్యం దోపిడి వర్గ ప్రయోజనాలనూ ప్రజల ప్రయోజనాలు కాపాడుతుందను కునేవారున్నారు. రాజ్యం దాని యంత్రాంగం స్వరూప స్వభావాలను శాస్త్రీయంగా అర్థంచేసుకోగలిగినవారు ప్రజల నెత్తిన అత్యంత భారంగా మారిన రాజ్యమనే కుంపటిని తొలగించాలని భావిస్తారు.

రాజ్యనికి, ముఖ్యంగా ఆధునిక రాజ్యానికి బహుముఖాలుంటాయి. ప్రజల వీరోచిత పోరాటాల వల్ల సంక్షేమమనే మానవీయ ముసుగు రాజ్యం ధరించాల్సివచ్చింది. కనుక 1950ల తర్వాత రాజ్యాన్ని ప్రజలు ప్రత్యక్ష తక్షణ శత్రువుగా భావించే స్థితి సమూహిక ప్రజా భావనగా కనిపించడం తగ్గిపోయింది. తిరిగి నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలతో విదేశీ పెట్టుబడికి భారత పాలకులు దళారీలుగా మారిన వారినుండి రోజు రోజుకు ప్రజల్లో నిరసన పెరుగుతుంది. రాజ్యంపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం అయితుంది. అయితే రాజ్యం సైనికంగానే కాదు మేథోపరంగా చాలా బలిష్టంగా మారి సమ్మతిని తయారు చేసుకోవడం అసమ్మతిని సృషించడమనే సేఫ్టీవాల్ పద్ధతిని అవలంభిస్తుంది. ఫలితంగా అసంతృప్తి, కోపం చట్టబద్ధ వ్యవస్థ పరిదిలోన వ్యక్తం చేయడం, తిరిగి ఎంతచిన్న ఉపశమనమైన, పరిష్కారమైన చట్ట పరిమితుల్లోనే పొందడం కనిపిస్తుంది. ఈ క్రమంలో రాజ్యం కౄర స్వభావాన్ని తక్కువ అంచనా వేయడమో లేదా దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవడమో కనిపిస్తుంది.

భారత ప్రభుత్వం 1972 నుండి చేపట్టిన పులుల అభయారణ్యాల నిర్మాణం దాని అమలు తీరు ఒకసారి పరిశీలిస్తే దోపిడిరాజ్యం అమానవీయకోణం, దాని స్వభావం అర్థమవుతాయి. దేశంలో యిప్పటికి 42 పులుల అభయారణ్యాలున్నాయి. వాటిలో వందల సంఖ్యలోనే పులులున్నాయి. ఆ పులుల సంఖ్య పెంచడం అవసరమని ప్రభుత్వం భావించింది. అందుకు మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని అమ్రాబాద్ టైగర్ జోన్,



ఆదిలాబాద్ జిల్లాలలోని కవ్వాళ టైగర్ ప్రాజెక్టును నిర్మించాలని ఉమ్మడి రాష్ట్రంలో నిర్ణయం జరిగింది. అందుకు అమ్రాబాద్ ప్రాజెక్టు కింద కోర్ ఏరియాగా గుర్తించిన ప్రాంతం నుండి 3 గ్రామాలను బఫర్ (సరిహద్దు ప్రాంతం) ఏరియాగా గుర్తించిన ప్రాంతంలో నుండి మరికొన్ని గ్రామలను తరలించాడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా GO 123ని తయారు చేసింది. దీని ప్రకారం పది లక్షలు ఒక కుటుంబానికి నష్టపరిహారం అందుతుంది. ఆ కుటుంబం ఎక్కడైన వెళ్ళి బ్రతకాలి. లేదా ప్రభుత్వం చూపించిన చోట నివాసముండాలి. దీని ప్రకారం అదిలాబాద్ జిల్లాలో కూడ మరోటైగర్ ప్రాజెక్టు ద్వారా కవ్వాళ టైగర్‌జోన్ పరిధిలోని దొంగపల్లి, అల్లినగర్, మైసంపేట అనే కోర్ (కేంద్ర ప్రాంతం) ఏరియా గ్రామలు దాని చుట్టున్న 30 పైగా సరిహద్దు గ్రామాలు ప్రభావితమైతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో దీనిపై చాలా చర్చ జరిగింది. "మనుషులను చంపి కౄర మృగాలకు రక్షణ కల్పిస్తారా?" అని తెలంగాణ ఉద్యమకారులు ఆవేశంగా ఆనాడు ప్రశ్నించారు. ఇప్పుడు తెలంగాణలో తెలంగాణ ప్రభుత్వం గత పాలకులు ప్రజా వత్తిడితో వెనక్కి తగ్గిన దుర్మార్గపు పనులు పూర్తి చేయడానికి రంగం సిద్ధం చేసి ఇప్పటికే ఆదిలాబాద్ అడవిలో ఒక పులిని, మరికొన్ని పాములను (అనధికారికంగా) వదిలినారు.

రాజ్యం ఎంత అమానవీయంగా, కౄరంగా ఉంటుందో అర్థం చేసుకోవడానికి దాని స్వభావానికి ఉదహరణగా పులుల సంరక్షణ కేంద్రాలను అర్థం చేసుకోవచ్చు. పాలకులు చెప్తుతున్న ప్రకారం జీవవైవిద్యాన్ని కాపాడాలంటే ఎన్నో పార్కులలో వాటిని

పెంచొచ్చు. అటవి స్మగ్లర్లను (కాంట్రాక్టర్స్, రాజకీయనాయకులు) అరికడితే, పులిగోర్లు, చర్మం, మాంసంకోసం వాటిని చంపకపోతే వాటి సంఖ్య పెరుగుతుంది. పులులు లేదా జంతుజాలం నాశనం కావడానికి అడవిలో నివసిస్తున్న ప్రజలు ముఖ్యంగా ఆదివాసులు ఎలా కారణమో ఏ ప్రభుత్వం సరిగ్గా చెప్పడం లేదు (డిసెంబర్ 28-2015 నాడు హైకోర్టు న్యాయమూర్తి, ఇతర ఉన్నత అధికారులు కవ్వాళ పులుల అభయరాణ్యాన్ని చూసి పులకించారు. పులుల వివరాలు వాటి క్షేమం అడిగారు గాని నిర్వాసితుల గురించి మాట్లాడలేదు. పైగా ఆదివాసుల వల్ల అడవినాశనం అయిందని ప్రకటన ఇచ్చారు). కాని అధికారం ఉంది కాబట్టి "అడవి వదిలి వెళ్ళిపోండని" ఉత్తర్వులు ఇస్తున్నారు. "కొన్ని వందల ఏండ్లుగా అడవిలో పులులతో ప్రకృతితో సహజీవనం చేస్తున్న మాకు వాటివల్ల ఏ ఇబ్బంది లేదు" "పైగా పులిని మేము ఆరాధ్య జంతువుగా భావిస్తాము" " పులి ఏ సమయంలో తిరుగుతుంది ఎప్పుడు నిద్రిస్తుందో మాకు తెలుసు" ఇన్నాళ్ళ నుండి లేనిది మమ్ములను ఎందుకెళ్ళి పోవాలంటున్నారో అర్థం కావడం లేదని ఆదివాసీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నల్లమల అటవి ప్రాంతంలోని ప్రజలు తమ బంధువుల వద్దకు వెళ్ళాలన్నా ఫారెస్టు అధికారుల అనుమతి తప్పని సరికావడం మూల వాసుల హక్కుల హననానికి పరాకాష్ఠగా భావించాలి.

ప్రభుత్వం దాని ఏజన్సీలుగా పని చేస్తున్న ఎన్‌జీవోలు, ఫారెస్టు, రెవెన్యూశాఖలతో పాటు రాజకీయ పార్టీలు పులుల రక్షణ గురించి అడవిలో వేల ఏండ్లుగా నివసిస్తున్న వారికి పాఠాలు చెప్పుతున్నారు. పులులను రక్షించాలని మాట్లాడుతున్న వారికి అవి అంతరించడానికి కారణాలు అర్థం చేసుకునే నిజాయితే లేదు. ప్రజలను ఖాళీ చేయించాలని చూస్తున్న ప్రభుత్వానికి దాని ఏజెన్సీలకు, స్థానిక ప్రజలకు, అడవిలో నివసించే ఆదివాసులకున్న రాజ్యాంగపరమైన, చట్టపరమైన హక్కులు కనిపించడంలేదు. అపహాస్యంగా మారుతాయి. ప్రశ్నించిన వారి గొంతు నుమిలి వేస్తారు. పోనీ ఈ దుర్మార్గపు పాలక వర్గాలకు మనుషులకంటే పులుల మీద అధికంగా ప్రేమ ఉన్నదా? జంతుజాలాన్ని కాపాడి జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలని భావిస్తున్నారా? అంటే అదీ లేదు. కేవలం బహుళ జాతి కంపెనీలకు అటవి ప్రాంతాలలోని సంపదను కట్టబెట్టడం కోసం పులుల రక్షణ పేరుతో ప్రజలను అడవి నుండి బయటకు వెళ్ళగొట్టడం కోసం రాజ్యం ఆడుతున్న నాటకమే పులుల సంరక్షణ కేంద్రాలు.

డీబీర్స్ అనే వజ్రాల కంపెనీ UPA II కాలంలో (జైరాం రమేష్, కేంద్రమంత్రి) నల్లమల అటవి ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు రహస్య ఒప్పందం జరిగింది. ఈ ప్రాంతంలో యూరేనియం నిల్వలు, వజ్రాలు, కలప ఇతర ఖనిజాలున్నాయి. అవి కొల్లగొట్టాలంటే ప్రజలుంటే ఏనాటికైన అడవి కాబట్టి పులుల పేరుతో వారిని వెళ్ళగొట్టాలి అనేది పాలకుల వ్యూహం. కవ్వాల



టైగర్ ప్రాజెక్టు క్రింద కూడా అపారమైన సున్నపురాయి నిల్వలు, కలప, ఇనుపరాయి యితర ఖనిజ సంపదవున్నది. అపారమైన ఖనిజ సంపద దోపిడి చేసేందుకు వీలుగా పులుల అభయారణ్యాలు నిర్మాణం చేసే పేరుతో ప్రజలను మెడలు బట్టి అడవి బయటకు నెట్టివేస్తున్నారు.

టైగర్ జోన్స్ వల్ల నిర్వాసితులు అయితున్న ప్రజలు స్వచ్ఛందంగానే మరో ప్రాంతం వెళ్ళి నివసిస్తామని అంగీకరించారని ప్రభుత్వం చెప్పుతుంది. స్థానిక ప్రజల సమ్మతితోనే గ్రామాలు ఖాళీ చేస్తామంటున్నారని బలవంతం లేదని ప్రభుత్వాధికారులు ప్రకటించారు. దీనంత అబద్ధం మరొకటి ఉండదు. కవ్వాళ టైగర్ జోన్ ప్రాంతంలో కోర్ ఏరియలోని అల్లినగర్, దొంగపల్లి, మైసంపేట మూడు గ్రామాలు దాని చుట్టూ 30 గ్రామాలు ఉన్నాయి. వెంటనే 3 గ్రామలు ఖాళీ చేయాలని అధికారులు హుకం జారీ చేశారు.

వాస్తవంగా ఈ మూడు గ్రామాలకు రోడ్డు సౌకర్యంలేదు. సరైన విద్యా, వైద్యం, అందుబాటులోలేవు. మంచినీటికి సౌకర్యం సరిగ్గాలేదు. సాగునీటి వసతి ఏ మాత్రం లేదు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించమని ఈ గ్రామాల ప్రజలు 5,6 సంవత్సరాలుగా ITDA POను కలిసి అనేకసార్లు విన్నవించుకున్నారు. కాని ఎన్నాళ్ళున్నా సరే ఈ గ్రామాలు "పులులకే"నని అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యం కాదన్నారు. ఇక్కడ తక్షణ నిర్వాసితులంతా నాయిక్ పోడు, గోందులే. వీరిని ప్రలోభపెడతూ భయపెడుతూ గ్రామాలు ఖాళీ చేయించేందుకు కొందరు ఆదివాసేతర దళారులు, ఫారెస్టు అధికారులు, రెవెన్యూ అధికారులు, ITDA కలిసి పని చేస్తున్నాయి. కొన్ని NGOలు, దినపత్రికలు కూడా ప్రజలు వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయం కలిగేలా ప్రయిత్నిస్తున్నాయి. "ఆదివాసీ ప్రజల హక్కుగా వారికి రావాల్సిన అభివృద్ధి నిధులను ఆపివేసి, కనీస సౌకర్యాల లేమి సృష్టించి ఇక్కడి నుండి వెళ్ళిపోతే తప్ప బ్రతకలేమూ" అనే ఆలోచన కల్పించడమే అన్నింటికన్న పెద్ద ఒత్తిడి, బలవంతం హింస.

ప్రత్యామ్నాయంగా భూమికి బదులు భూమితో పాటు ఊరంత ఒకే చోట నిర్మాణం అయితే వెళ్తామని కొందరు ప్రజలు మాట్లాతున్నారు. "మా ఊరొదిలి పోవాలని మాకిష్టం లేదుకాని ఏం చేయాలి?" అంటున్న ప్రజల నిస్సహాయతకు, వెళ్ళిపోవల్సివస్తే, ఎలా అనే స్థితిలో అనివార్యంగా ప్రత్యామ్నాయం గురించి ఆలోచించే అనివార్యతను సృష్టించడమే రాజ్యం కుట్ర. అమ్రాబాద్ టైగర్ ప్రాజెక్టు బాధిత గ్రామాల ఖాళీ చేయించడానికి మరో ఎత్తుగడను అవలంభించారు. గ్రామాల్లో 120 చెంచు కుటుంబాలు 300 ఆదివాసేతర (గొల్ల, మాల....) కుటుంబాలున్నాయి. ఆదివాసీలు ఈ గ్రామాల్లో 100 సంవత్సరాల నుండి అక్కడే నివసించేవారున్నారు. ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు కలగలిసిపోయినారు. ఇప్పుడు చట్ట ప్రకారం ఇక్కడ భూములపై హక్కులు లేవని టైగర్ జోన్ ప్రాజెక్టు క్రింద ప్రాజెక్టులో భాగంగా ఇప్పుడైతే పదిలక్షలు ప్రభుత్వం యిస్తుందని లేదంటే బలవంతంగా ఖాళీ చేయించాల్సి వస్తుందని ఆదివాసేతరులను భయపెట్టారు. వాస్తవంగా షెడ్యూల్డ్ ప్రాంతంలో భూములపై చట్ట ప్రకారంగా ఆదివాసేతరులకు హక్కు ఉండదు. కాని ఆ ప్రజలతో కలిసి జీవిస్తు అక్కడ తరాల నుండి అడవిలో భాగంగా కలిసి జీవిస్తున్నారు. వారి పట్ల ముఖ్యంగా పేద రైతాంగం పట్ల ఉదారంగా వ్యవహరించవలసి ఉంటుంది. ఆ ప్రజలు కూడా చట్టబద్ధమైన హక్కులు కోరడం లేదు. కాని ఇంతకాలం చట్టాలను 1/70ని అమలు చేయలని ఆదివాసీలు పోరాడుతుంటే పెడచెవిన పెట్టిన పాలకులకు ఆదివాసేతర ప్రజలకు షెడ్యూల్డ్ ప్రాంతంలో భూములపై హక్కులు లేవని గుర్తొచ్చిందా? పోని రాష్ట్రవ్యాప్త విధానంగా తీసుకుందా అంటే అదీ లేదు కేవలం పులుల రక్షిత కేంద్రాల్లోని (మైనింగ్) ఆదివాసేతర ప్రజల వరకే ఈ ఫారెస్టు బెదిరింపులు.

అల్ప సంఖ్యలో ఉన్న చెంచు జనాభాను తొలగించాలంటే ఉన్న చట్టపరమైన ఆటంకాలు దృష్టిలో ఉంచుకొని ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలను సమైఖ్యంగా పోరాటం చేయడానికి వీలులేకుండా చేసిన కుట్రయిది. ఇంకోవైపు కొత్తగా ఈ ప్రాంతంలోకి వచ్చిన చెంచులు (కాస్త మైదాన ప్రాంత ప్రభావాలకు లోనైన వారు) కొద్దిమంది ప్యాకేజి తీసుకొని అడవి ఖాళీ చేస్తామంటున్నారు. కాని తరాలుగా జీవిస్తున్న ప్రజలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో పోయేది లేదని అంటున్నారు. ఇంతకాలం ఎలా బ్రతికామో అదే విధంగా మమ్ములను బ్రతకనిస్తే ఎక్కడికి పోమని చెంచులతో కలిసి ఇక్కడే జీవిస్తామని ఆదివాసేతర రైతాంగం అంటున్నారు.

అభివృద్ధికి వక్రభాష్యాలు చెప్పి మనుషులను చంపి పులులను పెంచుతామంటున్న పాలకులు దళారీ పెట్టుబడి దారులకు అడవిని కట్టబెట్టేందుకు సాగుతున్న కుట్రలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కనుక తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులను రద్దుచేయాలి. ఆదివాసులను, ఖనిజ సంపదను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను నిర్వాసితులు చేసి, దేశ సంపదను కంపెనీలకు కట్టబెట్టడం కోసం రాజ్యం చేస్తున్న అమానవీయమైన కుట్రలను ప్రతిఘటిస్తున్న ప్రజలకు మైదాన ప్రాంత ప్రజలు మద్దతునివ్వాలి.

★ రచయిత, టిపిఎఫ్ ప్రధానకార్యదర్శి

వ్యవసాయ సంక్షోభం-రైతుల ఆత్మహత్యలు

■ ఎ.నరసింహారెడ్డి

దేశంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఫలితంగా రైతు ఆత్మహత్యలు ఆగడంలేదు. జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం 1999-2014 సంవత్సరాల మధ్య కాలంలో 2, 38, 650 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. పంటలు దెబ్బతిని, రుణాల ఊబిలో దిగబడి 2014-15 సంవత్సరంలో ప్రతి రోజు సగటున 34 మంది రైతులు, రైతు కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారని తాజాగా కేంద్రమే పార్లమెంటుకు తెలిపింది. అనూహ్యంగా పెరిగిపోతున్న జీవన వ్యయాలతో రోజులు నెట్టుకురాలేక, వ్యవసాయం తప్ప వేరే బతుకుతెరువు లేక గత ఇరవై ఏళ్లలో మూడు లక్షల మందికి పైగా రైతులు బలవన్మరణాల బలిపీఠంపైకి ఎక్కిన దారుణ చరిత్ర మనది. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో 45 శాతం సన్నకారు రైతులు కాగా 28 శాతం మంది పేద రైతులు. ఈ రెండు తరగతుల వారే 73 శాతం మంది ఉన్నారు. దేశంలో రాష్ట్రంలో దీర్ఘకాలికంగా కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశంగానే మిగిలిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం వాటా తగ్గిపోవడమే సమస్యకు మూలకారణం. దేశ జిడిపిలో వ్యవసాయరంగం వాటా 1951లో 52 శాతం కాగా 2015 నాటికి 13 శాతానికి తగ్గిపోయింది. వ్యవసాయం జీవనాధారంగా బతుకుతున్న వారి సంఖ్య 1951లో 65శాతం కాగా 2015 నాటికి 56 శాతంగా ఉంది.

1950, 1960 దశకాల్లో సహకార సంస్థలు-సహకార పరపతి సంస్థలు, సహకార మార్కెటింగ్ సంస్థలు సమర్థంగా పనిచేసినందువల్ల ఇతర వ్యవసాయరంగ సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ రైతు రుణగ్రస్తత సమస్య ఇప్పుడున్నంత తీవ్రతను సంతరించుకోలేదు. ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో ముల్కనూర్ సంస్థ సమర్థంగా పనిచేస్తూ రైతులను ఆదుకుంటున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో మార్కెట్ల ఆధిపత్యం మొదలైన తరువాత సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోవడం, రైతులు సామూహికంగా కాక వ్యక్తిగతంగా వ్యవసాయంలో నిరంతరం తలెత్తుతున్న సమస్యలను ఎదుర్కొంటున్నందువల్ల ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భూమి తప్ప వేరే ఆసరా లేని ఇటువంటి రైతుల సమస్యలను సమగ్రంగా పట్టించుకునే సహకార వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా ఉండే వ్యవస్థలేవీ ఇప్పటి వరకు లేవనే వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఇవాళ రైతులు విత్తనం నాటిన నాటి నుంచి పంట అమ్మి ఆదాయం చేతికొచ్చేదాకా ఎంతో మంది మీద ఆధారపడాల్సి వస్తున్నది. వారు గ్రామంలో ఉన్న వడ్డీ వ్యాపారేకావచ్చు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరువులిచ్చే వ్యాపారులే కావచ్చు, పంట చేతికొచ్చిన తరువాత మార్కెట్‌లో కొనే దళారులే కావచ్చు అందరూ మూకుమ్మడిగా రైతుకొచ్చే ఆదాయంలో సింహభాగం వడ్డీగానో, కమిషన్ గానో పొందాలని చూసేవారు ఎక్కువయిపోయారన్నది వాస్తవం. వీటన్నింటికి తోడు రైతుకు గిట్టుబాటు ధర లభించకపోవడం మరొక పెద్ద సమస్య. ఎందుకంటే గిడ్డంగులలో నిల్వ ఉంచుకొని, ధరలు లాభదాయకంగా ఉన్నప్పుడే అమ్మే స్తోమత చిన్న, సన్నకారు రైతులకు ఉండదు కాబట్టి వారు నష్టపోయే అవకాశమే ఎక్కువ. వీటన్నింటితో పాటు పంటకు తెగుళ్లు పట్టినా లేక వర్షాభావం ఉండి పంట సరిగా పండకపోయినా లేక అకాల వర్షాలు వచ్చినా, పంటల భీమా సౌకర్యం లేకపోవడంవలన వారు నష్టపోతున్నారనేది యదార్థం. ప్రభుత్వాలు పరిశ్రమల విషయంలో ఉదాసీనంగా, ఉదారంగా వ్యవహరిస్తున్నాయి. పారిశ్రామికవేత్తల బాకీలు బ్యాంకులలో పేరుకుపోయిన నిరర్థక ఆస్తులు వేల వేల కోట్ల రూపాయలు మాఫీ చేసేందుకూ ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. అయితే రైతులను ఆదుకోవడానికి ఇప్పటి వరకు ఒక వ్యవస్థాగత ప్రణాళికను రూపొందించక పోవడం శోచనీయం.

దేశంలో సస్య విప్లవం ఆరంభించక ముందు రైతులు తమ అవసరాల కొరకు వ్యవసాయం చేసుకున్నన్ని రోజులు బాగానే ఉన్నారు. మార్కెట్ కొరకు వాణిజ్య పంటల వ్యవసాయం మొదలు పెట్టినప్పటి నుంచి చితికిపోతున్నారు. ఆహార పంటల నుండి వాణిజ్య పంటలకు మళ్లడంతో రైతు కష్టాలు మొదలయ్యాయి. గతంలో విత్తనాలు, ఎరువు, పురుగు మందులు రైతు ఆధీనంలో ఉండేవి. ఎప్పుడైతే వాణిజ్య పంటలు వేయడం మొదలైందో విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందుల కొరకు మార్కెట్‌పై ఆధారపడవల్సి వచ్చింది. గతంలో భూసారాన్ని బట్టి, వాతావరణ పరిస్థితిని బట్టి పంటలను ఎంచుకునేవారు. అంటే రైతుకు భూమికి గల సంబంధాన్ని ఇప్పుడు మార్కెట్ నిర్ధారిస్తుంది.

మరోవైపు వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు 1951లో 15 శాతం ఉండగా 2015 నాటికి 5 శాతానికి తగ్గింది. ఇవాల్టి సంక్షోభానికి రైతు కారణం కానే కాదు. ప్రభుత్వ విధానాలే వ్యవసాయ సంక్షోభానికి మూలకారణం.

1960వ దశకం నుంచి ఆహారధాన్యాల స్వయం సమృద్ధి సాధన లక్ష్యంగా ప్రవేశపెట్టిన హరిత విప్లవం విచ్చలవిడిగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక కలుపుమందులు వాడడం వల్ల భూమి నిస్సారమైపోయింది. పంటభూమిలో 3 నుంచి 5శాతం వరకు ఉండాల్సిన సేంద్రియ కర్బన శాతం 0.3శాతానికి పడిపోయింది. కనీసం 2శాతం వరకు తేవడానికైనా కృషి చేయలేదు. అధిక దిగుబడులు, సాంకేతిక, అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని రైతులను సొంత ఎరువులకు, సొంత విత్తనాలకు, సొంత క్రిమిసంహారక మందులకు దూరం చేశాయి. రైతులకు అవసరమైన ప్రతివస్తువును మార్కెట్‌లో కంపెనీల నుంచి కొనుగోలు దారులుగా చేశాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల తెలంగాణ రాష్ట్రంలో 29 శాతం భూములు నిస్సారమైపోయినవని భూవిజ్ఞాన శాస్త్రవేతల తాజానివేదికలు చెబుతున్నాయి. సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్న భూమిలో ఏ పంటలు వేసినా యేపుగా ఎదగక చీడపీడలకులోనై వేసిన రసాయనిక ఎరువులు మొక్కలకు అందుబాటుకు రాక దిగుబడులు తగ్గి, పెట్టుబడులు పెరిగి రైతులు అప్పుల పాలవుతున్నారు.

వ్యవసాయరంగంపై సుదీర్ఘకాలంగా ప్రభుత్వాల నియంత్రణ, వాస్తవిక ప్రణాళికాలోపం ఈనాటి మరణాలకు ప్రధాన కారణం. సగటున 2 ఎకరాల చిన్న కమతాలు, నిరక్షరాస్యులైన రైతులు, వెనకబడిన వ్యవసాయక పద్ధతులు, ఒకేరకమైన పంటల నమూనా, నీటిపారుదల సౌకర్యాలకొరత, విద్యుత్ కొరత, బహుళ పంటల నుండి దూరంకావడం, ఆధునాతన పరిజ్ఞానం రైతులకు తెలియకపోవడం లాంటి సమస్యలు రైతుల ఆత్మహత్యలకు కారణాలుగా చెప్పవచ్చు. వ్యవసాయరంగాన్ని 1990కి ముందుతో పోల్చుకుంటే, మరీ ముఖ్యంగా ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన తరువాత వ్యవసాయరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అన్నిపార్టీలకు ఈ విషయంలో నిర్లిప్తత ఉంది. ఇందుకు వారు, వీరు అన్న తేడా లేదు. దేశంలోని అన్ని రాజకీయపక్షాలు ఇందుకు బాధ్యత వహించాల్సిందే. రైతులకు విధానపరంగానే అన్యాయం జరుగుతుంది. ఒకప్పుడు పండుగగా ఉన్న వ్యవసాయం ఈరోజు దండగగా మారడానికి పాలకుల విధానాలే కారణం. అత్యధిక గ్రామీణ ప్రజలకు ప్రధాన జీవనాధారం వ్యవసాయమే అయినప్పటికీ, దానిని భరించలేం అని రైతులు ఆందోళన చెందుతున్నారంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

రైతు పండించిన పంటలకు మద్దతు ధరలు అందక, రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో అనావృష్టికి తోడు పెట్టుబడి ఖర్చులు పెరిగి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం రైతు ఆశను అడియాస చేస్తోంది. ప్రధాన పంటలైన వరి, జొన్న, పత్తి సంబంధించి అత్యంత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత మద్దతు ధరలు రైతుకు ఏమాత్రం ప్రయోజనకరంగా లేవు. రైతుకు నికరలాభం ఉండాలంటే పెట్టుబడి ఖర్చులకు అదనంగా 50 శాతం చెల్లించాలని డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ సారథ్యంలోని జాతీయ రైతు సంఘం ఎప్పుడో సిఫార్సు చేసింది. దాని ప్రకారం దేశవ్యాప్తంగా క్వింటాలు వరికి రూ. 2,136 మద్దతు ధరగా ప్రకటించాల్సి ఉంది. ముఖ్యంగా వరి, గోధుమల కనీస మద్దతు ధరలు పెరిగితే ఆహార ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని ఆర్‌బీఐ అభిప్రాయపడుతోంది. వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తూ ఎగుమతిలో ముందుంటున్న దేశాలతో పోల్చినప్పుడు వరి మద్దతు ధరలు భారత్‌లోనే తక్కువ. ధరల విషయంలో రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయనడానికి మరో ఉదాహరణ పత్తి. దేశంలోని వస్త్ర పరిశ్రమలను కాపాడటానికి, రెండు దశాబ్దాలుగా పత్తికి కావాలనే 20శాతం తక్కువ ధర నిర్ణయిస్తూ వచ్చారని వ్యవసాయ వ్యయాల, ధరల కమిషన్ ఒక నివేదికలో వెల్లడించింది. మద్దతు ధర ప్రకటించిన అన్ని పంటలదీ దాదాపు ఇదే పరిస్థితి!

గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయ ఉత్పాదకతలో పెరుగుదల లేకపోగా, తరుగుదల నమోదవుతోంది. చీడపురుగు, కరవులు, అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు వలసబాట పడుతున్నారు. వ్యవసాయం నుంచి రైతులు పెద్దయెత్తున తప్పుకొని పట్టణాలకు కూలీలుగా వెళ్తున్నారు. రైతుల పిల్లలు వ్యవసాయంలో కొనసాగడానికి ఆసక్తి చూపటం లేదు. రైతు కుటుంబాలకు పంటల సాగుతో నెలనెలా అందుతున్న ఆదాయం రూ. 3,078 అని జాతీయ నమూనా సర్వే వెల్లడిచేసింది. రైతులు తమ కాళ్లపై తాము నిలబడేందుకు అవసరమైనవి మేలైన మద్దతు ధరలే. అవి లేకుంటే, వారు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుంది. చైనా, బ్రెజిల్, నెదర్లాండ్స్ దేశాల్లోని రైతులకు ఖచ్చితమైన నికరాదాయం లభిస్తుంది. భారత్‌లో ఇవేవీ అమలుకాక రైతులు పీకల్లోతు కష్టనష్టాల్లో కూరుకుపోతున్నారు. వారిని కాపాడటమంటే దేశానికి ఆహార భద్రత చేకూర్చడమే. దేశాన్ని సామాజికంగాను, ఆర్థికంగానూ బలోపేతం చేయడమే. మరింత 'మద్దతు' ధర ప్రకటించడంతో ప్రభుత్వం ఆ దిశలో వడివడిగా అడుగులు వేయాల్సిన సమయమిది. ఎందుకంటే, భారత్‌లో మిగతా అన్ని రంగాలవారీ ఆదాయాల కన్నా రైతు కుటుంబ ఆదాయం తక్కువ.

ఆహారధాన్యాల లభ్యత మీదే ఆర్థిక వ్యవస్థల, జీవుల మనుగడ ఆధారపడి ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తులు,

ఉత్పాదకతలు ఆహార భద్రతకు అత్యంత కీలకం. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం మంది జీవనోపాధి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ ఆధార కార్యకలాపాలైన ఏదో ఒక దానిపైన ఆధారపడి ఉన్నారు. తెలంగాణలో ఆహారధాన్యాల ఉత్పత్తి పెంపుదల.. వ్యవసాయ ఆదాయం పెంపుదల.. చాలా కీలకమైన అవసరాలుగా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి. ప్రధానంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో.. పంటల సేద్యం (వ్యవసాయం, ఉద్యాన పోషణ కలిపి), జీవోత్పత్తులు, అటవీ సంపద, మత్స్య పరిశ్రమ రంగాలను చేర్చాలి. వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికుల ఉపాధి పెరగడం అనేది ప్రధానంగా ఆహారధాన్యాల ఉత్పత్తుల్లో పెరుగుదల, ఆహార.. ఆదాయ భద్రత పెంపుపై ఆధారపడి ఉంటుంది.

రైతులకు అవసరమైన పురుగుమందుల ధరలు ఈ ఇరవై ఏళ్లలో ఎనిమిది నుంచి పది రెట్లు పెరిగాయి. అత్యవసరమైన డిఎపి, కాంప్లెక్స్ తదితర రసాయన ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రైతుకూలీలకు ఇచ్చే మొత్తాలు నాలుగైదు రెట్లు పెరిగాయి. విత్తనాల రేట్లు అలవికాని రీతిలో పెరిగాయి. మొత్తం మీద ఉత్పాదక వ్యయం ఆరు నుంచి ఎనిమిది రెట్ల వరకు అధికమైంది. ఒకవైపు వ్యవసాయ ఖర్చులు పెరిగినా అందుకు తగ్గట్టు ఉత్పత్తులకు రేటు పెరగలేదు. తత్ఫలితంగా రైతుల ఆదాయం నానాటికి తగ్గింది. మరోవైపు రాయతీల భారం తగ్గించుకోవాలని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటిఓ) నిర్దేశించింది. ఫలితంగా వ్యవసాయ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు తగ్గాయి. ప్రభుత్వాలు రైతులకు ఇచ్చే సబ్సిడీలు తగ్గిస్తున్న ఫలితంగా ఎరువుల నుంచి విద్యుత్తు, నీటిపారుదల సౌకర్యాల వరకు అన్నింటి వ్యయం ఎక్కువైంది. రైతులకు అయ్యే వ్యయాలు మాత్రం పెరుగుతుండగా ప్రభుత్వాలు సబ్సిడీలను గణనీయంగా తగ్గించాయి. దీనికితోడు నాసిరకం విత్తనాలు, పురుగు మందులతో రైతుల సమస్యలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. నాణ్యత విషయంలో నియంత్రణ తగ్గింది.

దేశంలోని రైతుల పరిస్థితిపై 2013లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక నివేదికను పరిశీలిస్తే కొన్ని వాస్తవాలు అవగతమవుతాయి. అధికారిక లెక్కల ప్రకారమే తెలంగాణలోని రైతుల్లో 90శాతం మంది అప్పుల ఊబిలో ఇరుక్కున్నారు. తెలంగాణలో నేడు రైతు సగటు రుణభారం రూ. 94,000. రైతు కుటుంబాలు నెలకు పొందుతున్న ఆదాయం రూ. 3,500 నుంచి రూ. 4,800 వరకు ఉంటే వ్యయభారం రూ. 5,200 నుంచి రూ. 5,800 వరకు ఉంది. ఆదాయం వ్యయం మధ్య వ్యత్యాసం 20 శాతం వరకు ఉంది. ప్రత్యేకించి గ్రామాల్లో వ్యవసాయేతరులతో పోల్చుకుంటే వ్యవసాయదారుల ఆదాయం 47శాతం, అదే పట్టణ శ్రామికుల ఆదాయంతో పోలిస్తే 33శాతంగా ఉంది. మనదేశంలో 60 కోట్ల మంది వ్యవసాయంపై ఆధారపడ్డారు. వీరిలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య 80 శాతం వరకు ఉంటుంది. వీరంతా కలిసి దేశం ఆదాయంలో 13 శాతాన్ని మాత్రమే అనుభవిస్తున్నారు. దేశంలో 50 శాతం మంది పేదలు ఉన్నారు. వీరిలో రైతుల వాటా 65 శాతం. ఆదాయం తగ్గడంతో దైనందిన అవసరాల కొరకు బక్క రైతులు మూడు నుంచి నాలుగు రూపాయల వడ్డీకి రుణాలను ప్రైవేటు వర్గాల నుంచి పొందాల్సి వస్తోంది. విద్య, వైద్యం కూడా ప్రైవేటుపరం కావడంతో భారం మరింత పెరిగింది. అలా అన్నం పెట్టే రైతన్న పరిస్థితి నానాటికి దయనీయంగా మారింది.

మార్కెట్‌లో పత్తికి గిరాకి ఉండటం వల్ల ఆపంటలనే మెట్ట ప్రాంతమైన ఎర్ర నేలలో పండించే ప్రయత్నం తెలంగాణలో 1980వ దశకంలో మొదలైంది. అందువలన నీటి వాడకం పెరిగింది. నూతనంగా సాగునీటి సౌకర్యాలు కల్పించకపోగా సంప్రదాయక సాగునీటి వ్యవస్థ (చెరువులు, కుంటలు) ను కూడ పరిరక్షించడానికి ప్రభుత్వాలు కృషి చేయనందున సాగునీటి వ్యవస్థ ధ్వంసమై రైతులు అనివార్యంగా బోర్లు, విద్యుత్‌పై ఆధారపడవల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రైతులు రుణగ్రస్థులయ్యారు. మరోవైపు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు చేతి వృత్తులను నాశనం చేశాయి. దీనితో వ్యవసాయంపై ఆధారపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విధంగా ప్రభుత్వ విధానాలే తెలంగాణ మెట్టప్రాంత వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. రైతులు సంప్రదాయ పంటలు జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశనగ, పెసరు, ఆముదాలు వగైరా పంటల నుంచి పత్తి, మిర్చి, పొద్దుతిరుగుడు పంటల వైపు మరలారు. అయితే సాగునీటి సౌకర్యంలేక వాణిజ్య పంటలకు చాలినంత నీరు అందక నష్టపోయారు. మొత్తంగా సాగునీటి కల్పనలోనూ, వ్యవసాయ విధానాల రూపకల్పనలోనూ వ్యవస్థీకృత అసమానతలను ప్రభుత్వం పెంచింది. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా మెట్ట ప్రాంతంలోని వాణిజ్య పంటలు వేసిన రైతులేకావడం గమనార్హం.

వ్యవసాయరంగ దుస్థితికి విరుగుడుగా రైతుల ఆదాయాలు పెంచేలా వ్యవసాయ ఆదాయాల సంఘం ఏర్పాటు చేయాలని పదకొండు జాతీయ రైతు సంఘాలు ప్రధాని మోదీకి ఉమ్మడిగా విజ్ఞాపన పత్రం సమర్పించాయి. జాతీయ నమూనా సర్వే ప్రకారం రైతు కుటుంబ సగటు నెలవారీ గరిష్ఠ ఆదాయం రూ. 6,426, కనిష్ఠ ఆదాయం రూ. 4,653గా నమోదైంది. ఏడో వేతన సంఘం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవనానికి అవసరమైన వివిధ ప్రాతిపదికల్ని గణించి ఆ మేరకు కనీస వేతనంగా

ఆదివాసీ హక్కుల నేత బి.డి.శర్మ



ఆదివాసీల హక్కుల సాధన కోసం జీవితకాలం పోరాడిన బ్రహ్మదేవ్ శర్మ డిసెంబర్ 6, 2015న తుదిశ్వాస విడిచారు. అట్టడుగు స్థాయి ప్రజల కోసం బిడిశర్మ 1991లో ప్రభుత్వ ఉన్నతాధికారాన్ని (ఐఏఎస్) స్వచ్ఛందంగా వదిలేసారు.

1956లో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బిడిశర్మ మొదట చత్తీస్‌గడ్‌లోని బస్తర్‌లో పెత్తందారీ ఆగడాలపై చర్యలు తీసుకొని ఆదివాసులకు అండగా నిలిచారు. 'హమారా గావ్‌మే హమారా రాజ్' అనే నినాదంతో గ్రామ స్వరాజ్యం కోసం ప్రజల్ని చైతన్యం చేసారు. 1992లో 'నాటె-న-రాజ్ ఆందోళన్' అనే సంస్థను బస్తర్‌లోని మవాలిభట అనే గ్రామంలో ఆయన స్థాపించారు. తర్వాత భారత జనాందోళన్ అనే ఉద్యమ సంస్థను కూడా నెలకొల్పారు. భారతదేశ పాలకుల సహకారంతో బహుళజాతి సంస్థలు బస్తర్‌ను దోపిడి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను అరికట్టేందుకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రజాసంఘాలతో కలిసి జాతీయ స్థాయి ఉద్యమం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 1996లో 'పెసా' చట్టాన్ని సాధించారు. ఈ చట్టం గిరిజన ప్రాంతాల్లోని గ్రామసభలకు సర్వాధికారాలను ఇచ్చింది. అయితే ఈ అధికారాలేవీ ఆచరణలోకి రాలేదు.

బస్తర్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ బహుళజాతి సంస్థలతో కలిసి స్థాపించాలనుకున్న ఉక్కు కర్మాగారానికి వ్యతిరేకంగా ఆయన ఆందోళన చేసారు.

ఆదివాసులతో కలిసి చేసిన పోరాటం ఫలితంగా కంపెనీ నెలకొల్పాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకుంది. ఇలా ఆయన చివరివరకు ఆదివాసులతో, ప్రజా ఉద్యమాలతో ఉన్నారు. ఆయన మరణం ఉద్యమాలకు తీరనిలోటు.

రూ. 18వేలు నిర్ధారించింది. ప్రస్తుతం రైతు కుటుంబ ఆదాయం ఉద్యోగివేతనంలో నాలుగోవంతు ఉందనీ రైతు సంఘాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వంలోని చిరుద్యోగితో సమానంగానైనా రైతు కుటుంబానికి ఆదాయం దక్కేలా చూడాలని, వైపరీత్యాల సమయంలో ఆర్థిక దన్ను, మార్కెటింగ్ సేవల అందుబాటు వంటి వాటి ద్వారా రైతుల ఆదాయాల పెంపుదలకు ప్రభుత్వాలు సుముఖం కావాలన్న డిమాండ్ చేస్తున్నాయి. రైతు జీవన భద్రత కోల్పోతే జాతి ఆహార భద్రత గాలిలో దీపమే!

నూతనంగా ఏర్పడిన తెలంగాణలో వ్యవసాయరంగానికి నిధుల కేటాయింపులు తగ్గుతున్నాయి. మార్కెట్ స్థిరీకరణకు 2014-15లో రూ. 400 కోట్లు కేటాయిస్తే, 2015-16 సంవత్సరంలో రూ. 75 కోట్లకు కుదించారు. అధీకృత సాగుచట్టం 2011లో తెచ్చిన తర్వాత కూడా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే కార్యక్రమం మందకొడిగానే సాగుతోంది. గుర్తింపు కార్డులు కలిగిన కౌలు రైతులకు సైతం బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. పత్తి విస్తీర్ణం హెచ్చిన ఫలితంగా కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణలో కనీసం పది లక్షల మంది కౌలు రైతులు ఉంటారని అంచనా. వీరిలో అత్యధికులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అప్పులు పెరిగి తీర్చలేక నిస్పృహకు లోనై ఆత్మహత్య చేసుకుంటున్నారు. రుణాలూ, వాటి మాఫీ ఫలితాలూ కూడా హైదరాబాద్‌లో కొలువులు చేస్తూ గ్రామాలలో భూమి కలిగియున్న వారికే రుణాలు అందుతున్నాయి కానీ సేద్యం చేసే కౌలు రైతులకు అందడం లేదు. తెలంగాణ ఏర్పడిన 2014, జూన్ 2 నుంచి నేటివరకు అధికారికంగానే 769 మంది రైతులు చనిపోగా, అనధికారికంగా ఇది 1300 పైనే ఉంది. ఆత్మహత్యలు ప్రతిరోజు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో రైతుల ఆదాయ భద్రతను ప్రభుత్వం తన బాధ్యతగా భావిస్తూ, ముఖ్యంగా అయిదు నిర్దిష్ట చర్యలు చేపట్టవలసి ఉంది. ఒకటి పెరిగిన ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో ఉంచుకుని, రైతుకు కచ్చితమైన లాభం ఉండేలా పంటల ధరలు నిర్ణయించాలి. రెండు ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని భావిస్తే పెట్టుబడి ఖర్చులను తగ్గించే విధంగా 'ఇన్‌పుట్ సబ్సిడీ' రూపంలో రాయితీలు కల్పించాలి. ఫలితంగా సాగు ఖర్చులు తగ్గుతాయి. మూడు పంటల ఉత్పాదకతను పెంచగలిగితే, స్వతహాగానే దిగుబడులు పెరిగి సాగు గిట్టుబాటు అవుతుంది. నాలుగు పంటల బీమా పథకం ప్రవేశపెట్టి పంటల వారిగా ఎకరానికి ఇంతా అని నిర్దిష్టంగా నిర్ణయించి అమలు చేయాలి. ఐదు భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలి. పై ఐదు అంశాల అమలుకొరకు రైతులు, పేదలు ప్రభుత్వాలపై చర్యలు తీసుకునేంత వరకు సంఘటితంగా ఉద్యమించాలి. ఈ ఉద్యమానికి ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, కులసంఘాలు మద్దతు తెలుపాలి. ఈ ఉద్యమం ప్రజాస్వామిక తెలంగాణ సాధన ఉద్యమంలో భాగమేనని ప్రజాస్వామిక తెలంగాణవాదులు గుర్తించాలి.

* రచయిత, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు

ప్రభుత్వాల వంచనే రైతు ఆత్మహత్యలకు కారణం

సాయన్న

రాష్ట్రంలో కొనసాగుతున్న రైతు ఆత్మహత్యలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అరికట్టడానికి తీక్షణ, దీర్ఘకాలిక చర్యలకు పూనుకోక పోగా వక్రీకరిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంలో రైతాంగ సమస్యలనే ప్రధానంగా ప్రస్తావించిన కేసీఆర్ నేడు వాటి ఊసెత్తితేనే సహించడం లేదు. కరెంటు, సాగునీరే శాశ్వత పరిష్కారం అంటూ సమస్య ఒకటైతే పరిష్కారం మరొకటి సూచిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సమస్యకు కారణాలను అన్వేషించి పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచవల్సిన అవసరం ఉంది.


2014లో దేశ వ్యాప్తంగా 12360 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇందులో మూడోవంతు మహారాష్ట్రలో ముఖ్యంగా విదర్భాలో జరిగాయి. మహారాష్ట్ర మొదటి వరుసలో నిలువుగా తెలంగాణ 1347 ఆత్మహత్యలతో రెండో స్థానంలో నిలిచింది. మహిళా రైతుల ఆత్మహత్యల్లో 147 మందితో దేశంలోనే ముందుంది. డిసెంబర్ రెండోవారం నాటికి 1820 మంది చనిపోయారు. 345 మాత్రమే వ్యవసాయ సంబంధమైనదిగా భావించి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించింది. ఈ విషయంలో మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇప్పటివరకు 272 మంది ఆత్మహత్య చేసుకుంటే కేవలం 20 మందికే ఎక్స్‌గ్రేషియా ఇచ్చారు. అనేక ఒత్తిళ్ళ వల్ల ఎక్స్‌గ్రేషియా లక్ష యాభై వేల నుంచి ఆరు లక్షలకు పెంచినా దానిని అందరికి ఇవ్వడానికి అంగీకరించక పోవడం శోచనీయం. అర్హులైన వారు కూడా జీఓ 421 ప్రకారం సహాయం పొందడానికి 12 సర్టిఫికెట్లు ఇవ్వాల్సి వస్తుంది. అందులో ప్రైవేటు రుణాల డాక్యుమెంట్లు రైతు పేరిట భూమి పాస్‌బుక్ లాంటివి అందించడం అసాధ్యమౌతుంది. ఎందుకంటే అప్పులు సాధారణంగా రాతపూర్వకంగా తీసుకోవడం జరగదు. రెండవది చనిపోతున్న రైతుల్లో 30-40 సంవత్సరాల వయస్సువారే ఎక్కువగా వుంటున్నారు. భూమి వీరి పేరిట కాకుండా ఇంటి పెద్ద పేరిటనే వుంటుంది. కౌలు రైతులకు ఇవి లభించవు. కాబట్టే జీఓని సవరించి కారణాలేవైనా, రైతు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వున్నది. కాబట్టి జీఓను సవరించి చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని రైతు సంఘాలన్ని డిమాండ్ చేస్తున్నాయి. ప్రతిపక్షాలు సహితం అరిచినా ప్రభుత్వం ఎందుకు ఇంత మొండిగా వ్యవహరిస్తున్నది? అంటే పెంచిన పరిహారం కొద్దిమందికే ఇవ్వడం ద్వారా ఈ పథకానికయ్యే ఖర్చు పెరగకుండా చూడాలనే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తుంది. పెంపు పేరుకే కొందరికి కాని అందరికి కాదని తెలుస్తుంది. కేసీఆర్ కూతురు కవిత, చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవడానికి దత్తత తీసుకోవాలని చందాలు వేసి ఆదుకోవాలని, ఉదారంగా మాట్లాడుతుంది. లక్షకోట్ల బడ్జెట్ నాయకులకు, కాంట్రాక్టర్లకు, కంపెనీలకు, రైతులను ఆదుకోవడానికేమో చందాలా?

గత సంవత్సరం ఖరీఫ్ ముగిసే నాటికి 30 శాతంలోటు, రబీలో 60 శాతం లోటు వర్షం నమోదైంది. పర్యావసనంగా 401 మండలాల్లో కరువు ఏర్పడిందని కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాని ప్రభుత్వం వీటిని 88మండలాలకు తగ్గించింది. ఈ నివేదికను కేంద్రానికి పంపనేలేదు. ఈ సంవత్సరం జూన్‌లో వర్షాలు పడ్డా జులైలో 66 శాతం, ఆగస్టులో 31 శాతంలోటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో వర్షాలు వచ్చినా అవి పంటకు నష్టం కలిగించాయి. దీని వల్ల భారీ పంట నష్టం జరిగింది. ఒకసారి పరిశీలిద్దాం.

లక్షల ఎకరాలలో

పంట	సాధారణ సాగు	సాగైంది	ఎండిపోయింది
వరి	26.47	5.42	1.05
పత్తి	40.38	40.40	23.00
మొక్కజొన్న	11.95	9.62	1.25
జొన్న	1.85	0.87	
సోయాబీన్	4.45	6.25	5.15 మొక్కదశలోనే


వరిపంట సాగుకావాల్సిన భూములను రైతులు బీళ్లుగా వదిలేశారు. 90 వేల ఎకరాల్లో వరి నార్లు ముదిరి పోయాయి. సోయాబీన్ కొద్దిగా ఎక్కువ సాగైతదనుకుంటే మొక్క దశలోనే ఎక్కువ భాగం ఎండిపోయింది. జులై నాటికీ ఈ దుస్థితి నెలకొన్నా ప్రభుత్వం చూస్తూ వుండి పోయింది. ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళిక రూపొందించి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి రైతులను గట్టెంక్కించాలనే ఆలోచనే లేదు. కేంద్ర ప్రభుత్వం నియమించిన



భూపేంద్రసింగ్ హుడా కమిటీ సిఫారసుల ప్రకారం కరువు ఏర్పడినప్పుడు ఎకరాకు ఆహార పంటలకు పదివేలు, వాణిజ్య పంటలకు 20 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 364 మండలాల్లో కరువు ఏర్పడింది. కాని రాష్ట్ర ప్రభుత్వం 231 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. తీవ్రకరువు పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో దీనిని నివారించడానికి 5 వేలకోట్లు అవసరం. కాని రాష్ట్ర ప్రభుత్వం మూడువేల కోట్ల అంచనాలనే రూపొందించింది. అన్ని గ్రామీణ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి 5 వేల కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రం చేయాలి.

గత ఏడాది ఆర్.బి.ఐ. రుణమాఫీకి అంగీకరించక పోవడంలో ఖరీఫ్‌లో రైతులకు రుణాలే దొరకలేదు. దీంతో రైతులు ప్రైవేటు రుణాల మీదనే పూర్తిగా ఆధారపడవల్సి వచ్చింది. సీజన్ చివరిలో ప్రభుత్వం బ్యాంకులకు 25 శాతం రుణం చెల్లించింది. కాబట్టి బ్యాంకర్లు రబీలో రైతుకు 25 శాతం రుణమే ఇచ్చారు. మిగతా 75 శాతం రుణానికి రైతులు వడ్డీ చెల్లించవల్సివచ్చింది. అదే విధంగా ఈ ఏడాది ప్రభుత్వం మొత్తం రుణం చెల్లిస్తేనే రైతులకు రుణాలిస్తామని బ్యాంకర్లు చెప్పారు. కాబట్టి 36 లక్షల మంది రైతులకు గాను కేవలం 16 లక్షల మంది రుణాలనే రెన్యువల్ చేశారు. పైకి 18 వేల కోట్ల రుణాలు ఇస్తామని ప్రకటించినా ఖరీఫ్ ముగిసే సమయానికి (5-9-15 నాటికి) 7 వేల కోట్లు (33.44 శాతం) మాత్రమే ఇచ్చారు. అంటే ఈ ఖరీఫ్‌లో సగానికి పైగా రైతులకు రుణాలే ఇవ్వలేదు. ఇచ్చిన వారికి కూడా సరిపడా ఇవ్వలేదు. పైగా రైతుపై వడ్డీ భారం పడింది. సీజన్ ప్రారంభమైన తరువాత ప్రభుత్వం మరో విడతగా 25 శాతం రుణం చెల్లించింది. దీనిని బట్టి రుణమాఫీ వల్ల రైతుకు లాభమేమి జరగలేదని అర్థమవుతుంది. ప్రయోజనం లేకుండా పోయింది కాబట్టే మొత్తం రుణాన్ని (మిగతా 50 శాతం 8500 కోట్లు) ఒకేసారి చెల్లించాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. దీనికి అవకాశాలు వున్నా ప్రభుత్వం పూనుకోవడం లేదు.

ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అత్యధికులు కౌలు రైతులే. వీరు రాష్ట్రంలో 10 లక్షల మంది వున్నారు. ప్రభుత్వం నాలుగు లక్షల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాని 26296 మందికే రుణ అర్హత కార్డులిచ్చింది. రుణం పొందాలంటే భూమి యజమాని అనుమతి వుండాలనే నిబంధన ప్రధాన అడ్డంకిగా మారింది. దీనిని తొలగించాలి కాని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కౌలు రేటును అదుపులో వుంచాలి. ఈ మేరకు చట్టంలో సవరణలు చేయాలి కాని ప్రభుత్వానికి పట్టదు. అదే విధంగా ప్రైవేటు రుణాలను బ్యాంకు రుణాలుగా మార్చాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు రుణాలపై నాలుగేండ్లు మారిటోరియం విధించాలని కోరుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఇది అసాధ్యమేమి కాదు. కేరళ ప్రభుత్వం ఈ రెండింటిని అమలు చేసే రైతులను రుణ విముక్తులను చేసింది. రైతుల విషయంలో బ్యాంకుల పాత్ర



ప్రొఫెసర్ సాయిబాబాకు బెయిల్ మంజూరు చేయాలి

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాకు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను నాగపూర్ ధర్మాసనం డిసెంబర్ 23న తిరస్కరించింది. సాయిబాబాను 48 గంటల్లోగా జైలులో లొంగిపోవాలని లేనిపక్షంలో అరెస్టు చేయాల్సిందిగా నాగపూర్ కోర్టు ఆదేశించింది. 90 శాతం వైకల్యం, హృదయ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న సాయిబాబాకు వెంటనే షరతులు లేని బెయిల్ మంజూరు చేయాలి.

గర్హనీయంగా వుంది. ఇవి రైతుల పట్ల అవమానకరంగా వ్యవహరిస్తున్నాయి. లక్షల కోట్లు ఎగ్గొడుతున్న బడాకంపెనీలకు ఎర్ర తివాచీలు పరుస్తూ రైతులపై వివక్ష చూపుతున్నాయి. బ్యాంకులు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇచ్చేలా చూడవల్సిన కేంద్ర ప్రభుత్వం మౌనంగా వుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది లేదు.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనది ధనిక రాష్ట్రం అని కేసిఆర్ బాకాలూదుతున్నాడు. ఇతర రాష్ట్రాల కన్నా వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు మన రాష్ట్రంలో ఎక్కువగా వున్నాయి. అలాంటప్పుడు మన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు ఎక్కువగా నిర్ణయించాలి కదా. కాని రాష్ట్ర ప్రభుత్వం కూడా వరికి కేంద్రం ప్రకటించిన ధర క్వింటాలుకు 1450 రూపాయలే నిర్ణయించడాన్ని ఏమనాలి? వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు చాలా అన్యాయంగా, అశాస్త్రీయంగా నిర్ణయించ బడుతున్నాయి. బీజేపీ ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసుకోని అధికారం చేపట్టాక వాటిని అమలు చేయం అని కోర్టుకు చెప్పడం దాని దివాళకోరుతనానికి నిదర్శనం కాదా? కమిషన్ సిఫారసుల ప్రకారం ధరలు నిర్ణయిస్తే నేడు ప్రకటించిన ధరలు దాదాపు వంద శాతం పెరుగుతాయి. పత్తికి క్వింటాలుకు 8 వేల రూపాయలు ఇవ్వాలి. కాని 3700 నుండి 4100 నిర్ణయించింది. గత సంవత్సరం కూడా ధర ఇంతేవుంది. పెంచిన పంటల ధరలు కూడా కేవలం 15-50 రూపాయలే పెంచారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా చూస్తే ఈ పెంపు తగ్గించినట్టుగానే భావించాలి. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరల విషయంలో దుర్మార్గమైన విధానాన్ని అవలంభిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమైనా కనీసం పత్తికి క్వింటాలుకు వెయ్యి రూపాయలు బోనస్ ఇస్తే రైతుకు ఆసరాగా వండేది. కాని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విమర్శిస్తూ తాను తప్పుకుంటుంది.

ఈ విధంగా చూసినప్పుడు ప్రకృతి పరంగా వచ్చే కరువుకన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న దగాకోరు విధానాల వల్లనే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని అర్థమౌతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరినొకరు విమర్శించు కోవడం విమర్శలో తమ ప్రతిభా పాటవాలను పరిక్షించుకోవడానికి రైతులను మోసం చేయడానికే. బలమైన రైతాంగ పోరాటమే వీరి దొంగ నాటకాలను నిలిపివేయగలదు. అయితే రైతాంగం అసంఘటితంగా వుంది. పోరాట శక్తులు బలహీనంగా వున్నాయి. అయినా రైతులు తమ ఆగ్రహాన్ని వెల్లగక్కుతూనే వున్నాయి. అదిలాబాద్ పట్టణంలో మార్కెట్ కార్యాలయంపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనం. దీనిని చైతన్యవంతంగా, నిర్మాణాత్మకంగా సాగించినప్పుడే రైతాంగ ఉద్యమం ఒక వెల్లువగా మారుతుంది. సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతుంది. ఇందుకోసం తెలంగాణ రైతాంగ సమితి పదేళ్లుగా చేస్తున్న కృషి చాలడం లేదు. కాబట్టి రైతులే పూనుకోని గ్రామ గ్రామాన సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి. తమ హక్కులకై నినదించాలి సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాలి.

* రచయిత, రాష్ట్రకమిటీ సభ్యులు,
తెలంగాణ రైతాంగ సమితి

ఉస్మానియా బతుకు బజారు పాలు చేసిందెవరు?

అరుణాంక్

ఉద్యమాల పురిటి గడ్డ, విద్యార్థులనువీరులగా తయారు చేసినవీర గడ్డ, ఈ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర ఉద్యమం మొదలుకొని, నిజాం వ్యతిరేక పోరాటాలు, అధికార మార్పిడి అనంతర ఇడ్లి, సాంబార్ గోబ్యాక్, నాన్ ముల్కి గోబ్యాక్, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలకు అండగా ఉండడమే కాదు అన్ని ఉద్యమాల్లో ఉస్మానియా విశ్వ విద్యాలయం క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నది. తెలంగాణలో ఉస్మానియా విద్యార్థులు లేని పోరాటమే లేదంటే అతిశయోక్తి కాదు. ఈ దేశంలో నిరంతరం చలనం ఉండే మూడు యూనివర్సిటీల్లో మెదటిదిగా ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్) తరువాత వరుసగా జాదవ్ పూర్ యూనివర్సిటీ (కలకత్తా), జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (ఢిల్లీ) విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూనే ఉంటారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థుల పాత్ర లేని సందర్భం లేదు. తెలంగాణలో జరిగిన అన్ని రకాల పోరాటాల్లో ఉస్మానియా విద్యార్థులు లేని పోరాటం లేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రిటిష్ చరిత్రకారుడు 'పెరి అండర్సన్' తెలంగాణ ఉద్యమం కాలంలో తను రాస్తున్న 'ఇండియన్ ఐడియాలజీ' పుస్తకానికి సంబంధించిన రెఫరెన్సుల కోసం ఉస్మానియా యూనివర్సిటి లైబ్రరీకి వచ్చి పరిశోధించిండంటే ఉస్మానియా గొప్పతనం అర్థం చేసుకోవచ్చు. కానీ ఏ తెలంగాణ కోసం అయితే ఉస్మానియా విద్యార్థులు వీరోచిత పోరాటం చేసి డిశంబర్ 9 ప్రకటనను తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారో ఇవాళ ఉస్మానియా యూనివర్సిటీ తాను పోరాడి సాధించుకున్న తెలంగాణలో వివక్షతకు గురి అవుతున్నది.

'ఉస్మానియా బతుకు బజారు పాలు, పైనపటారం.. లోన లొటారం...' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఉస్మానియా యూనివర్సిటిలో నెలకొన్న పరిస్థితులపై మూడు రోజులు వరుస కథనాలు ప్రచురించింది. ఆ కథనాల్లో ఉస్మానియాలో నెలకొన్న పరిస్థితులను కొంతమేరకు ప్రజలకు అందించగలిగింది. ఈ వివక్ష కేవలం ఉస్మానియా యూనివర్సిటీపైనే కాదు తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటిలపై కొనసాగుతున్నది. తెలంగాణ వచ్చిన నాటి నుండి వైస్ ఛాన్సలర్లు లేక యూనివర్సిటీల పరిపాలన అంతా కుంటుపడింది. తాత్కాలికంగా ఐఏఎస్ అధికారులను నియమించడం వెనుక యూనివర్సిటీలకున్న స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి సచివాలయం నుంచి యూనివర్సిటిలని పరిపాలించాలనే కుట్ర ఉన్నది. ఆ కుట్రలో భాగంగానే ఉస్మానియా, కాకతీయలే గాక ఏ ఒక్క యూనివర్సిటీకి నిష్ణాతులైన రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్లను నియమించకుండా విద్యా విధానంపై ఏ మాత్రం అవగాహన లేని ఐఏఎస్‌లతో యూనివర్సిటీలను నడుపుతూ ఉన్నత విద్యకు కేసిఆర్ తూట్లు పొడుస్తున్నాడు. ఇప్పుడైతే ఎక్కువగా ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను విసిలుగా నియమించవచ్చని జీవో తీసుకువచ్చాడు. 'యూనివర్సిటీల్లో చదువుకుంటున్నది అట్టడుగు కులాలకు/వర్గాలకు చెందిన విద్యార్థులు కాబట్టి వారిని విద్యకు దూరం చేసి, మొత్తంగా ప్రభుత్వ విద్యా విధానాన్నే ధ్వంసం చేసి ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహించాలనే కుట్ర ఇందులో దాగున్నది. కేంద్రం ఒక వైపు ఉన్నత విద్యారంగాన్ని గాట్స్‌లో (General Agreement on Trade in Services) భాగం చెయ్యాలనే చూస్తుంటే చైతన్యవంతులైన విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఈ కుట్రలను ప్రశ్నిస్తున్న, వారికీ మద్దతుగా యూనివర్సిటీల్లో ఉన్న ప్రజాస్వామిక విలువలు కలిగిన ప్రొఫెసర్లు మినహా మెజారిటీ ప్రొఫెసర్లు నిలబడే పరిస్థితి లేదు. ఎంత సేపు మా జీతాలు పెంచండి, అరవై ఏండ్ల వయోపరిమితిని అరవై రెండేండ్లకు పెంచండి అని మాట్లాడటం తప్పితే యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేక పరిపాలన కుంటుపడిందనో, నిధులు లేక యూనివర్సిటీల్లో పరిశోధనలు ఆగిపోయాయనో మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ. యూనివర్సిటీల్లో విద్యార్థులకు, ప్రొఫెసర్లకు ఉన్న సంబంధాల కోసం మాట్లాడితే కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందన్నట్లు ఉంటుంది. చివరకు విద్యార్థులు ఈ తప్పుడు విధానాలను ప్రశ్నిస్తున్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని ఆ పోరాటాలను అణచివేసేందుకు ప్రభుత్వాలకు చెంచాలుగా వ్యవహరించే వారిని యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా నియమించి, రిజిస్ట్రార్ అనుసరిస్తున్న ప్రభుత్వ అనుకూల, విద్యార్థి వ్యతిరేక విధానాలని ప్రశ్నిస్తున్నారని గన్‌మెన్‌లని పెట్టి మరి యూనివర్సిటీని నడిపిస్తున్నారు. ఈ దేశంలోని యూనివర్సిటీల

చరిత్రలో యూనివర్సిటీల్లోకి పోలీసుల ప్రమేయం ఉండొద్దని మాట్లాడి, అమలుచేసిన రిజిస్ట్రార్‌లు, వైస్ ఛాన్సలర్‌లు ఉన్నారు కానీ, ఒక రిజిస్ట్రార్ తనకి విద్యార్థులు నుండి హాని ఉన్నదని గన్‌మెన్‌ని పెట్టుకోవడం ఉస్మానియా యూనివర్సిటి రిజిస్ట్రార్‌కే దక్కింది.

తెలంగాణ వస్తే మా బతుకులు బాగు పడతాయని, ఉద్యమానికి రాజకీయ నాయకులు ద్రోహం చేసినప్పుడల్లా తమ బలిదానాలతోఉద్యమ సెగ చల్లారకుండా చేసి ఉద్యమాన్ని తమ భుజాలకెత్తుకొని నడిపించిన విద్యార్థులు ఇవ్వాల మెస్ బిల్లులు కట్టలేక పై చదువులు ఆపేసే పరిస్థితి నెలకొని ఉన్నది. కేజీ నుండి పిజి ఉచిత విద్య అని ప్రగల్భాలు పలుకుతున్న కెసిఆర్ అసలు తన దృష్టిలో కేజీ నుండి పిజ్ ఉచిత విద్య అంటే, కామన్ స్కూల్ విద్యా విధానం గురించి తను ఏమనుకుంటున్నాడో ఇప్పటి వరకు చెప్పలేదు. ప్రపంచ దేశాలన్నీ విద్య, వైద్య సదుపాయాలను ప్రభుత్వ పరిధిలోనే ఉంచి ఉచితంగా అందిస్తుంటే మన దగ్గర విద్య, వైద్య రంగాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి పాలకులు ఉవ్విళ్లూరుతున్నారు. కెసిఆర్ అనుసరిస్తున్న విధానాలు కూడా అలానే ఉన్నాయి. కేజీ నుండి పిజి ఉచిత మంటే విద్యతో పాటు వసతి గృహాలు, భోజన సౌకర్యం కల్పించడం కూడా. కేసిఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విద్యార్థుల మెస్ బకాయిల ఏడు కోట్ల రూపాయలను నేటి వరకు విడుదల చేయలేదు. వరంగల్ ఉప ఎన్నికలకు ముందు మెస్ బకాయిలను రద్దుచేస్తామని ప్రకటించి ఆర్థికమంత్రిని ఆ బకాయిలు వెంటనే విడుదల చేయమని చెప్పినా నేటి వరకు దానికి సంబంధించి జీవో రాలేదు. ఆ అంశాన్ని కేవలం ఎన్నికల ఎత్తుగడగా వాడుకున్నాడనేది స్పష్టం. ఉస్మానియా యూనివర్సిటీలో మెస్ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి వాటికి వసూలు యంత్రాంగం ఏమిలేదు అని ఈ బకాయిలకు కళాశాలల ప్రిన్సిపాల్స్‌ని, యూనివర్సిటీ చీఫ్ వార్డెన్స్‌ని, హాస్టల్ వార్డెన్స్‌ని బాధ్యులు చేస్తూ బకాయిలను వారి జీతాల నుండి ఒకవేళ ఎవరైనా పదవి విరమణ చేసి ఉంటే వారి పెన్షన్స్ నుండి వసూలు చేయాలనీ ప్రజా పద్దుల కమిటి ఉస్మానియా యూనివర్సిటీ పాలక యంత్రాంగాన్ని హెచ్చరించింది. దీంతో యూనివర్సిటీ రిజిస్ట్రార్ విద్యార్థులు మెస్ బకాయిలు కట్టేంత వరకు వారికి వారి కోర్సులు ఉత్తీర్ణులు అయినట్లు సర్టిఫికెట్లు ఇవ్వొద్దని ఒక సర్క్యులర్ జారి చేశాడు. దీంతో డబ్బులు కట్టలేని కొందరు విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక వారి చదువును అర్థాంతరంగా ఆపివేశారు. యూనివర్సిటీ విద్యార్థులకు నెలకు ప్రభుత్వం మంజూరు చేసే మెస్ బిల్ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ. 820, బిసి విద్యార్థులైతే రూ. 650, పరిశోధన విద్యార్థులకు రూ. 1200లు. అవి కూడా విద్యార్థి సంఘాలు సంవత్సరానికి నాలుగు ముట్టడిలు, పది ధర్నాలు చేస్తే తప్ప విడుదల కావు. కానీ మెస్ బిల్లు 3000 నుండి 3500 వరకు వస్తుంటే నెలకు రెండువేల పైచిలుకు విద్యార్థులపై భారం పడుతున్నది.. ఉస్మానియాలో చదువుతున్నది అంతా గ్రామీణ ప్రాంతపు బడుగు, బలహీన వర్గాల పిల్లలే. పూట గడవడమే కష్టమవుతున్న పీడిత కులాల నుండి వచ్చిన వారు నెలకు రెండు వేల రూపాయల భారాన్ని ఎలా భరిస్తారు. విద్యార్థుల కనీస సౌకర్యాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది కదా?

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులు పడుతున్న కష్టాలను చూసి మొసలి కన్నీరు కార్చారు. వారి పదేళ్ల పరిపాలన కాలంలో కూడా యూనివర్సిటీల బాగోగులు ఎన్నడూ పట్టించుకున్నది లేదు. ఇవ్వాళ అధికారం లేదు కాబట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి విద్యార్థులు, వారు పడుతున్న కష్టాలు వారికి గుర్తొచ్చాయి తప్పితే నిజంగా విద్యార్థుల పట్ల వారికున్న ప్రేమ ఎంత మాత్రము కాదు అనేది సత్యం. ఉస్మానియా విద్యార్థులపై ఎవరి వైఖరి ఎలా ఉన్న వారి అవసరాలను తీర్చాల్సిన బాధ్యత విద్యార్థుల పోరాటాన్ని, బలిదానాలను సీట్లుగా మలచుకొని గద్దెనెక్కిన టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఉన్నది. కేవలం ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు కేటాయించడమే కాదు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు రాజకీయాలకతీతంగా వైస్ ఛాన్సలర్‌లని నియమించడంతో పాటు, తన ఎన్నిక వాగ్దానమైన కేజీ నుండి పిజి ఉచిత విద్య, కామన్ స్కూల్ విద్యా విధానం అమలు చెయ్యాల్సిన నైతిక బాధ్యత టిఆర్ఎస్ ప్రభుత్వానిదే. తను కేజీ నుండి పిజి ఉచిత విద్య అని ఒక వైపు అంటుంటే అటువైపు కేంద్రం విద్యను పెట్టుబడిదారి దేశాల కనుసన్నల్లో నడిచే గాట్స్‌లో భాగం చెయ్యాలని చూస్తున్నది. నిజంగా టిఆర్ఎస్ కేజీ నుండి పిజి ఉచిత విద్యకు, కామన్ స్కూల్ విధానానికి కట్టుబడి ఉంటే కేంద్రం ఉన్నత విద్యారంగాన్ని గాట్స్‌లో చేర్చాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. టిఆర్ఎస్ ఉస్మానియా యూనివర్సిటీ పట్ల కక్షపూరితమైన వివక్షతను వ్యక్తపరుస్తున్నది. కెసిఆర్ ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చినప్పుడు విద్యార్థులు చెప్పులు చూపెట్టారు దానికే కెసిఆర్ తన ప్రతీకారం తీర్చుకుంటున్నాడనేది జగమెరిగిన సత్యం. కెసిఆర్ ఇలానే తన కక్షపూరిత వైఖరిని కొనసాగిస్తే ఏ విద్యార్థుల పోరాటంతోనైతే తను గద్దెనెక్కాడో అదే విద్యార్థి పోరాటంతో గద్దె దిగడం ఖాయం.

* రచయిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిఎస్‌యు

RSS హైడ్రామా ఓయులో బీఫ్ ఫెస్టివల్ విజయవంతం

డి.రంజిత్

మోడీ కేంద్రంలో అధికారంలోకి రాకపూర్వం పెద్దకూర అమ్మకం, తినడాన్ని నిషేధించాలని గాంధేయ మార్గంలో నిరసించిన హిందుత్వ శక్తులు మోడీ సింహాసనం అదిష్టించినాక వరుస దాడులు, హత్యలతో అసహన రాజకీయాలను ప్రదర్శిస్తున్నారు. పెద్ద కూర తినని వాడే ఈ దేశంలో ఉండాలని, తినాలనుకున్నవారు పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో వెళ్లాలని హూంకరిస్తున్నారు. అక్లక్ అనే వ్యక్తి పెద్ద కూర నిల్వ చేసుకున్నారనే నెపంతో చంపివేశారు. ఆ తరువాత అది కోడి మాంసం అని తేలింది. నోమన్ అనే వ్యక్తి పెద్ద కూర తరలిస్తడనే నెపంతో కొట్టి హత్య గావించారు. జుహీద్ గోవులను కబేలాలకు అమ్ముతున్నాడని పాశవికంగా చంపివేసారు. జమ్ము కాశ్మీర్ ఎమ్ఎల్ఏ రహీద్ బీఫ్ పార్టీ ఇచ్చేవాడని నిందు అసెంబ్లీలో దాడి చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి, సిద్ధరామయ్యను "పెద్దకూర తింటే తప్పేముంది..? ఎవరిష్టం వారిది, మీరు చేసే రాద్ధాంతం చూస్తుంటే, నాకు తినాలనుంది" అంటే "తల నరికి ఫుట్‌బాల్ ఆడుతామని" అంటున్నారు మొత్తంగా దేశంలో అసహన విద్వేషాలు రెచ్చగొడుతూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీకి తప్పులను, దౌర్జన్యాన్ని, ఆధిపత్యాన్ని, దోపిడి, పీడనలను ఎత్తి చూపే సాహస వీరత్వం ఉన్నది. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా మాట్లాడు గొంతుకగా ఉస్మానియా నిలిచిందని చరిత్ర రుజువు చేస్తున్నది. ఓ.యూ విద్యార్థులు హిందుత్వ రాజకీయాలను ఆర్ఎస్ఎస్ క్రియాశీలకంగా కదుపుతూ దళిత బహుజన, మైనార్టీ, ఆహార సంస్కృతిపైన దాడి చేస్తున్న స్థితిని ధ్వంసం చేయాలనుకున్నారు. యూనివర్సిటీలోని దళిత, బహుజన, సామాజిక, విప్లవ, వామపక్ష మైనార్టీ విద్యార్థి సంఘాలు దాదాపు 25 కలిసి డెమోక్రటిక్ కల్చరల్ ఫోరం (DCF) గా ఏర్పడినారు. 2015 డిసెంబర్ 10 ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా ఉస్మానియా వేదికగా పెద్దకూర తినడం మా హక్కు దీనిని ఆ రోజు సామూహికంగా భుజిస్తాం అని ప్రకటన చేశారు. దాని వరుస అవగాహన కార్యక్రమాలను విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆహ్వానం పలికారు. దీనికి బిజెపి కిషన్ రెడ్డి మినహాయింపు కాదు. నవంబర్ 17న సన్నాహక సదస్సు, 1న కవి సమ్మేళనం, 5న రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం, 7న 2కెరన్ చివరగా 10న "బీఫ్ ఫెస్టివల్" నిర్వహిస్తామని కార్యాచరణని ప్రకటించారు.



బిజెపి పార్టీ గోషామహల్ ఎమ్ఎల్ఏ రాజాసింగ్ హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయంటు "గోమాత బచాలో ఆందోళన" కార్యక్రమం అంటూ డిసెంబర్ 10న చలో ఉస్మానియా అని పిలుపునిస్తూ కత్తిపట్టి వస్తున్నట్లు ఉన్న పోస్టర్స్‌ను విడుదల చేశారు. దేశంలోని హిందువులంత తరలిరావాలంటూ పిలుపునిచ్చాడు. "దాద్రి ఘటనలు మళ్లి పునరావృతమైతాయంటూ" హెచ్చరికలు జారి చేశాడు. దళిత బహుజన మైనారిటీలు వారి తిండి వారు తింటే మనోభావాలు దెబ్బతీయడం ఏమిటి? నీకు అభ్యంతరమైతే నీవు తినకు కాని నా హక్కుపై నీ దాడి ఏమిటి? అని ఓయు విద్యార్థులు ప్రశ్నించారు. విద్యార్థులు రాజాసింగ్ పోస్టర్‌ను తీసుకెళ్లి ఓ.యూ పి.ఎస్‌లో కేసుపెట్టి తరువాత అసెంబ్లీ స్పీకర్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. స్పీకర్ మదుసూధనాచారికి మతతత్వాన్ని రెచ్చగొట్టే చర్యలు చేస్తున్న రాజాసింగ్ పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఆర్ఎస్ఎస్ శాఖలల్లో క్రియాశీలకంగా ఉన్న ఓ.యూ విద్యార్థులు కొందరు డిసెంబర్-10న పోర్కు ఫెస్టివల్స్ నిర్వహిస్తామని, ఆ తరువాత బోటి, రోటి, సొలాయి, కాయగూరల ఫెస్టివల్స్‌లు నిర్వహిస్తామని హాస్యాస్పదంగా మీడియా ముందుకు వచ్చారు. మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మేం పోర్క్ ఫెస్టివల్ ఆహ్వానిస్తున్నాం. అదే విధంగా వేరు వేరుగా ఈ ఫెస్టివల్స్‌ను నిర్వహించకుండా కలిపే సెక్యూలర్ దావత్‌గా నిర్వహిద్దాం. కనుక కలసి రావాల్సిందిగా కోరితే ససేమిరా అన్నారు... పోర్కు ఫెస్టివల్ నిర్వహిస్తామంటున్న నిర్వాహకుల్లారా... మీ ఆహార హక్కుపై ఒక్కసారైనా దాడి జరిగిందా? బ్యాన్ చేయాలని ఎవరైనా

హింసాత్మకంగా డిమాండ్ చేశారా? వివరించాలని సవాల్ విసిరారు.

కపట నాటకంలో బీఫ్ ఫెస్టివల్‌ను అడ్డుకోవాలని "గోమాత" అంటూ, ఆవును పవిత్రం అంటూ, కనీసం ఆవుకి ఇచ్చిన మర్యాద, పూజా, గౌరవం, మనిషికి ఇవ్వని మీరు "దశావతారాలల్లో" "వరహావతారం" అయిన పందిని తింటే మీ మనోభావం ఎందుకు దెబ్బతినదో చెప్పాలి. పందిని ఆవును తింటున్న వారు మీ హిందువులు కారనే విషయాన్ని బహిరంగ ప్రకటనతో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒకవైపు నుంచి ఈ రాద్ధాంత పూరిత చర్చ జరుగుతుంది. మరొక వైపు పవిత్రమైన యూనివర్సిటీలో ఈ బీఫ్ ఫెస్టివల్ ఏమిటని కొందరు సున్నితంగా ప్రశ్నించారు. ఏనాడు యూనివర్సిటీ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని నడపని వ్యక్తులు సైతం ఇదే అదునుగా బాణాలు ఎక్కు పెట్టారు.

వీటన్నింటికి డిసిఎఫ్ సభ్యులు సముచితంగా సమాధానం చెపుతూనే బీఫ్ ఫెస్టివల్ ఖచ్చితంగా నిర్వహిస్తామని ఘంటాపదంగా చెప్పారు. ఇది ఇలా ఉండగా యూనివర్సిటీ యాజమాన్యం, పోలీసు అధికారుల నుంచి కూడా వేధింపులు కొనసాగాయి. యూనివర్సిటీలలో ఏ ఫెస్టివల్‌కు పర్మిషన్స్ గురించి ప్రస్తావించని యాజమాన్యం, ఏనాడు కనీసం ఏ ఒక్క విద్యార్థితో సంభాషించడానికి ఇష్టపడని రిజిస్ట్రార్, ఇంత వరకు ఓ.యూ మొహం ఎరుగని ఇన్‌చార్జి విసి పర్మిషన్స్ లేవని ప్రకటనలు చేశారు. కింది పీడితకులాల విద్యార్థులపై కర్కష ప్రవర్తన పద్ధతిలో వచ్చిన ఈ ప్రకటనకు సమాధానంగా "యూనివర్సిటీలో ఏ పండుగలను(వినాయక చవితి, నాగుల చవితి, శివరాత్రి, ఉత్సవాలు, పండుగలు) నిర్వహించ వద్దని ఆర్డర్స్ చేసి సెక్యులర్‌గా నిలుపుతామని రాత పూర్వక హామి ఇవ్వండి. మేం ఇప్పుడే ఈ ఫెస్టివల్స్‌ని ఇక్కడి నుండి విరమించుకుంటామని" తెలియజేశారు. దీనిపై యూనివర్సిటీ యాజమాన్యం స్పందించలేదు.

డిసిఎఫ్ ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమాలకు ఆటంకాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారు. డిసెంబర్-5న జరిగిన రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశానికి పర్మిషన్ ఇవ్వకుంటే ఆర్ట్స్ కాలేజీ నేలపై కూర్చొని కార్యక్రమం నిర్వహించారు.

డిసెంబర్-7న 2కె రన్ ఫర్ బీఫ్‌ను అతి దుర్మార్గంగా పోలీసులు అడ్డుకున్నారు.

ఎక్కడ వారిని అక్కడే అరెస్ట్ చేసి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు నిర్బంధించారు. అదే రోజు జిల్లా సివిల్ కోర్టు విశ్వహిందు పరిషత్, గోపరిరక్షణ సమితి వారు వేసిన కేసుతో ఇచ్చిన ఆదేశక సూత్రాల ప్రకారం బీఫ్ అంటే ఆవు మాంసమనే అర్థంతో 20 వరకు ఫెస్టివల్స్‌ను ఆపాలని స్టే ఇచ్చింది. ఇది ఊహించని పరిణామం. ఇది ఇచ్చిన స్టే గురించి మీడియాలో తప్ప డిసిఎఫ్ సభ్యులెవ్వరికి అందలేదు.

డిసెంబర్-9న హైకోర్టు కింద సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తరతరాల నుంచి కూడు, గూడు, గుడ్డతో పాటు కనీసం సమాజంలో సమానంగా జీవించే హక్కు కోసం నిరంతరం మనుగడ పోరాటం సాగిస్తున్న మాకు కోర్టు తీర్పులు బంధకం కావని, స్వతంత్ర్య భారతంలో ఏనాడు కోర్టులు ప్రభుత్వ వ్యతిరేకతీర్పులు ఇవ్వలేదన్న స్పష్టత ఉన్నదని అయినా 2012వ సంవత్సరంలో హెచ్‌సియులో ఇదే అంశం తెరపైకి వచ్చినప్పుడు బీఫ్ తినవచ్చుననే తీర్పు దృష్ట్యా ప్రస్తుత తీర్పును పున:సమీక్షించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

డిసెంబర్-9 నుంచి యూనివర్సిటీ ఒక కల్లోలిత ప్రాంతంలోని పోలీస్ క్యాంపులా మార్చి వేశారు. అన్ని హాస్టల్స్‌ను పోలీస్ ఆధీనంలో ఉంచుకున్నారు. బీఫ్ ఫెస్టివల్ నిర్వహకులను కనిపిస్తే అరెస్టులు చేసేందుకు సిద్ధమయినారు. మొత్తంగా తెలంగాణ ఉద్యమ సమయాన ఉన్న వాతావరణంను కల్పించి. గత ప్రభుత్వాల కంటే తాము తక్కువేమి కాదనే సత్యాన్ని రుజువు చేశారు.

డిసెంబర్ - 10న ఫెస్టివల్ నిర్వహిస్తే నేరం, ధిక్కారం కాని తమ తమ రూంలల్లో తినడం మా హక్కు అని రూంలో తింటున్న విద్యార్థులను చితకబాది దాదాపు 23 మందిపై కేసులు నమోదు చేసి మరునాడు కోర్టుకు హాజరుపరిచారు. బీఫ్ ఫెస్టివల్ నిర్వహకులను ఎక్కడికక్కడే నిలువరించారు. పంది కూర ఫెస్టివల్ అన్నవారు ఆ రోజు కనుమరుగై పోయారు. రోటి, బోటి సాలాయ్ అన్నవారి రూపమే లేదు. యూనివర్సిటీలో విద్యా వాతావరణం ఉండాలని శాంతి పలుకులు వల్లించిన వారు ఈ పోలీసుల దమనకాండపైన స్పందన లేదు. ఆర్ఎస్ఎస్ వారు గోమాత పూజ నిర్వహిస్తామని కిరాయి ఆవును ఓ.యుకు తరలించుకొచ్చారు. పోలీసులు ఆవును అదుపులోకి తీసుకోవడంతో పరారైన హిందు మత ఉగ్రవాదుల ఆచరణను బట్టి ఆవుపై వారి కపట ప్రేమ అర్థం చేసుకోవచ్చు. చివరికి ఆవును విడిపించుకోవడానికి దాని యజమాని పడ్డ ఆవేదన అంతా ఇంతా కాదు.

తమకు నచ్చిన వారసత్వపు ఆహారాన్ని సామూహికంగా తిందామనుకున్నా ఆలోచనలను నలువైపుల నుంచి వేటాడిన ఆధిపత్య స్వభావాన్ని, అగ్రవర్ణతత్వాన్ని చూస్తుంటే గాంధీతో అంబేడ్కర్ "సమానంగా, గౌరవంగా, స్వేచ్ఛగా జీవించడానికి మాకు మా మాతృదేశం కావాలి" అన్న మాటలు ఈ దేశ మూల వాసులల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. నూతన సమాజ నిర్మాణానికి బీజాలు అవుతూనే ఉన్నాయి.

* రచయిత, పి.డి.యస్.యు అధ్యక్షులు, ఓయు

గిరిజన విద్య - అభివృద్ధి

■ కె. ఉమాశంకర్

ఉపోద్ఘాతం :

భారత రాజ్యాంగం షెడ్యూల్ తెగ(ఎస్.టి)లకు ప్రత్యేక హోదా కేటాయించింది. సంప్రదాయకంగా వీరిని ఆదివాసులు, వనవాసులు లేదా గిరిజనులుగా పేర్కొంటారు. ఎస్.టిలు భారత జనాభాలో 8.6% ఉన్నారు. దేశవ్యాప్తంగా 573 షెడ్యూల్ తెగలు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆయా తెగలు వారి తెగలకు సొంత భాషలు కలిగి ఉన్నాయి. అటువంటివి భారతదేశంలో 270 భాషలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో గిరిజన జనాభా 10.4 కోట్లు. మన దేశంలో గిరిజనులు అత్యధిక సంఖ్యలో మధ్యప్రదేశ్ (15.31 మిలియన్లు), మహారాష్ట్ర(10.51 మిలియన్లు), ఒరిస్సా(9.59 మిలియన్లు), గుజరాత్(8.96 మిలియన్లు)లలో ఉన్నారు. అయితే మొత్తం జనాభాలో గిరిజనులు పెద్దసంఖ్యలో లక్ష్యద్వీప్(94.8%), మిజోరాం(94.4%), నాగాలాండ్(86.5%), అరుణాచల్‌ప్రదేశ్ (68.8%), మేఘాలయ(86.1%)లలో ఉన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రాలలో భారతదేశంలోని గిరిజన జనాభాలో ఐదింట నాల్గోవంతు ఉంటుంది. రాజ్యాంగంలో తెగ లేదా గిరిజన పదం ఎక్కడ నిర్వచించబడలేదు. ఆర్టికల్ 342 ప్రకారం ఎస్.టి అంటే తెగ లేదా గిరిజన కమ్యూనిటీలను సూచిస్తుందని రాష్ట్రపతి నోటీఫై చేస్తాడు. భారత దేశంలోని ఎస్.టిలు బాహ్య ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో దేశీయ లేదా స్థానిక ప్రజలతో పోలి ఉంటారు.

షెడ్యూల్ తెగలవారు విద్యలో బాగా వెనకబాటు, వివక్షకు గురికావడం వల్ల వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు, చర్యలు స్వాతంత్ర్య సమయంలోనే ప్రారంభించారు. ఐదవ పంచవర్ష ప్రణాళికలో ఎలిమెంటరి విద్య, గిరిజన ఉప ప్రణాళికకు ప్రాధాన్యత ఇచ్చారు. గిరిజన పిల్లల విద్య ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ఎందుకంటే ఇది కేవలం రాజ్యాంగం బాధ్యత మాత్రమే కాదు, గిరిజనుల మొత్తం అభివృద్ధికి కృషి చేస్తుంది.

ప్రస్తుతం ఈ ఆర్టికల్ గిరిజన పిల్లల విద్యా రంగంలో, సమస్యలు, అభివృద్ధి విశ్లేషించడానికి, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా చెంచులలో విద్యా అధ్యయనానికి ప్రయత్నం చేసింది. అదే విధంగా వెనకబడిన ప్రాంతంలోని ప్రజల బానిస, మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాల గురించి పేర్కొంటుంది. జిల్లా గిరిజన ప్రాంతాల్లో నిర్వహించిన అధ్యయనం ఆధారంగా ఈ అంశాలు తెలపబడుతున్నాయి.

కీలక పదాలు : రిటెన్షన్(నిలుపుదల) సమస్యలు, గిరిజన సమూహాలు షెడ్యూల్డ్ తెగలు, డ్రాప్‌ఔట్ సమస్య, మానవ విలువలు, స్వంత భాషలో విద్య.

పరిచయం :

ఇటీవల కాలంలో గణనీయమైన ఆర్థిక వృద్ధి, అనేక అవకాశాలను సృష్టించడం వలన సామాజిక అభివృద్ధి వేగవంతం అయినట్లుగా కనిపిస్తోంది. అభివృద్ధి ప్రణాళిక విధానాలు వృధా కాకుండా ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

విద్య అనేది నిరక్ష్యరాస్యులైన సమాజంలో కూడా వుంటుంది. ఇది ప్రజలచేత మౌఖిక ప్రవర్తనలో అమలవుతుంటుంది. ఆదిమ సమాజ మానవులు తమ జీవన విధానాన్ని తెలుసుకుంటారు. మంచి పనులు, కట్టుబడి నిబంధనలు మొదలగునవి సమాజంలో చట్టాలు నియంత్రణ వలె ఉంటాయి. ఆధునిక ప్రజలు అనగా "విద్యా పఠనం, రచన". అమర్త్యసేన్ ప్రకారం ఆధునిక విద్యతో పరిజ్ఞానం పెంచడానికి, దృష్టిని విస్తరించేందుకు అభివృద్ధి ఫలాలు లేదా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది. అందుకే ఆధునిక విద్య అనేది "ఉత్ప్రేరకం" వలే ముఖ్యపాత్ర పోషిస్తుంది. సామాజిక, రాజకీయ, ఆర్థికవ్యవస్థలో మార్పులు తీసుకువస్తుంది. సమాజంలో అభివృద్ధి కార్యకలాపాలు వైఫల్యం చెందడానికి ముఖ్యకారణాలు కలవు. పలు అభివృద్ధి ఎజెండాలు తీవ్రమైన నిరక్షరాస్యత ప్రాబల్యం, నిర్లక్ష్యంతో ఉండడం. గ్రామీణ ప్రజల మధ్య మూఢనమ్మకాలు బలంగా నాటుకుపోవడం అందుకే ఆర్థిక వెనుకబాటుతనాన్ని పారద్రోలె సామాజిక విద్యా వ్యాప్తి అత్యంత ప్రభావవంతమైన, భవిష్యత్తును అభివృద్ధి పథంలో నడిపే సాధనంగా చెప్పబడుతుంది.

భారత రాజ్యాంగం షెడ్యూల్ తెగ(ఎస్.టి)లకు ప్రత్యేక హోదా కేటాయించింది. ఎస్.టిలు భారత జనాభాలో 8.6% ఉన్నారు. దేశవ్యాప్తంగా 573 షెడ్యూల్ తెగలు వివిధ ప్రాంతాల్లో

నివసిస్తున్నారు. ఆయా తెగలు వారి తెగలకు సొంత భాషలు కలిగి ఉన్నాయి. అటువంటివి భారతదేశంలో 270 భాషలు ఉన్నాయి.


మహబూబ్‌నగర్ జిల్లా ముఖచిత్రం :

చెంచు జాతి ప్రజలు నల్లమల ప్రాంతాలలో అనగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ (కర్నూల్, ప్రకాశం, గుంటూరు) రాష్ట్రాలలో నివసిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరిశీలించినట్లయితే అత్యధికంగా మహబుబ్‌నగర్, నల్లగొండ, అక్కడక్కడ రంగారెడ్డి జిల్లాలో కూడా నివసిస్తున్నారు. మహబుబ్‌నగర్ జిల్లా పరిశీలించినట్లయితే వివిధ రకాల సంస్కృతి, సమ్మేళనం అనగా హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు వీరితో పాటు గణనీయమైన గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం 2014 సంవత్సరంలో నిర్వహించిన సమగ్రసర్వే ప్రకారం తెలంగాణలో 16 గిరిజన తెగలు ఉన్నట్లు ప్రకటించారు. జిల్లాలో మొత్తం మగవారి జనాభా 20,50,386, ఆడవారి జనాభా 20,02,642. మొత్తం జనాభాలో ఎస్సీలు 7,08,954, ఎస్టీలు 3,64,269 కలరు. లింగనిష్పత్తి గ్రామాలలో ప్రతి 1000 మంది పురుషులకు 976 మంది స్త్రీలు కలరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 1000 మంది పురుషులకు 972 మంది స్త్రీలు కలరు. జిల్లాలో 0 నుంచి 6 సంవత్సరాల మధ్య వయసున్నవారి జనాభా 3,37,459 వీరి లింగనిష్పత్తి గ్రామీణ ప్రాంతాల్లో 929, పట్టణ ప్రాంతాల్లో 947 కలదు. జిల్లా జనసాంద్రత 220 చ.కి.మీ గా ఉంది. జనాభాలో సుమారు 80% ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు.

మహబుబ్‌నగర్ జిల్లాలో అచ్చంపేట, కొల్లాపూర్, అమ్రాబాద్, లింగాల, బల్మూర్, ఉప్పునుంతల అనే మండలాల్లో గిరిజన చెంచు ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చెంచు ప్రజలు కొన్ని తెగలుగా విభజించబడ్డారు ఆ తెగల పేర్లు కాట్రాజ్, ఉడతల, మేకల, తోకల, చిగుర్ల, దాసరి, భూమని, అర్తి మొదలగునవి. గిరిజన ప్రజలు ఇప్పటికి వారి సామాజిక జీవనంలో వారి సొంత సంప్రదాయాలను అనుసరిస్తున్నారు. మహబుబ్‌నగర్ జిల్లాలో 2 కేంద్ర ప్రభుత్వ, 286 రాష్ట్ర ప్రభుత్వ, 3566 మండల పరిషత్, జిల్లా పరిషత్, 52 ప్రైవేట్ ఎయిడెడ్, 1178 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ట్రైబల్ సబ్ ప్లాన్ పేరు "అభివృద్ధి కోసం పాఠశాలలు". బాల్యంలో పాక్షికంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలో లేదా అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యను అందించడం ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణలో తీసుకొచ్చారు. అయినా గిరిజన సమాజంలో విద్యా ఫలాలను అందించలేకపోతున్నారు.

గిరిజన విద్యార్థులు :

తెలంగాణ జిల్లాలలో నిర్వహించిన సర్వే ప్రకారం 15% నుంచి 40% మాత్రమే పాఠశాలలకు హాజరవుతున్నారు. పాలమూరు జిల్లా వలస కూలీలకు పేరుగాంచిన జిల్లా ఈ విషయం మనందరికి విధితమే జిల్లాలో డ్రాప్ ఔట్ సమస్యకు



కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. మొదటిది, అతి ముఖ్యమైనది ఆర్థిక వెనక బాటుతనం, జిల్లాలోని ప్రజల పేదరికం, సన్నకారు వ్యవసాయం చేయడం, ముఖ్యంగా చెంచులు అడవులపై ఆధారపడి జీవనం కొనసాగించడం, వారి పిల్లలు తల్లిదండ్రులతో పాటు పనులలో భాగస్వాములు కావడం, వీరికి బయటి సమాజంతో ఎటువంటి సంబంధం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ప్రధాన అవాంతరాలుగా ఏర్పడడం వలన వారి పిల్లలను చదువులకు పంపలేకపోతున్నారు. రెండవది అజ్ఞానం, మూఢనమ్మకాలు విద్యావ్యాప్తిలో ముఖ్యమైన లోపంగా ఏర్పడింది. గిరిజన ప్రాంతంలో ప్రజలు మూఢ, అంధ విశ్వాసాలకు బానిసగా మారడం వలన వారు విద్యా విలువలను అర్థం చేసుకోకపోవడం ఒక సమస్య. మూడవది గిరిజన విద్యార్థులు రిటెన్షన్ (నిలుపుదల) సమస్యకు కీలక కారణం వారి సాంస్కృతిక, జీవనశైలి. గిరిజన ప్రాంతాలలో చదువుకోవడానికి ఒక మంచి వాతావరణం దొరకకపోవడం, ప్రభుత్వం గిరిజన సంస్కృతి సంప్రదాయ పండుగలకు సెలవులను ఇవ్వక పోవడం వలన గిరిజన విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరు అవుతారు. ఈ కారణాల వలన గిరిజనేతర విద్యార్థులతో పోలిస్తే గిరిజన విద్యార్థులు తరగతిలో ప్రజ్ఞాపాటవాలలో వ్యత్యాసం కనబడుతుంది.

పాఠశాల మానివేయడానికి మరో ప్రధాన సమస్య ఆరోగ్యం. ఆరోగ్య సంబంధ విషయాలపై అవగాహన లేకపోవడం, పౌష్టిక ఆహారాన్ని వారు పొందలేక పోవటం వలన గిరిజన పిల్లలు తరుచుగా అనారోగ్యానికి గురై శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉండదు. ఆర్థిక కొరత సమస్య కారణంగా వారి తల్లిదండ్రులు సమయానికి వైద్యునికి చూపించకపోవడం వలన వారు చాలా రోజులు అనారోగ్యానికి గురవుతుంటారు. అనారోగ్యం నుంచి తేరుకొని పాఠశాలకు వెళ్లే సరికి తరగతిలో వెనకబడతారు.

గిరిజన విద్యార్థులు పాఠశాల మానివేయడానికి కొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి.

1. గిరిజన పిల్లలు వారి అభివృద్ధిని త్వరగా వ్యక్త పరచలేరు.
2. ఆంగ్ల, తెలుగు భాషలో బోధన గిరిజన పిల్లలకు విదేశీ భాష వలే ఉంటుంది.
3. గిరిజనేతర ఉపాధ్యాయులు గిరిజన ప్రాంత పాఠశాలలో పని చేయడం వలన వారి సాంస్కృతిక విలువలు తెలియకపోవడం.
4. విద్యార్థులు తరుచుగా పాఠశాలలు మారడం.
5. పాఠశాలలో గిరిజన సంస్కృతి లేకపోవడం.
6. పాఠశాల వాతావరణం గిరిజన విద్యార్థులను ఆకర్షించక పోవటం.
7. గిరిజన పిల్లల వయసుకు తగ్గ తరగతి అభ్యసించకపోవడం.
8. కొన్ని పాఠశాలలు సొంత భవనాలు కలిగి ఉండకపోవడం.
9. మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించడం.
10. కొన్ని పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడం.
11. ఉపాధ్యాయులు పాఠశాల విధులు సరిగా నిర్వహించక పోవడం.
12. కమ్యూనికేషన్ సౌకర్యాలు లేకపోవటం.
13. సమయానికి పుస్తకాలు సరఫరా చేయకపోవడం.

గిరిజన విద్యార్థుల డ్రాప్ ఔట్స్‌కు అనేక కారణాలు ఉన్నాయి. ఈ డ్రాప్ ఔట్స్ ప్రక్రియ ఇదేవిధంగా కొనసాగితే అక్షరాస్యత రేటు నెమ్మదించి 86వ రాజ్యాంగ సవరణ చట్టం 2002 ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న బాలబాలికలు ప్రాథమిక విద్య పొందడం వారి ప్రాథమిక హక్కు అని పేర్కొనే అధికరణకు ప్రయోజనం లేకుండా పోతుంది. భారత రాజ్యాంగం 1950లో ప్రవేశపెట్టిన 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న బాలబాలికలు ప్రాథమిక విద్య అనే లక్ష్యం 1965లో అమలుపరిచారు కాని అది విఫలమయింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు 100 శాతం అక్ష్యరాస్యత సాధించాలనే లక్ష్యంగా ప్రకటిస్తోంది కాని విజయవంతం కావడంలేదు. 1965 నుంచి 50 సంవత్సరాలు గడుస్తున్నా లక్ష్యం మాత్రం సాధించనేలేదు. 100 శాతం ఫలితం సాధించడానికి కనీసం కొన్ని దశాబ్దాలు వేచి చూడాల్సి ఉంటుందేమో అనే భావన విశ్లేషకులలో కలుగుతుంది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విద్యా హక్కు చట్టం ఖచ్చితంగా అమలు పరిచే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే ఈ సమస్యకు పరిష్కారం, లక్ష్యాన్ని త్వరగా చేరుకోవచ్చు.

ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు :

1. గిరిజనేతర ఉపాధ్యాయులు గిరిజనుల భాష, సంప్రదాయాలు, సంస్కృతులు, జీవనశైలిని తెలుసుకోకపోవడం, జానపద సంస్కృతిలోని అమూల్యమైన మానవ విలువలను అవగతం చేసుకోవడానికి ప్రయత్నించడంలో ఉదాసీన వైఖరి అవలంభించడం వల్ల విద్యావిధానాన్ని ఆసక్తికరం చేయడంలో విఫలం అవుతున్నారు.

2. గిరిజనేతర ఉపాధ్యాయుల ఆలోచనలు గిరిజనుల పర్యావరణం, సంస్కృతిపై వ్యతిరేక భావనలో ఉంటాయి. వారి పరిసరాల నుంచి ఏర్పడే భావనలు సంక్లిష్టంగా మారడం వల్ల గిరిజన పిల్లలలో సృజనాత్మకతను నిర్మించడం లేదు.

★ రచయిత, ఎం.ఎ., బి.ఇడి, ఓయు

గురుకులాలు - బోధన

■ జి. నాగరాజు

బోధన, అభ్యసనం అనేవి ఒకే నాణేనికి చెరొకవైపున ఉండే బొమ్మ, బొరుసు లాంటివి. నాణెం నుండి బొమ్మ, బొరుసులలో దేన్ని వేరు చేసినా ఆ ద్రవ్యానికి ఎలాంటి విలువ ఉండదు అన్నది ఎంత సత్యమో బోధన, అభ్యసనాలలో దేన్ని వేరు చేసినా విద్యా వ్యవస్థ కుంటుబడిపోతుంది అన్నది కూడా అంతే సత్యమని మనం గ్రహించక తప్పదు. దీనికి ఉదాహరణగా పూర్వం గురుకులాల్లో జరిగిన బోధన, అభ్యసన విధానమే అని చెప్పవచ్చు. ఈ గురుకులాల్లో ఉదయం, సాయంత్రపు వేళల్లో కొద్ది సమయంలో గురువు బోధించిన తరువాత తాను బోధించిన విషయం శిష్యులు ఎంత మేరకు అర్థం చేసుకున్నారో తెలుసుకునేందుకు, శిష్యులు తాము అభ్యసించిన విషయాలు గురువుకు అప్పటికప్పుడు అప్పజెప్పేవారు. బోధన, అభ్యసన ప్రక్రియలు వెంట వెంటనే ముగిసిన తరువాత కొంత మంది శిష్యులు గురువు గోవులను మేపుటకై అడవికి వెళ్లితే, కొంత మంది శిష్యులు గురుకులంలో, గురువుకు పరిచర్యలు చేస్తూ తాము ఆర్జించే విద్యకు గురువుకు శ్రమ రూపంలో ఫీజు చెల్లించేవారు. ఇక్కడ గురువు దగ్గర పార్ట్ టైం జాబ్ కూడా చేసుకునే వీలుండేది అన్నమాట.

ఈ గురుకులాల్లో ప్రతిభ గల శిష్యులు గురువుల పర్యవేక్షణలో బోధించేవారు. దీనినే మానిటోరియల్ విధానం అంటారు. బెల్ అనే విద్యావేత్త ఈ పద్ధతిని మన దేశంలో చూసి ఇంగ్లాండ్‌లో సార్వజనీన విద్యావ్యాప్తి తక్కువ ఖర్చుతో సాధించగలమని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినందువల్ల తరువాత కాలంలో దీనిని "బెల్ సిస్టమ్" గా పేర్కొన్నారు. గురుకులాల్లో ఉండే ఈ బోధన పద్ధతి శిష్యుల మేధస్సును పెంచేది.

గాంధీజీ పేర్కొన్న (1939) "లర్నింగ్ వైల్ ఎర్నింగ్", కొఠారి పేర్కొన్న (1964-66) "పని అనుభవం", ఈశ్వరిబాయి పటేల్ (1977) కమిటీ ప్రకారం "ఎస్.యు.పి.డబ్ల్యు", యశ్ పాల్ కమిటీ (1993) ప్రకారం "లెర్నింగ్ విఠౌట్ బర్డెన్", జాతీయ పాఠ్యప్రణాళిక చట్టం-2005 ప్రకారం "ఏదైన భాషను ద్వితీయ భాషగా నేర్పాలనుకొంటే చదవడానికి ముందుగా భాషను పరిచయం చెయ్యాలి. అంటే విన్పించాలి, మాట్లాడించాలి". ఇవి ఆనాటి గురుకుల విద్యాలయాల్లోనే ఆచరణాత్మకంగా ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. కాని నేటి విద్యావిధానంలో ఇవి అమలుకు నోచుకోవటం లేదు. వివిధ కమిటీల సూచనలను కాగితాలకు మాత్రమే పరిమితం చేసి విద్యా వ్యవస్థను గాలికి వదిలేసారు. ఇది పాలకుల దోషమా లేక ప్రజాధనాన్ని జీతాలుగా తీసుకుంటున్న అధికారుల లోపమా అనేది అర్థం కాని విషయం. ఇలాంటప్పుడు ప్రజా సొమ్ముతో కమిటీలను వేయడం ఎందుకో?

నేడు విద్య పిల్లలకే కాక వారి తల్లిదండ్రులకు కూడా భారంగా మారింది. పిల్లల చదువుల కొరకు పిల్లలే శ్రమించే పరిస్థితి నుండి తల్లిదండ్రులు కష్టపడి సంపాదించే సొమ్మంతా పిల్లల ఫీజులు కట్టేందుకే తగలెట్టె స్థితికి విద్యా వ్యవస్థ దిగజారిన విషయం మన కళ్ళ ముందు కనబడుతూనే ఉంది. అయినా నాణ్యమైన విద్య పిల్లలకు అందడంలేదు. దీనికి కారణం తరగతి గదిలో బోధన మాత్రమే జరిగి విద్యార్థులలో ఎంత మేరకు అభ్యసనం జరిగిందో తెలుసుకొనుటకు ఉపాధ్యాయులు విద్యార్థుల చేత మాట్లాడించకపోవడమే. పిల్లల్ని మౌనంగా కూచోబెట్టడానికే మన ఉపాధ్యాయుల శక్తి అంతా ఖర్చయిపోతుంది. పిల్లలు మాట్లాడాన్ని ఒక తలనొప్పిగా చూడకుండా వాళ్లను అభివృద్ధి చెయ్యడానికి అదొక వనరుగా ఉపాధ్యాయులు చూడాలి. అప్పుడు నియంత్రణ, ప్రతిఘటన అనే విషవలయం నుండి వ్యక్తీకరణ, స్పందన అనే ఒక మంచి వలయంగా మారుతుంది.

ఉపాధ్యాయునికి, ప్రధానోపాధ్యాయునికి నిశ్శబ్దంగా ఉండని క్లాసులంటే కోపమెక్కువ, ఉపాధ్యాయులు క్లాసును అదుపులో పెట్టలేక పోయినందువల్ల ఇవి క్లాసులలా ఉన్నాయా అని అరవడం ఎందుకు? పిల్లలందరు తమలో తాము చర్చించుకొనే క్లాసులుగా వీటినెందుకు మార్చకూడదు? ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేయాల్సింది బల ప్రయోగంకాదు. సాధికారతను ఉపయోగించాలి. నిరంకుశత్వం, హేతురాహిత్యం అనేవి బలప్రయోగపు లక్షణాలు, వీటిని చూసి భయపడతారు తప్ప ఎవ్వరు వీటిని గౌరవించరు.

పూర్వపు గురుకులాల్లో పాఠ్యపుస్తకాలు ఉండేవి కావు. కాని ఈ రోజుల్లో పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నందుకు సంతోషపడాలో లేక బాధ పడాలో తెలియని అయోమయస్థితిలో మనం ఉన్నాం. తరగతి గదిలో బోధన మాత్రమే జరిపి పాఠ్యపుస్తకాలు ఉన్నాయని అభ్యసనాన్ని ఇంటి దగ్గరకు హోం వర్కుగా ఇస్తున్నారు. తరగతి గదిలోనే విని, విసిగి అలసిపోయిన


(తరువాయి 42వ పేజీలో ...)

యాదాద్రి థర్మల్ విద్యుత్ - మానవ వినాశనం

బాషపంగు శివాజి

తెలంగాణ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన యాదాద్రి బొగ్గు ఆధారిత (థర్మల్) పవర్ ప్లాంట్ వలన నల్లగొండ జిల్లా దామెరచర్ల మండలంలోని కొండ్రపోలు, కల్లెపల్లి, తిమ్మాపురం, తాళ్ళవీరప్పగూడెం, వీర్లపాలెం, ముదిమాణిక్యము. మిర్యాలగూడెం మండలంలోని అన్నారం గ్రామం. త్రిపురారం మండలంలోని దిలావర్‌పూర్ లాంటి గ్రామాలను అనుకొని వున్న తండాలు దాదాపు 20 ముంపు ప్రాంతాలను బొగ్గు రాకాసి మింగేయబోతుంది. ఈ 4000 మెగావాట్లకు బొగ్గు ఆధారిత పవర్‌ప్లాంట్‌ని 30 వేల కోట్లకు వ్యయంతో నిర్మించదలచినారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు 2014 డిసెంబర్‌లో లీమా(పెరూదేశం)లో క్లైమేట్ కాన్ఫరెన్స్‌లో బొగ్గు ఆధారిత పవర్‌ప్లాంట్లని నిర్మించకూడదని ఉన్నవాటిని కూడ త్వరలోనే మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఎందుకంటే బొగ్గును మండించడం వలన వెలువడే కర్బన్ ఉద్గారాల వలన భూతాపం పెరిగి మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అదే విధంగా ప్రపంచంలోని దాదాపు 200 దేశాలకు పైగా ప్రపంచనేతలు "వాతావరణ విపత్తు సమీపిస్తోందని" కాప్-21 సదస్సు పేరిట (నవంబర్- డిసెంబర్ 11) ఫ్రాన్స్ దేశంలోని పారిస్‌లో సమావేశమయి భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్ కన్నా బాగా తక్కువకు పరిమితం చేయటానికి అంగీకరిస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భారతదేశం కూడా తన ఆమోదాన్ని తెలిపింది. కాని ప్రపంచ దేశాల ముందు ఒప్పందాన్ని కుదుర్చుకుని వచ్చి ఇక్కడేమో ఒప్పందానికి విరుద్ధంగా భూతాపాన్ని పెంచే బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్లనే ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకొని ప్రయత్నాలు ప్రారంభించింది.

ఈ యాదాద్రి పవర్ ప్లాంట్‌లో రోజుకు 1,33,000 మెట్రిక్ టన్నుల బొగ్గును కాల్చుతారు. దీనికి 7,60,000 ఘనపు మీటర్ల (1 ఘ.మి = 1000 లీటర్లు) నీరు అవసరమవుతాయి. దీని నుంచి వెలువడే బూడిద రోజుకి 51,000 మెట్రిక్ టన్నులు, వ్యర్థపు నీరు రోజుకు 1,03,246 ఘ.మీ. ఈ బొగ్గును మండించడం వలన నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, జింక్, యురేనియం, థోరియం వంటి రేడియో ధార్మిక విషవాయువులు వెలువడుతాయి. ఈ లోహాలు గాలిలో, నీటిలో కలవడం మూలంగా ప్రజలకు క్యాన్సర్, ఊపిరితిత్తుల



వ్యాధులు, కిడ్నీ, చర్మం సంబంధిత వ్యాధులు, గర్భస్థ శిశుమరణాలు సంభవిస్తాయి. అదే విధంగా ప్లాంటు నుంచి వెలువడే వ్యర్థపు నీరు భూగర్భ జలాలలో కలిసి నీరు కలుషితమవుతుంది, కలుషిత నీటివలన, బూడిద వలన పచ్చని పొలాలు కనుమరుగవుతాయి, జీవన ప్రమాణాలు తగ్గిపోతాయి.

ఈ ప్లాంటుకి కావాల్సిన భూమి సుమారు 10 వేల ఎకరాలు, ఈ ప్రాంతంలో ఇంతకు ముందు సాగర్ ముంపు గ్రామాల నుంచి పునారావసం పొందిన ప్రజలు సాగుచేసుకున్న భూములు, పేదలకు ప్రభుత్వమిచ్చిన అసైన్డ్ భూములు, ఫారెస్ట్ యాక్టు కింద ఆదివాసుల కిచ్చిన భూములు దాదాపు 5వేల ఎకరాలపైనే ఉంటాయి. ప్రజలు ఎంతో శ్రమపడి సాగుచేసుకున్న భూములు విస్తాపనకు గురవుతాయి. ఈ ప్లాంటు వల్ల అడవిలో ఉండే ప్రాణులు, వాటితో మమేకమయిన పరిసరాలు పూర్తిగా ధ్వంసమవుతాయి. ప్రత్యామ్నాయంగా రంగారెడ్డి జిల్లాలో అడవులను పెంచుతామని (అభివృద్ధి) చేస్తామని మన తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. కాని ఇటువంటివి సాధ్యమైన దాఖలాలు ప్రపపంచంలో ఎక్కడా లేవు.

ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా 'వైట్ హౌస్' నుంచి జాతినుద్దేశించి థర్మల్ పవర్ ప్లాంటు నుంచి ఉత్పన్నమయ్యే విద్యుత్‌ని వాడటం వల్ల మానవాళి అంతానికే ముప్పు వాటిల్లుతుందనే సందేశాన్ని ఇచ్చాడు. ఒక వైపు అగ్రరాజ్యమే థర్మల్ ప్లాంటులు వద్దని సోలార్ ద్వారా లభించే విద్యుత్‌ని వాడటం మేలని చెబుతుంటే మన దేశమేమో ఇష్టారాజ్యంగా థర్మల్ పవర్‌ప్లాంటులకు ఆమోదం తెలుపుకుంటూ పోతూ వుంది. అపుడు బొగ్గుతో విద్యుత్ అనేది ప్రజల గుండెలపై కుంపటి పెట్టినట్లవుతుంది కదా.

ఇక్కడ ఏర్పాటు చేయబోయే యాదాద్రి పవర్ ప్లాంటు పూర్తిగా బొగ్గు ఆధారితమైనది. మనదేశంలో బొగ్గు లభ్యత ఘననీయంగా తగ్గిపోయింది. ఒక పక్క ప్రపంచ దేశాలలోని ప్రజలు థర్మల్‌ని త్రవ్వకూడదని వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్లాంటుకి బొగ్గు కావాలంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి కాని విదేశాలలోని ప్రజలు వ్యతిరేకించడం వలన బొగ్గు సరఫరా ఆగిపోతుంది. తత్ఫలితంగా పూర్తిగా బొగ్గు ఆధారితమైన ఈ ప్లాంటుని మూసివేయడం జరుగుతుంది. అప్పుడు ఈ ప్లాంటుకు పెట్టిన 30 వేల కోట్ల రూపాయలు వృథా అవుతాయి. మరి ఈ భారం మోసేది ఎవరు? సామాన్య ప్రజలు కాదా?

ఇలాంటి థర్మల్ పవర్ ప్లాంటులు పెడితే రాబోయే ప్రమాదాల గురించి మంచి చెడులు చెప్పకుండా, అధికార బలంతో పోలీస్ పహారాలో గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చదివి, తెల్ల కాగితాల మీద ప్రజలతో బలవంతంగా సంతకాలు పెట్టించి, ప్రజల ఆమోదమున్నట్లు తప్పుడు రిపోర్టులు పంపించడం జరిపించారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజాభిప్రాయ సేకరణ పద్ధతి ఇదా?

యాదాద్రి పవర్ ప్లాంటు పరిసర ప్రాంతాలలోని ప్రజలు దీనిపై పూర్తి వ్యతిరేకంగా వున్నారు. ఇక్కడి గిరిజన ప్రజలు పొట్టతిప్పల కొరకు కడుపుకట్టుకుని పట్టణాలకు వలసబోయి పాచిపనులు చేసి విసుగుచెంది, తమ ప్రాంతానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కుదుట పడుతున్న సమయంలో ప్రభుత్వం తమ ఊర్లను విడిచి వెళ్లాలని చెపుతున్నాయి. వాళ్ళ భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి మా భూములను కాపాడుకుంటామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పవర్‌ప్లాంటు పెట్టడం వలన ఉద్యోగాలు ఇస్తామని, భూములకు డబ్బులు ఇస్తామని మభ్యపెడుతుంది ఈ ప్రభుత్వం. ఇంతకు ముందు ఉన్న థర్మల్ పవర్ ప్లాంటులో ఎంతమంది పుట్టిన ఊర్లను, భూములను కోల్పోయిన గ్రామస్తులు ఉద్యోగులుగాన్నారు? వాటిల్లో స్థానికులెంత మంది? వారు ఏ స్థాయి ఉద్యోగులు? ఆలోచించవలసిన అవసరం ఎంతగానో ఉంది.

మన రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో నిర్మించిన రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ 2600 మెగావాట్ల సామర్థ్యం గలది. ఈ ప్లాంటు ప్రభావం వల్ల దాని పరిసర ప్రాంతాలలోని గ్రామాలలోని ప్రతి ఇంటిలో చర్మవ్యాధుల భారినపడి తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. మరి 2600 మెగావాట్ల ప్లాంటుకు ఇంత ప్రభావం ఉంటే యాదాద్రిలో ఏర్పాటు చేయబోయే 4000 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ పవర్ ప్లాంటు ప్రభావం ఎంతమేరకు ఉండబోతుందో ఊహించడానికే భయంగా ఉంది. అభివృద్ధి పేరిట ఈ పవర్ ప్రాజెక్టు ప్రజల జీవానోపాధిని, జీవించే హక్కును, పర్యావరణాన్ని, ప్రకృతి వనరులను హరించ వేయబోతుంది. రాజకీయ నాయకులు కార్పోరేటు సంస్థలకు కొమ్ముకాసుకుని డబ్బులు దన్నుకొని సామాన్య ప్రజల గుండెలపై బొగ్గు కుంపటి పెట్టడం ఎంతవరకు సమంజసం?

ప్రకృతికి, ప్రజలకి హానిచేయని ప్రత్యామ్నాయ తరిగిపోని ఇంధన వనరులను (సౌర విద్యుత్తు, పవన విద్యుత్) ఉపయోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి. ఇటువంటి థర్మల్ ఆధారిత పవర్ ప్లాంటులను వ్యతిరేకించి సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి.

పర్యావరణాన్ని కాపాడుదాం!

జీవించే హక్కుకై పోరాడుదాం!

★ రచయిత, బిఎ ఫైనల్, నిజాం కాలేజి

తిండి పైనే దండయాత్రనా !


■ వాసం ఆనంద్ కుమార్

భారతదేశం అనగానే ప్రపంచంలోని భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు, విభిన్న జాతులకు, మతాలకు, కులాలకు, తెగలకు, భాషలకు, ఆచారాలకు పుట్టినిల్లు. ఒకరి సంస్కృతి, సంప్రదాయాలను మరొకరు గౌరవించుకునే వేదిక. ఈ వేదిక పై నేడు తిండిపైన జరుగుతున్న సంఘటనలు విషాద, విచారగాథలుగా మిగులుతున్నాయి. తిండిపైనే ఇంత రాద్ధాంతం అవసరమా? వేల, కోట్ల సంవత్సరాలు వెనక్కి చూస్తే మండుతున్న గోళం సూర్యుడి విస్ఫోటనం నుంచి ఏర్పడ్డ శకలాలలో భూమి ఒకటి, ఈ భూమి చల్లారాక దీనిపై నీరు ఏర్పడటం, నీటిలో సైనో బాక్టీరియా, నాచు, క్రిములు ఒక దాని వెనుక మరొక జీవి ఉద్భవించినట్లుగా సైన్స్ చెప్తుంది. నిరూపించింది. ఈ ఉద్భవించిన జీవులు మనుగడ కోసం ఆహారపు వేట మొదలైనది. మనం నిత్య జీవితంలో అనేక సంఘటనలను జీవరాశుల ఆహారపు గొలుసు ద్వారా చూస్తుంటాం. ఈ క్రమంలో జీవులు మనుగడ కోసం ఒక జీవిపై మరొక జీవి ఆధారపడుతూ జీవిస్తున్న మాట జగమెరిగిన సత్యం. ఒక్కసారి ఆహారపు గొలుసు గమనిస్తే:

1. గడ్డి- మిడత/ పురుగులు - కప్ప - పాము - గద్ద / మనిషి
2. గడ్డి - మేక - మనిషి
3. గడ్డి - పురుగులు - పక్షులు - గద్ద / మానవులు.
4. గడ్డి / చెట్లు - కుందేలు / దుప్పి / ఆవు - పులి / సింహం /మనిషి.

పైన చూపిన ఆహారపు గొలుసులో విడదీయరాని బంధం ముడిపడినది. ఈ ఆహారపు చక్రంలో ఎక్కడ తేడా వచ్చినా సమస్త జీవుల మనుగడ ప్రశ్నార్థకం అనేది నగ్న సత్యం. భూమి మీద పెరిగే గడ్డితో మొదలైన ఆహారపు గొలుసులో చివరగా ఉన్న గద్ద, పులి, మనిషి మొదలైనవాటి మరణాంతరం సూక్ష్మజీవులకు ఆహారంగా కొనసాగక తప్పదు. వీటి నుంచి గడ్డికి బలం, ఆహారం చేకూరుస్తూ భూమి మీద నిరంతరం ఆహారపు గొలుసు కొనసాగుతుంది.

మన దేశం విభిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు, ప్రపంచంలోనే నిలువెత్తు నిదర్శనం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు భిన్న జాతులు, మతాలు, కులాలు, తెగలున్నాయో అన్ని సంస్కృతి, సంప్రదాయా ఆచార వ్యవహారాలు కనిపిస్తాయి. ప్రాంతాల వారిగా, తెగల వారిగా ఆహార విషయంలో చాలా తేడాలు, వైవిధ్యాలు మనం చూడవచ్చు తిండి విషయానికొస్తే (ఆహారపు అలవాట్లు) ప్రపంచంలో చైనాలో – అన్నం, సోయ, పాము, కప్పలు ఆహారంగా



తీసుకుంటే, మెక్సికోలో మొక్కజొన్న, కొరియాలో – కుక్కలు, మనదేశంలో తూర్పు ప్రాంతంలో కుక్కలు, ఎలుకలు, గోమాంసంను వీరు ప్రధాన ఆహారంగా తీసుకుంటారు. దక్షిణ, ఉత్తర భారతదేశంలో – అన్నం, చపాతీలు, మేక మాంసం, కొందరు గోమాంసంను ప్రధాన ఆహారంగా తీసుకుంటారు. మాంసం విషయానికొస్తే ముఖ్యంగా ముస్లింలు, దళితులు, బడుగు బలహీన వర్గాలు, ఆదివాసులు ఎక్కువగా మాంసాన్ని ఆహారంగా తీసుకుంటారు. ఎందుకంటే మనిషి ఆరోగ్యకరంగా ఉండాలంటే పుష్టికరమైన ఆహారం తీసుకోవాలి కనుకా, మాంసం, కూరగాయాలు, గ్రుడ్లు విషయంలో ఒకొక్కరు ఒక్కొక్క ఆహారాన్ని ప్రియమైన భోజనంగా స్వీకరిస్తారు. ముఖ్యంగా మాంసంలో ప్రొటీన్లు, ఐరన్, జింక్ లభిస్తుంది. వీటి ద్వారా రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి మనిషి ఆరోగ్యంగా ఉండగలుగుతాడు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే నేడు మన దేశంలో గోమాంసంపై జరుగుతున్న రాద్ధాంతం అంతా ఇంతాకాదు.

ఉదాహరణలు

దేశ రాజధాని ఢిల్లీకి అతిసమీపంలోని దాద్రి గ్రామం-ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సెప్టెంబర్ – 28 నాడు ఇఖ్లాక్ అనే వ్యక్తిని బీఫ్ మాంసం తిన్నాడని, ఇంట్లో కలిగి ఉన్నాడని కొంత మంది దుండగులు కొట్టి చంపారు. నిజంగా మనిషికి నీరు తాగేస్వేచ్ఛ, గాలి పీల్చే స్వేచ్ఛ లేదంటే మనిషి బ్రతికే స్వేచ్ఛ లేనట్లే. ఇంతకన్నా నీచాతి, నీచమైన చర్య మరోటి లేదు. కేరళ రాష్ట్రంలో బీఫ్ ఫెస్ట్ నిర్వహించిన '6' గురు విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేయటం. ఈ రాద్ధాంతాలు చూస్తుంటే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా గోమాంసం అనేది రాజకీయ చర్చగా మారింది. జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో బీఫ్‌ను నిషేధించాలంటూ హైకోర్టు తీర్పునివ్వటం. బీఫ్ పై నిషేధాన్ని రద్దుచేయాలంటూ అసెంబ్లీ దద్దరిల్లింది. బీఫ్ ఫెస్ట్ నిర్వహించినందుకు ఆ రాష్ట్ర స్వతంత్ర ఎంఎల్ఏ షేక్ అబ్దుల్ రషీద్‌పై అక్టోబర్ 8, 2015 నాడు బిజెపి ఎంఎల్ఏలు సభలో దాడి చేశారు. రాష్ట్రంలోని మొయిన్‌పురిలో ఇంట్లో గోవు చర్మం ఉందని దాన్ని చంపి, చర్మాన్ని ఇంట్లో వుంచుకొన్నారనే నేపథ్యంలో కొంతమంది దుండగులు, అల్లరి మూకలు పెద్ద ఎత్తున అల్లర్లకు దిగారు. చర్మాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపి పరిశీలించిన అనంతరం ఈ చర్మం అనారోగ్య కారణంగా చనిపోయిన ఆవుది అని తేలడంతో వివాదం సద్దు మణిగింది. ఈ రకమైన చర్యలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక నియంత్రపాలన దేశంలో ఉన్నామా అన్నది అర్థం కాని పరిస్థితి. భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటూ ఇటువంటి అరాచకాలు సృష్టించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించుకోవాలి. ఎవరి ఆచారాలు, సంప్రదాయాలు వారివి. ఆ విషయానికొస్తే ముస్లీంలు పంది మాంసం తినరు. వీరు పందిమాంసం తినే వారిపై దాడి చేస్తే గోమాంస వ్యతిరేకులు ఊరుకుంటారా? దేశ వ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో గోమాంసం నిషేధించారు. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తున్నారు. ఈ ధోరణి, అమలు సరియైనవి కాదు. దేశం శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలంటే ఇటువంటి ఆచార, సంస్కృతి, సంప్రదాయాల జోలికిపోకుండా వారి వారి ఇష్టాలను వారికి వదిలేసి ప్రజాస్వామ్య దేశంగా నిరూపించుకుంటే మంచిది. మనిషికి తినే స్వేచ్ఛ లేకుంటే బ్రతికే స్వేచ్ఛ కూడా లేనట్లే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న న్యాయవ్యవస్థలు దేశాల, ప్రాంతాల వారీగా ఉన్నా ఆచార వ్యవహారం నుంచి వచ్చిందనేది జగమెరిగిన సత్యం. ఇకనైనా భారత ప్రభుత్వం తిండిపై దండయాత్రను నిలిపివేసి, ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలవాల్సిన అవసరం ఉంది.

★ **రచయిత, ఆదివాసీ విద్యార్థి సంఘం,**
కెయు, న్యాయ కళాశాల

(38వ పేజీ తరువాయి)

పిల్లలు ఇంటి దగ్గర పాఠ్యపుస్తకాలను జాగ్రత్తగా దాచిపెట్టి తమకు ఇష్టమైన ఆటలపై దృష్టి మరల్చడం కొంతమంది చేస్తే, మరికొంత మంది పుస్తకాలను తెరిచి తెరువనట్లు కొద్దిసేపు అలా చూసి అరకొర అభ్యసనం చేసి మడిచి పెడుతుంటారు. అందుకే విద్యా సంవత్సరం పూర్తి అయినా కూడా కొంతమంది పిల్లల పాఠ్యపుస్తకాలు కొత్తగా కనిపిస్తుంటాయి. ఒంటరిగా అభ్యసనం సరిగ్గా జరగడం లేదు. విద్యార్థుల అభ్యసనంలో తోడ్పడాల్సిన పాఠ్యపుస్తకాలు అభ్యసనం కుంటుపడటంలో తోడ్పడుతున్నాయి. పాఠ్యపుస్తకాలు పిల్లల జ్ఞానాన్ని విస్తృత పరుచుకొనుటకు ఉపయోగపడాలి. కానీ కనీస అభ్యసనం మాత్రం తరగతి గదిలోనే బోధనతోపాటు జరగాలి. అందుకు బోధన-అభ్యసన ప్రక్రియలో పిల్లలను భాగస్వామ్యం చేయాలి.

పాఠ్యపుస్తకాలు మంచి భాషతో రాసి బాగాడిజైన్ చేసి నైపుణ్యంతో ఎడిట్ చేస్తే సరిపోదు. అవి పరస్పర చర్చకు తగ్గట్టుగా ఉండాలి.

మనకు కావల్సింది గురుకులాలు కాదు గాని గురుకులాల్లో బోధించబడే బోధన విధానంను పోలిన బోధనా విధానాన్ని ప్రస్తుత విద్యావిధానంలో అమలుపరుచగలిగితే విద్యావ్యవస్థలో ఉపయోగ కరమైన మార్పులు రావడమే కాకుండా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే సామెత కూడా రుజువు అవుతుంది.

కాలువ మల్లయ్య కథల్లోని వస్తువైవిధ్యం

కొత్తపల్లి తిరుపతి

కాలువ మల్లయ్య కథల్లో వస్తు వైవిధ్యాన్ని గమనించవచ్చు. ఎంతోమంది నూతన కథా రచయితలకు మల్లయ్య రచనా శైలి ఒక ఆదర్శవంతంగా కన్పిస్తుంది.

"అనగా అనగా ఒకరాజు, అతనికి ఏడుగురు కొడుకులు. వారు వేటకెళ్లి ఏడు చేపలు పట్టి ఎండపెట్టారు. అందులో ఒక చేప ఎండదు..." ఈ కథ వినని తెలుగు వాళ్లుండరేమో! ఊహా లోకపు దృశ్యాలు చూపెడ్తుంటే, మెరుపుల చుక్కలు, తోకలు పట్టుకొని వేళాడే బాలయం కళ్లల్లో కథలను అవలీలగా దరిచేర్చుకోవటం, చిన్న పిల్లలు, చిచ్చరపిడుగులకే కాదు, తలలుపండిన, తలపండాల్సిన వారికి కూడా కథలంటే ఇష్టమే. ఇటువంటి కథలు జనబాహుళ్యంతో ఎంతో ప్రాచుర్యమైనవి.

ఈ కథను లోతుగా పరిశీలించినట్లైతే ఏడు చేపల కథలో ఒక చేప ఎండకపోవడానికి కారణం చిట్ట చివరకు చీమ కుట్టడం వల్ల బాబు ఏడుస్తాడు. బాబు ఏడ్వడంతో అవ్వ బువ్వొండదు, బువ్వ తినకపోవడంతో పిల్లవాడు ఆవుల్ని తోలడు, ఆవు మేయకపోవడంతో గడ్డి అట్లాగే ఉంటుంది. అది అడ్డురావడంతో చేప ఎండదు. చేప ఎండక పోవడంకాదు ఇక్కడి విషయం, ఎందుకు ఎండలేదన్నది ప్రశ్న. ఇన్ని అవాంతరాలకు కారణం చీమకుట్టడం. ఇదీ కథాంశం, అంశానికి బలం, బలానికే ధైర్యం, ధైర్యానికే ఎదురీత. ఆ ఎదురీత ఒక అల్పప్రాణిది. ఎందుకు కుట్టావని చీమని ప్రశ్నిస్తే "నా బంగారు పుట్టలో వేలుబెడితే కుట్టనా?" అంటుంది. అక్కడితో ఆ కథ ముగుస్తుంది. తన పుట్ట, తన సామ్రాజ్యం బంగారుది, బ్రహ్మాండమది. ఆ పలుకులు ఆత్మ విశ్వాసానికి ప్రతీకలు. ఇట్లా ఆ ఆత్మవిశ్వాసంతో ఆలోచింపజేసే పాత్రలు 'నేలతల్లి' లో కోకొల్లలు! అల్ప ప్రాణులు, అనల్ప భావప్రకటనలు మొదలగునవి కథల్లో కన్పించడం విశేషమే అయితే.

కాలువ మల్లయ్యగారి 'నేలతల్లి' కథా సంపుటిలో పాత్రలన్నీ ఇట్లాంటివే. ఇట్లా ఆలోచింపజేసేవే. సాదాసీదా జన జీవనంలో ఆధిపత్యం, పెత్తందారి విధానం, డబ్బుడాబుతో సామాన్యుని జోలికెళ్తే కలిగే పరిణామాలు ఎట్లుంటాయో తెల్పినవే నేలతల్లి పుస్తకంలోని కథలు. వర్ణవిద్వేషాల, వర్గదురహంకారాల మంటల్లో రాలే అమాయక జీవులు. కానీ, బలం ఎప్పుడూ న్యాయం పక్షాన నిలబడ్తుంది. ఈ బలం సంఘటిత బలం, వ్యవస్థ బలంకాదు, వ్యక్తుల కలయిక బలం. కాలువ మల్లయ్య కథలన్నీ పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడి, కలాన్ని కరవాలం చేసేవే. దుర్బుద్ధులను చెండాడేవిగానే కన్పిస్తాయి.

కాలువ మల్లయ్య సమాజంలో జీవిస్తూ, సమాజం కొరకు రచనలు చేస్తున్నారు. సామాజిక స్పృహతో 'మహా యజ్ఞం' అనే కథను రాసారు. వచన రచనా ప్రక్రియ ప్రజల శ్రేయస్సు కోసం, పాఠకులను సులభగ్రాహ్యం చేస్తున్న కథా రచనలతోనే అని నిరూపించారు. కాలరాయబడ్తున్న ప్రజల హక్కులు, రాజకీయ దాష్టీకం, ఉద్రేకంతో ఉండే నిస్వార్థ పౌరుల్లో ఎంతటి వేదనను కల్గిస్తుందో ఈ కథలో చూపారు. అన్యాయమైపోతున్న ఈ వ్యవస్థ ఎంత వేదనను కల్గిస్తుందో ఈ కథలో చూపారు. ఈ వ్యవస్థ మార్చాలని కొందరు మేధావులు ఒక యజ్ఞంలా భావించి సమాజోద్ధరణ కోసం కృషి చేస్తున్న విషయాన్ని, ప్రజల్లో చైతన్యం వస్తున్న విషయాలన్నీ ఈ కథలో చెప్పారు. నక్సలిజం వైపు పోతున్న కొడుకును చూసి ఒక తండ్రి వేదనపడడం, అయినా వాళ్లు ఫలితాలు సాధిస్తారనీ, సాధిస్తున్నారనీ ఆశాభావాన్ని వ్యక్తం చేయడం ఈ కథలోని వైవిధ్యమైన విషయం.

ఈ కథా సంపుటిలో 'చెట్టు', 'ఇల్లు', 'ద్రౌపది' , 'దేశంలో దొంగలుపడ్డారు' వంటి ఎన్నో కథల్లో ఒక్కో కథలో ఒక్కో విషయాన్ని శక్తివంతంగా చెప్పిన తీరు ప్రశంసనీయం. స్వాతంత్ర్యం వచ్చాక దేశీయులే దొంగలయ్యారనీ, అవినీతి ఇట్లా ఉంది అని చెప్పీ చెప్పకనే ఒక ప్రత్యేకమైన టోన్‌లో చెప్పారు రచయిత. న్యాయవాద వ్యవస్థ విషయాన్ని శక్తివంతంగా చెప్తూ "లాయరు బతకడానికి న్యాయాన్ని చంపాల్సిన అవసరం లేదు, అయితే ఈ సమాజ స్వరూప స్వభావాల్లోనే లోపాలున్నాయ"ని ఈ కథలో చెప్పారు. అట్లే 'గ్లోబలైజేషన్', 'తెల్లదుప్పటి', 'స్వర్ణయుగం', 'హక్కు' వంటి కథల్లోనూ ప్రత్యేమైన భావాలను కథలుగా అల్లారు.

'దాహం' కథ మనసున్న వారికి గగుర్పాటును కలిగిస్తుంది. పొట్టకూటికి అడుక్కునే వాడొకడు తప్పు చేయకున్నా దొంగ అని ముద్రవేయబడ్డాడు. ఎంత చెప్పినా వినకుండా ఒక కాలనీవారు అతణ్ణి పోలీసులకప్పగిస్తారు. ఆ దుఃఖంతో అతడు కాలనీ వారిని తిడ్తాడు. కొన్నాళ్లకు ఆ కాలనీలో చోటు చేసుకునే మార్పులను భిన్నమైన స్వరంలో రాసిన ఈ కథ తొందర పాటు కూడదని తెల్పుతుంది. ధనదాహంతో తపించిపోతున్న వారెట్లుంటారో కూడా ఈ కథ తెల్పుతుంది.

సమాజంలో అడుగంటిపోతున్న అనుబంధాలను, అవసరమైపోతున్న ఆప్యాయతలను అక్కడక్కడ మినుకు

మినుకుమనే రైతుల బ్రతుకులతో 'కరువు' కథలో పోల్చారు. రైతుల మరణాలు, విలువలకు వచ్చిన కరువు చేస్తున్న వింత బాధలు బాధిస్తున్నవని ఈ కథలో చెప్పారు. అంతేకాదు ప్రాంతమేదైనా రైతు బాధలు, సామాన్యుల బాధలకంటే భిన్నమైనవని చెప్పారు. దగాకోరు సమాజం బడుగులపై స్వారీ చేస్తుందని ఇద్దరు రైతుల సంభాషణతో బాగా ప్రస్ఫుటించారు.

'మేము నుంచి నేనులోకి' కథలో పెద్ద కుటుంబాలు విడిపోయి, ఒంటరిగా మారుతున్న వైనాన్ని రాసిన తీరు ఆలోచనాత్మకంగా ఉంది. ఈ కాలంవాళ్లు చిన్న కుటుంబాలు ఇష్టపడ్తూ ముసలివారైన తల్లిదండ్రులను పట్టించుకోకుండా వదిలేస్తున్న తీరును ఈ కథలో ప్రశ్నించకుండానే ప్రశ్నించారు రచయిత.

డిటెక్టివ్ యుధిష్టర్ పాత్ర ద్వారా అవినీతి ఇట్లా ఉంది అని చెప్పీ చెప్పకుండ నిర్భయంగా, దేశ ద్రోహులను ఎదుర్కోడానికి సిద్ధమవడమెట్లో నేర్పిస్తున్నారు. 'దేశంలో దొంగలు పడ్డారు' కథలో కాలువ మల్లయ్య స్వాతంత్ర్యం వచ్చాక దేశీయులే దొంగలయ్యారు, కులమతాల వంటి విషయాలే ప్రాముఖ్యత సంతరించుకుంటున్నవనీ జాగ్రత్తలు చెప్పే కథలు నేలతల్లి పుస్తకంలో అనేకం.

అలాగే 'భూమి గుండ్రంగా ఉంది' కథలో పురుషాహంకారాన్ని గురించి భిన్నంగా చెప్పారు. సంస్కారం కథలో మేరీ అనే ఒక దళిత స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని ఎదిరిస్తూ, నమ్మకద్రోహం చేసిన అగ్రవర్ణ యువకుని నిలదీయడం గురించి వివరిస్తూ కాలువ మల్లయ్య ధ్యేయంగా గొప్ప సందేశాన్ని సమాజానికి ఇచ్చారు. 'దొరసానిచీర' కథలో అమానవీయతతో అమాయకత్వాన్ని ధనగర్వులు ఎట్లా ఖూనీ చేస్తారో విషయాన్ని తెలిపారు. కామదాహానికి చాకలి పుల్లమ్మ ఎట్లా బలైందో చదువుతుంటే ఇది ఖచ్చితంగా నిస్సిగ్గు సమాజమే అన్పిస్తుంది. పాఠకునికి పాత్రలపై విపరీతమైన కోపం, అసహ్యం, జాలి, దయ వంటి అన్నీ భావనలను కలిగిస్తూ అసాంతం చదివేదాకా పుస్తకం వదలనీయవు. రచయిత కథలను అల్లే విధానం, కథా కథనం గొప్పగా ఉన్నవి. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలు ప్రజా జీవన పద్ధతులు, గ్రామాల్లోని యువత ఆలోచనాతీరు, అస్తిత్వానికై, పైకెదగడానికై ప్రజలు పడ్తున్న వేదన అట్టడుగు వర్గాల్లోని వారిలో ఆత్మవిశ్వాసం పెంచుకొనే తీరు, హక్కును హక్కుగా గుర్తించడం వంటి మౌలిక విషయాలన్నీ స్పృశిస్తూ రాశారు. కాలువ మల్లయ్య కథలు నిజ జీవనానికి దర్పణాలు. తెలంగాణ భాష, యాసను, మాండలిక సొగసులను మరచి పోనివ్వకుండా బలాన్నిస్తున్న, బతికిస్తున్నవీ కథలు.

చెట్టును తల్లితో పోలుస్తూ, చెట్లు నరకవద్దన్న సందేశాన్ని 'చెట్టు' కథలో చెప్తూనే, పనికి రాని ఆకు మాకూ, పనికొచ్చే పండు మీకా అని నిలదీసిన కొత్త తరాన్ని తేటతెల్లంజేశారు. అన్నీ ఓర్చుకునే పాతతరానికి యువతకూ ఉన్న తేడాను, పెత్తందారీ స్వభావంపైనున్న నిరసననూ తెల్పారు. స్వధర్మం పరధర్మం కథ కూడా కులాల కుత్సితత్వాన్ని నిరసించేదే. పొట్ట గడవడానికి కృషి చేసుకుంటూ చెప్పులు అమ్మే దుకాణం పెట్టుకున్న ఒక బ్రాహ్మణుని స్థితిని వివరించారు. ఇట్లా కాలువ మల్లయ్య కథల్లోని పాత్రలన్నీ మారుతున్న సమాజాన్ని ప్రతిబింబించేవే. కథలన్నీ మనసుల్ని కదిలించేవే. ఈ సంపుటంలో ఉన్న ముప్పై కథల్లోనూ వస్తువైవిధ్యంతో పాటు శిల్పం, కథా కథన రచనా విధాన శైలీ అన్ని కూడా సంవేదన, సంలీనతలతో చక్కగా చదివించే రీతిలో ఉన్నవి.

ఈ కథలన్నీ 'జీవిత వృక్షానికి పూసినపూలు' అంటూ పోరంకి దక్షిణమూర్తి తమ ముందు మాటలో అన్నారు. మన చుట్టూ అల్లుకుని ఉన్న నిజాల్ని నిర్భయంగా కథలు చెప్పడాన్ని "ఈనాటి భౌతిక వాస్తవాల దర్శనం" అంటూ విహారి అన్నారు. రచనని ఒక బాధ్యతగా చేసుకొని కథలు రాస్తున్నారని కాలువ మల్లయ్యగారి కథలపై వేదగిరి రాంబాబు అనడం ఎంత సమంజసంగా ఉందో, "అస్తిత్వం" కోసం అనివార్య యుద్ధాలుగా కథలల్లిన ఈ కథలను గురించి "పాతికేళ్ళ తెలంగాణ బతుక్కు ఆనవాళ్లు" అంటూ సంగిశెట్టి శ్రీనివాస్ స్పందించడమూ అంతే సమంజసంగా ఉంది. 30 కథలున్న ఈ సంపుటిలోని తొమ్మిదవ కథైన కలికితురాయి వంటి కథ 'నేలతల్లి' పేరునే ఈ పుస్తకానికి పెట్టడంతో కాలువ మల్లయ్య గారికి ఈ నేలన్నా, ఈ మట్టన్నా, ఈ ప్రజలన్నా ఎంతటి మమకారమో తెలుస్తుంది. ఇట్లాంటి కథలే పాఠకులు చదివి ఆనందించగలరనీ, ఆలోచించగలరనీ విశ్వాసంతో చెప్పవచ్చు. కాలువ మల్లయ్యగారి కథల్లోని మానవీయ విలువలు నేటి తరానికి ఎంతో అవసరమైనవని కూడా గుర్తుచేస్తాయి.

★ రచయిత, తెలుగు విభాగం, ఓ.యు.

మూలవాసి రావణ చక్రవర్తి

■ మూలనివాసి రాణునాయక్

మన దేశ చరిత్రలో ప్రజలకు సుస్థిరమైన, ప్రజా సంక్షేమ రాజ్యాలుగా కొనసాగిన గణరాజ్యాల చరిత్ర ఎంతో ఘనత వహించినది. గణరాజ్యం అనగా నేటి గణతంత్ర (రిపబ్లిక్) రాజ్యం అని అర్థం. గనన అనగా లెక్కించడం, ఈ రాజ్యంలో ప్రతి మనిషికి ఆనాటి గణరాజ్యాధిపతి పరిపాలన స్వాభిమానాన్ని సెల్ఫ్ రెస్పెక్ట్ – స్వయం గౌరవం అందించే విధంగా పరిపాలన జరిగింది. ఇట్టి గణరాజ్యాలు పాలించినవారు మూలనివాసి ద్రావిడ రాజులు, నేటి బహుజనులందరు నాటి ద్రావిడుల వారసులే. నేటి మన దేశ గణతంత్రతకు పునాది ఆనాటి గణరాజ్యాలే ఆధారం అనేది చరిత్ర చెప్తున్న వాస్తవం.

నేడు మనదేశంలో ఉన్నటువంటి కులవ్యవస్థ, మతవ్యవస్థ, మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ విధానాలు, ఆనాటి ద్రావిడ గణరాజ్యాలలో లేవు. ప్రకృతిని గొప్పదిగా చెప్పుకునే పద్ధతులు మాత్రమే ఆనాడు వుండేవి. నేటి మన సమాజంలో సుమారు 7 వేల కులాలు ఉన్నాయి. ద్రావిడ రాజులను ఓడించి, ద్రావిడ రాజ్యాలను ఆర్యులు కుట్ర పూరితంగా స్వాధీనం చేసుకొని రాజ్యాధికారానికి వచ్చి కులవ్యవస్థను పుట్టించింద్రు. క్రీ.పూ. వేల సంవత్సరాల క్రితం ఇతర దేశాల నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చిన వారే ఆర్యులు.

హరప్పా, సింధు నాగరికత పేరుతో గొప్పగా పేరు పొందిన చరిత్ర మూలవాసి బహుజన ద్రావిడులదే అని చరిత్రకారులు నిర్ణయించారు. ఎంతో గొప్పగా కొనసాగిన సింధు నాగరికతను వలస వచ్చిన ఆర్యులు నాశనం చేసి నాటినుంచి నేటిదాకా ఈ దేశంలో గల ఇత్యాధిక సంఖ్యాకులైన ద్రావిడ జనులను అనగా మూలనివాసి బహుజనులను ఎన్నో రకాలుగా అణిచివేస్తూ, హింసిస్తూ ద్రావిడ సంస్కృతిని హేళన చేస్తూ, అవమానపరుస్తూ తమ కుట్రపూరిత అగ్రతత్వపు చేష్టలు చేస్తూనే ఉన్నారు.

సింధు నాగరికతకు ముందే కొనసాగిన చరిత్ర ద్రావిడులది అని జాంబవపురాణం చెప్తున్నది. బ్రాహ్మణులు చదివే వేదమంత్రాలలో "భరతఖండే, భరత వంశే అనే సంస్కృత పద్యంలో జంబుద్వీప ప్రస్తావన ఉంటుంది. మన దేశానికి భారత్, ఇండియా అనే పేర్ల కంటే పూర్వం జంబూద్వీపం అనే పేరు ఉన్నదని మనదేశ చరిత్ర, పురాణసాహిత్యం తెల్పుతున్నది. జాంబవపురాణం మన దేశ పురాణ సాహిత్యంలో మొట్టమొదటి గ్రంథం అని అందరూ ఒప్పుకున్నారు. జంబుద్వీపం పేరిట నేడు ఒక మాస పత్రిక ప్రచురింపబడుతున్నది.

జంబుద్వీపం పేరుతో కొనసాగిన మన దేశాన్ని ద్రావిడ మహారాజు జాంబవ చక్రవర్తి పరిపాలించినట్లు, సమన్యాయ పాలన అందించినట్లు, గణతంత్ర విధానాన్ని పాటించినట్లు దేశ చరిత్రలో ఆధారాలు ఉన్నాయి. జాంబవ చక్రవర్తి పేరుతో మనదేశంలో కొన్ని చోట్ల దేవాలయాలు ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాల క్రితం రంగారెడ్డి జిల్లాలో కోళ్ళపడకల్ అనే ప్రదేశంలో, వరంగల్ జిల్లా నర్మెట్ట మండలం హన్మంతపూర్ గ్రామంలో జాంబవ చక్రవర్తి నిలువెత్తు విగ్రహాలు స్థానిక ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విగ్రహాలు గల ప్రదేశాలలో ప్రతి సంవత్సరం ఎంతో గొప్పగా జాంబవ జాతర నిర్వహించబడుచున్నది. జాంబవ చక్రవర్తి చరిత్రను మూల నివాసులైన దక్కలివారు జాంబవ పురాణ కథను కథ రూపంలో ప్రదర్శన చేస్తూ, వేలాది సంవత్సరాలుగా, ఈ కథా రూపాన్ని జాంబవ చక్రవర్తి గొప్పతనాన్ని కాపాడుతూ వస్తున్నారు. ద్రావిడ సంస్కృతిని రక్షిస్తూవస్తున్న సాంస్కృతిక వారధులు అయినటువంటి దక్కలివారు నేడు బుక్కెడు బువ్వకు కూడ నోచుకోకపోవడం సభ్య సమాజానికి సిగ్గుచేటు. దక్కలి వారిలాగానే ఎన్నో దళిత కులాలు దీనస్థితిలో నేటికి ఉన్నాయి. వీరి గురించి పట్టించుకున్న పాలకుడే లేడు. ఈ మధ్యకాలంలో "జాంబవ పురాణం" పుస్తక రూపములో వెలువడింది.

మూలవాసి అరుంధతి అనే మహిళను వశిష్టుడు అనే ఆర్య బ్రాహ్మణుడు కులం లేని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో "మా అరుంధతి ఆకాశంలో.... మా బతుకులు పాతాళంలో...." అంటూ నేడు మూలనివాసి బహుజన ద్రావిడులు ప్రశ్నించి ఉద్యమిస్తున్నారు. కులం లేని పెళ్లి ఆ కాలంలో జరిగితే, నేటి వరకు కుల వ్యవస్థ రద్దుకాక పోగా మనుషులను మానసిక హింసకు గురిచేసి భౌతిక దాడులకు కారణం కావటం సామాజిక అణిచివేతగా, సామాజిక ద్రోహంగా చెప్పవచ్చు.

శ్రీకృష్ణుడు పెండ్లి చేసుకున్న ఒక మహిళ పేరు జాంబవతి. ఈమె జాంబవంతుని కూతురు. వీరిది కులం లేని పెండ్లి. కుల నిర్మూలన ప్రయత్నం నాడే జరిగితే, ఈ నాటికి కులం నశించకపోగా రోజురోజుకు పటిష్టమవటం సమాజాభివృద్ధికి గొడ్డలిపెట్టు. జాంబవతి తండ్రి అయిన జాంబవంతున్ని గుడ్డేల్లు

(ఎలుగుబంటి) తలకాయ ఉన్నట్లుగా వక్రీకరించడం ఆర్య సాహిత్యం చేసిన ద్రోహం.

దశావతరాలు ఎత్తిన విష్ణుదేవుడు చేసిన హత్యలు బలి చక్రవర్తి హత్య, సోమకాసుర హత్య, హిరణ్యాక్షుడి హత్య, హిరణ్యకశిపుడి హత్య, రావణాసురుడి హత్య మొదలగునవి అనగా ద్రావిడ రాజ్యాలకు అధిపతులుగా ఉన్న ద్రావిడ రాజులను చంపేటందుకు చేసిన కుట్రలే దశావతారాలు.


మహాబలిపురం రాజధానిగా ద్రావిడ దేశాన్ని పరిపాలించిన గొప్ప మానవతావాది, ప్రజా రక్షకుడు, గొప్ప దానగుణశీలి బలిచక్రవర్తి పేరులోనే చక్రవర్తి అనే మాటను కలిగి ఉన్న సార్థక నామధేయుడు. ఇటువంటి ముని మనిషిని చెడ్డవాడిగా, రాక్షసుడిగా చెప్పడం ఆర్యులు చేసిన కుట్రలో భాగమే. కేరళ రాష్ట్రంలో మలయాళ ప్రజలందరూ తాము జరుపుకునే గొప్ప జాతీయ పండుగ అయిన "ఓనం పండుగ సందర్భములో బలి చక్రవర్తి మళ్లీ పుట్టాలి, బలిచక్రవర్తి రాజ్యం రావాలి" అనే ఆకాంక్షను వారు ఇప్పటికి చెప్పుకుంటూ ఉంటారు. దీనిని బట్టి మనకు అర్థం అవుతున్నది ఏమిటంటే బలిచక్రవర్తి ఈ దేశాన్ని పరిపాలించిన గొప్ప ద్రావిడ చక్రవర్తి అని తెలుస్తున్నది. మహాత్మజ్యోతిరావుపూలే చేసిన పరిశోధనల్లో బలిచక్రవర్తికి సంబోధించిన చారిత్రక వాస్తవిక ఆధారాల ద్వారా ఇతడు రాక్షసుడు కాదని, ప్రజా రక్షకుడని పేరులోనే చక్రవర్తి అనేది ఉందని సప్రమాణంగా నిరూపించడం జరిగింది. సోమకాసురుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు లాంటి ప్రజా రక్షకులను రాక్షసులుగా ఆర్య సాహిత్యం వక్రీకరించింది. నిజానికి వీళ్ళందరూ రాక్షసులు కాదు, రక్షకులు. ప్రజలను రక్షించే పాలకులు.

దశావతారాలలో ఒకటైన విష్ణుమూర్తి పాత్ర శ్రీరాముడు. ఇతడు చేసిన పని ద్రావిడ చక్రవర్తి అయిన మూలవాసి రావణ చక్రవర్తిని హత్య చేయడం రాముడు చేసిన అరణ్యవాసంలో సుమారు యాభైవేల మంది మూల నివాసి బహుజన ద్రావిడులను చంపిండు. రావణుడు సీతను కిడ్నాప్ చేయడం చెడు పనిగా చెప్పే ఆర్య సాహిత్యకారులకు, రావణుడి చెల్లెలైనా శూర్పణకు జరిగిన అన్యాయం, తాటకి హత్య, వాలిహత్య మొదలగునవి కనబడలేదు. ఆర్య సాహిత్యం చేసినదంతా ద్రావిడులను అవమాన పరచడం హేళన చేయడం శ్రామిక జీవులైన ఉత్పత్తి కులాలను అవమానపరిచేది ఆర్య సాహిత్యం. ద్రావిడ రాజు రావణాసురున్ని తెలుగు రాష్ట్రాలతో పాటు కొన్ని రాష్ట్రాలలో రావణవధ జరుగుతుంటే తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో రావణాసురున్ని కీర్తిస్తూ పూజ కార్యక్రమాలు జరుపుతుంటారు.

ద్రావిడ చక్రవర్తి అయిన మహిశ మహారాజును దుర్గ అనే మహిళతో కుట్రతో ఆర్యులు చంపించిండ్రు. మహిశ మహారాజు వాస్తవానికి రాక్షసుడు కాదు. ప్రజా రక్షకుడు. ద్రావిడ రాజు. ద్రావిడ రాజులందరిని చంపి, ద్రావిడ రాజ్యాలను ఆర్య రాజ్యాలుగా మార్చాలే అని ఆర్యులు పన్నిన కుట్రలో భాగమే. కాబట్టి ద్రావిడ మహారాజు అయిన మూలవాసి రావణ చక్రవర్తిని రావణ వధ పేరుతో అవమానించడం ద్రావిడ జాతికి అనగా మూలనివాసి బహుజనులను అవమాన పరచడమే కాబట్టి ప్రతి సంవత్సరం దసరా నాడు జరిగే బహుజన వ్యతిరేక రావణ వధ తతంగాన్ని వెంటనే రద్దుజెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం.


ఈ దేశ చరిత్రకు పునాదులు అయినటువంటి మూలనివాసి బహుజనుల ద్రావిడ సంస్కృతిని కాపాడుకుందాం.

★ రచయిత, ద్రావిడ స్వాభిమాన వేదిక







టైగర్ జోన్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ప్రజాభిప్రాయ సేకరణ, ర్యాలీ



ప్రజాస్వామ్య తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న కాశీం వేదికపై ప్రజా సంఘాల నాయకులు హాజరైన ప్రజలు



టిపిఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆకుల భూమయ్య సంస్మరణసభలో మాట్లాడుతున్న ప్రొ॥ అన్వర్‌ఖాన్



సీడ్ ప్రతిరైతుల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో కమీషనరేట్ ముందు తెలంగాణ రైతాంగ సమితి ధర్నా



ప్రజాకళామండలి ప్రధానకార్యదర్శి కోటిని విడుదల చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గన్‌పార్కు వద్ద నిరసన

NADUSTUNNA TELANGANA (Monthly)
RNI NO. APTEL/2011/37247
Postal Registration No. HSE/994/2016-2018
Postal Permission Date : 3 & 5 every month
ISSN 2349 - 2376
Published on 02.01.2016

'నడుస్తున్న తెలంగాణ'ను ఆర్థికంగా ఆదుకోండి

నడుస్తున్న తెలంగాణ మీది. మాది. మనందరిది.
నొసటి నుంచి రాలిన చెమట చుక్కది. పోరులో చిందిన నెత్తుటి బొట్టుది.
అంటరాని వెలివాడది, ఆశయాల బడుగు జీవిది.
విద్యార్థులది, అధ్యాపకులది, ఉద్యోగులది,వ్యాపారస్తులది.
కనుక ఈ పత్రికను నడపడానికి మీకు తోచిన ఆర్థిక సహాయం చేయండి.
పత్రికను పదికాలాలు నిలబెట్టండి

నడుస్తున్న తెలంగాణలో మీ ప్రకటనలకై సంప్రదించండి

చివరి కవర్ (కలర్‌లో పూర్తి పేజీ)	:	రూ. 40,000
రెండవ కవర్ (కలర్‌లో పూర్తి పేజీ)	:	రూ. 35,000
మూడవ కవర్ (కలర్‌లో పూర్తి పేజీ)	:	రూ. 30,000
పూర్తి పేజీ (బ్లాక్ & వైట్)	:	రూ. 25,000

Stamp

ఈ పత్రికను చదివాక మీ అభిప్రాయాలు రాయడం మర్చిపోవద్దు.
మీ సూచనలే మా తొవ్వకు వెలుగు.

To Printed Matter **BOOK-POST**

From :
ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ
క్వార్టర్ నెం. ఆర్-9, ఓయు క్వార్టర్స్, ఉస్మానియా యూనివర్సిటి
హైదరాబాద్ - 500 007. ఫోన్ : 9290745490

చందాదారులుగా చేరండి - చేర్పించండి
సంవత్సర చందా 150/- రూ.

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:
62254225854, ఎస్‌బీహెచ్,
రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్
IFSC : SBHY0020350

Printed, Published and Owmed by M.SNEHA LATHA, **Printed at :** TELANGANA PUBLICATIONS, H.NO.1-1-305, P.No.17, ROAD NO.6, BALAJI COLONY, MOHAN NAGAR, KOTHAPET, SAROORNAGAR(M), RANGAREDDY(Dist), A.P.-500035., **Published at :** TELANGANA PUBLICATIONS, H.NO.1-1-305, P.No.17, ROAD NO.6, BALAJI COLONY, MOHAN NAGAR, KOTHAPET, SAROORNAGAR(M), RANGAREDDY(Dist), A.P.-500035., **Editor :** Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M285
పుస్తకం పేరు	వరుస్తున్న తెలంగాణ
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	nil
ఖాళీ పేజీలు	nil
లేని పేజీలు	nil
తయారు చేసినది	Hema
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	Priyanka
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good